www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20

అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 | సంచిక : 191 | గురువారం 03-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



కలెక్టర్ కారు

కలెక్టర్ కారులో ఇసుక రవాణా..

- రీచ్‌ల్లో ఉచిత బిల్లుల విక్రయం
- కార్ల నెంబర్లతో.. లారీల్లో తరలింపు
- జేసీ, మైన్స్ ఏడీ కారులకు రశీదులు
- రెవెన్యూ ఉద్యోగి బరితెగింపు

'విశాలాంధ్ర' పరిశోధనలో తేటతెల్లం

అక్రమ 'ఘను'లకు అడ్డుకట్ట వేయాలని... అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సిక్కోలు కలెక్టర్ ప్రవేశపెట్టినా...ఇసుకాసురులు ఖాతరు చేయటం లేదు. సర్కారు బిల్లు లేకుండా ఇసుక లారీ రోడ్డు మీదకు వస్తే ఇట్టే సీజ్ చేసే ప్రక్రియను చేపట్టినా... అవే బిల్లులను ఓ కాంట్రాక్టు సంస్థ సొమ్ము చేసుకుంటోంది. ఉచిత ఇసుకకు అనుమతి ఇచ్చే బిల్లును వెయ్యి రూపాయలకు అమ్మేస్తోంది. వీఆర్ఏ, పంచాయతీ కార్యదర్శులు ఇవ్వాల్సిన బిల్లులను ఉప ముఖ్యనేత అనుచరవర్గానికి చెందిన గుత్తేదారు సంస్థ బ్లూఫ్రాగ్ అడ్డంగా విక్రయిస్తూ విశాలాంధ్ర బృందానికి చిక్కింది. ఏకంగా కలెక్టర్, జేసీ, మైన్స్ ఏడీ కార్ల నెంబర్లనే లారీలుగా పరిగణిస్తూ బిల్లులను తెగనమ్మింది.

ఈ విషయం కలకలం రేపినా... గనుల శాఖ మాత్రం కాంట్రాక్టు సంస్థను నిలువరించచక పోవటం విశేషం.

3లో



కలెక్టర్, జేసీ కార్లకు జారీ చేసిన ఇసుక రవాణా బిల్లు

ఏపీకి మోడీ దగా..!

- ప్రత్యేక హోదా సాధనకు నేడు జంతర్‌మంతర్‌లో ధర్నా
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రధానిగా ఉండటం దేశ ప్రజల దురదృష్టమని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొద్దిమంది రైతులే రుణాలు తీసుకుంటున్నారని మోడీ అనటం బాధాకరమన్నారు. దేశంలోని రైతులు అందరూ రుణాలు తీసుకుంటున్నారని తెలిపారు. రుణమాఫీ చేయకుండా ఉండటానికే మోడీ అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండు చేస్తున్నామన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధన, కేంద్ర వైఖరికి నిరసనగా గురు, శుక్రవారాల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర భారీ ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని వెల్లడించారు. ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలు, అన్ని సంఘాలు, మేధావులు విభజన హామీలు అమలు చేయాలని కోరుతున్నాయని తెలిపారు. పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బీజేపీ కనీసం ఐదేళ్లు కూడా ఇవ్వకుండా మొండి చేయి చూపిందని మండిపడ్డారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం ఇప్పటి వరకు 15 వందల కోట్ల రూపాయలే ఇచ్చిందని తెలిపారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం.. రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. రెవెన్యూ లోటు 16వేల కోట్లు ఉండంటే.. కేవలం మూడున్నర వేల కోట్లే ఇచ్చారని పేర్కొన్నారు.



శబరిమలలో ఉద్రిక్తత

శబరిమల : మహిళలు తమ పంతాన్ని నెగ్గించుకున్నారు. శబరిమల ఆలయంలోకి ప్రవేశించి చూపించారు. ఆలయంలోకి అన్ని వయస్కుల మహిళలు ప్రవేశించవచ్చునన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు కేరళ ప్రభుత్వం కట్టుబడి ఉండటంతో బుధవారం ఇద్దరు మహిళలు గుడిలోకి ప్రవేశించి చరిత్ర సృష్టించారు. కనకదుర్గ (44), బిందు (42) తెల్లవారుజాము3.38 గంటలకు

- మిగతా 2 లో

ధీరోదాత్తలు...!

సుప్రీం తీర్పు అమలుకు కొంగు బిగించిన మహిళలు

(ఆదిత్య అమీర్)

ఇద్దరు యువ మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించడం ద్వారా సుప్రీంకోర్టు తీర్పును విజయవంతంగా అమలుచేశారు. అన్ని వయసుల మహిళలు శబరిమల ఆలయంలో ప్రవేశించవచ్చునని కోర్టు తీర్పునిచ్చింది. బుధవారం కనకదుర్గ, బిందు వెనుక ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించారు. ఈ అంశాన్ని తెలుసుకున్న ప్రధానపూజారి కంద్రరు రాజీవరు ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ పేరుతో శుద్ధి చేసిన తర్వాతనే తిరిగి ఆలయాన్ని భక్తుల కోసం తెరిచారు. ఆలయంలోకి ప్రవేశించిన మహిళలకు మఫ్టీలో ఉన్న పోలీసులు రక్షణ కల్పించారు. సుప్రీం తీర్పును సైతం ఉల్లంఘించి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్న మతోన్మాదశక్తులు బుధవారం కూడా ఆందోళనకు దిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ పరిణామంపై వ్యాఖ్యానిస్తూ, వామపక్ష ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం 50లక్షలమంది మహిళలు 'మహిళావాల్'(మానవహారం)ను నిర్మించగా వందలాదిమంది బుర్ఖాలు ధరించిన ముస్లిం మహిళలు కూడా పాల్గొన్నారనీ, శుద్ధి చేయడం లాంటి చర్యలతో అంటరానితనాన్ని మళ్లీ ప్రవేశపెడుతున్నారని వ్యాఖ్యానించారు. గత సెప్టెంబరు 28న సుప్రీం ఇచ్చిన తీర్పును మతోన్మాద శక్తులు ఉల్లంఘిస్తున్నాయన్నారు. ఈ నెల 22న సుప్రీంకోర్టు రివ్యూ పిటిషన్లను విచారణ జరిపేటప్పుడు ఈ ఉల్లంఘన కోర్టు దృష్టికి వస్తుంది. శుద్ధిచేసిన ప్రధాన పూజారి, ఆయన సహాయకులపైన ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టంక్రింద అరెస్టు చేయాలని డిమాండు చేశారు. అయితే హిందుసంస్థలు పూజారి చర్యలను సమర్థించాయి. 10 రోజులుగా ఆలయ ప్రవేశం చేయాలని ప్రయత్నిస్తున్న మహిళలు అంతిమంగా విజయం సాధించారు. కేరళలో చట్టానికి, విశ్వాసానికి

- మిగతా 2 లో



రాఫెల్ రగడ



రాహుల్ అసత్య ప్రచారం : జైట్లీ

'కొందరు సహజంగా నిజాలను ఇష్టపడరు. రఫేల్ ఒప్పందంపై రాహుల్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. గతంలో జరిగిన రక్షణ కుంభకోణాల్లోని కుట్రదారులు ఇప్పుడు మోడీ ప్రభుత్వం వైపు వేలెత్తి చూపిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును రాహుల్ ఎలా సవాలు చేస్తారు. కనీసం యుద్ధ విమానం అంటే ఏంటో తెలియని వ్యక్తి కాంగ్రెస్‌కు అధ్యక్షత వహిస్తున్నారు. కొందరు డబ్బుకు సంబంధించిన విషయాలను బాగా అర్థం చేసుకుంటారు, కానీ జాతీయ భద్రత వారికి అర్థం కాదు. నేషనల్ హెరాల్డ్ కేసు, అగస్టా వెస్ట్‌ల్యాండ్ కుంభకోణాలు ఎవరి హయాంలో జరిగాయి? రఫేల్ డీల్‌కు సంబంధించిన పత్రాలు గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ పడక గదిలో ఉన్నాయని గోవా మంత్రి ఫోన్‌లో మాట్లాడిన టేప్ ఉందని రాహుల్ చెప్పడంలో ఏమాత్రం నిజం లేదు.

మోడీకి ధైర్యం లేదు : రాహుల్

'రాఫెల్ ఒప్పందంపై ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ప్రధానికి లేదు. అందుకే ఆయన తన గదిలో రాఫెల్ ఒప్పందంలో చాలా లొసుగులు ఉన్నాయి. గతసారి నేను ఈ అంశం లేవనెత్తినప్పుడు ప్రధాని ఐదు నిమిషాలే స్పందించారు. రాఫెల్ ఒప్పందంపై జేపీసీ వేయాల్సిందే. రాఫెల్ విచారణ వ్యవహారం తమ పరిధిలోకి రాదని మాత్రమే సుప్రీం చెప్పింది. జేపీసీ ఏర్పాటు చేయకూడదని చెప్పలేదు గదా. మంగళవారం ఓ వార్తా సంస్థకు మోడీ ఇచ్చిన ముఖాముఖిలో రాఫెల్ ఒప్పందం గురించి అడిగిన ప్రశ్నలకు ప్రధాని సమాధానం చెప్పలేదు. ఒప్పందంలో భాగంగా ఒక్కో విమానానికి రూ.1,600 కోట్ల ధరను వెచ్చించడానికి రక్షణశాఖ ఉన్నతాధికారులు సైతం అభ్యంతరం తెలిపారు.

రెప్పపాటులో

ఘోరం

గుంటూరు జిల్లాలో 8 మంది దుర్మరణం

3లో

హైకోర్టు విభజనపై పిటిషన్ కొట్టివేత

9లో

కొత్త ఏడాది 3.95 లక్షల మంది జననం

ఆయనకే ఆక్రోశం...!

- గుజరాత్‌ను మించుతామనే భయం
- మోడీపై బాబు ఫైర్



అమరావతి: తానేదో ఆక్రోశంలో ఉన్నానని ప్రధాని మోడీ వ్యాఖ్యానించడంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. గుజరాత్‌ను, ఏపీ ఎక్కడ మించిపోతుందేమోనన్న ఆక్రోశం మోడీదని ఎద్దేవా చేశారు. అందుకే రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా అక్కసు వెళ్లగక్కారని చంద్రబాబు విమర్శించారు. తానూ, మోడీ ఇద్దరం సీఎంలుగా పనిచేశామని, మోడీ అహ్మదాబాద్‌కు చేసిందేమీ లేదు గానీ, తాను హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానని సీఎం చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తే అభివృద్ధిలో మించిపోతామనే భయం మోడీదని దుయ్యబట్టారు. మోడీ వ్యాఖ్యల్లో హుందాతనం లేదని, తనను ఎక్కడ నిలదీస్తారో అని రాష్ట్ర పర్యటనను రద్దు చేసుకున్నారని మండిపడ్డారు. పార్టీ నాయకులతో చంద్రబాబు బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'జన్మభూమి-మా ఊరు' విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ 10 రోజులు గ్రామాలు, వార్డుల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. దుష్టశక్తులు పార్టీపై, రాష్ట్రంపై కక్ష కట్టాయని విమర్శించారు. ఎన్నికల ఏడాది కాబట్టి అంతా కీలక సమయంగా భావించి టీడీపీని గెలిపించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని సూచించారు. భావితరాల భవిష్యత్ ఈ ఎన్నికలపైనే ఆధారపడి ఉందన్నారు. ఏపీకి ఇవ్వాల్సిన కరెంట్ డబ్బులు చెల్లించరుగానీ పొరుగు రాష్ట్రం ప్రకటనలు ఆంధ్రలో.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ జీరో అని.. మోడీ, అమిత్ షా, ముగ్గురు సీఎంలు,

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ఎన్నికల వేళ...

కోడి పందేల మేళా..!



- అనుమతి కోసం తెలుగుతమ్ముళ్ల గోల
- డింకీ పేరిట కసరత్తు
- కోస్తాలో భారీ ఏర్పాట్లు
- లోపాయికారిగా సర్కారు సమ్మతి
- ఆంక్షలపై పెదవి విప్పని పోలీసుశాఖ

సంక్రాంతి...అంటే... కోడి పందేలే మదిలో మెదులుతాయి. కోర్టులు, పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించినా పందేల నిర్వహణ ఆగే ప్రసక్తేలేదు. ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు..మంత్రి హోదా నేతలే దగ్గరుండి మరీ కోడి పందేలను నిర్వహించిన ఘటనలు అనేకం. ఇక రాజకీయ పార్టీల నాయకుల సంగతి వేరే చెప్పాల్సిన అవసరమే లేదు. ఈ సంవత్సరం కూడా కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో సంక్రాంతి కోడి పందేలకు పెద్ద ఎత్తున సన్నాహాలు జరుగుతున్నాయి. ఎన్నికల సంవత్సరం కావటంతో ఈ ఏడాది రూ.2 వేల కోట్లపైనే పందేలు సాగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. రాజకీయంగా రాణించాలంటే కోడి పందేలకు అడ్డంకులు చెప్పకూడదని పలు జిల్లాల నేతలు ప్రభుత్వానికి తేల్చి చెప్పినట్లు సమాచారం. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతో పందేలకు అడ్డు చెప్పకూడదనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. పందేల నిర్వహణకు ఆటంకాలు ఎదురవకుండా చూడాలంటూ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు మౌఖికంగా ఆదేశాలందినట్లు తెలిసింది. పందేలకు పరోక్షంగా ప్రభుత్వమే గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో, పోలీసులు కూడా పందేల ఏర్పాట్లపై పెదవి విప్పని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది రాజధాని విజయవాడ కేంద్రంగానే హైకోర్టు కార్యకలాపాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పందేలపై కోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులు వస్తాయోనన్న భయం పందేల రాయుళ్లను వెంటాడుతోంది.

11లో

పక్కా ప్రణాళికతోనే...

- జగన్‌పై హత్యాయత్నం కేసులో కీలక ఆధారాలు
- విశాఖ నగర పోలీస్ కమిషనర్ లడ్డా

విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో : ప్రతిపక్ష నేత, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు కీలక విషయాలు సేకరించారు. ఇప్పటివరకూ సేకరించిన సమాచారాన్ని బుధవారం మీడియా సమావేశంలో నగర పోలీసు కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా విలేకరులకు వివరించారు. లేఖ రాసిన వారి పేర్లను గతంలో పోలీసులు వెల్లడించారని, ఇప్పుడు ఫోరెన్సిక్ ల్యాబ్ వారు కూడా అవే పేర్లను

- మిగతా 2 లో



ప్రపంచం

ఎన్నికలకు ముందే నెతన్యాహుపై చర్య?



టెలీఅవీవ్ : అవినీతి కేసులలో ఇరుక్కున్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్‌నెతన్యాహుపైన ఏప్రిల్‌లో పార్లమెంటు ఎన్నికలు జరగకముందే ఆయనపైన ఏదో ఒక చర్య ఉండే అవకాశంవుందని ఆదేశ అటార్నీ జనరల్ అవిచాయ్‌మండెల్‌బ్లిట్ తెలియజేశారు. ఈ అంశాన్ని ఇజ్రాయిల్ వార్తా ఛానల్ కూడా ధృవీకరించింది. అటార్నీ జనరల్ ఉన్నతస్థాయి న్యాయాధికారులతో నెతన్యాహుపై తీసుకునే చర్యనుగురించి సంప్రదింపులు జరుపుతున్నట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్ తెలియజేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, మాజీ అటార్నీ జనరల్స్‌తో సంప్రదించి ఎన్నికలకు ముందే నెతన్యాహును అభిశంసించే అవకాశం ఉన్నదని వార్తా ఛానల్స్ పేర్కొంటున్నాయి. ఎన్నికలకు ముందు ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్లడం తమ కర్తవ్యమని అటార్నీ జనరల్ తెలిపారు. వీలైనంత త్వరగా తన కర్తవ్యాన్ని పూర్తి చేస్తానని ఆయన అన్నారు. గత వారం జెరూసలెంలో ప్రభుత్వ అధికారులతోను ఆయన సమావేశమయ్యారు. నెతన్యాహుపైన వచ్చిన రెండు అవినీతి కేసుల ఆరోపణలను గత ఏడాది ఇజ్రాయిల్ పోలీసులు ధృవీకరించారు. కోటీశ్వరులైన స్నేహితులనుండి విలువైన బహుమతులను నెతన్యాహు పొందారన్నది మొదట అవినీతి కేసు. అలాగే తనకు అనుకూలంగా మీడియా ద్వారా ప్రచారం కోసం వార్తాపత్రికలకు, ఇతర మీడియాకు నెతన్యాహు భారీగా ముడుపులు అందించారన్నది రెండవ అవినీతి ఆరోపణ. దేశంలో అతిపెద్ద టెలికాం సంస్థ బెజక్ తనకు, తన భార్యకు ఎన్నికలలో విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ఆ సంస్థకు సానుకూలమైన పలు నిర్ణయాలను తీసుకున్నట్లుగా అధికారులు కూడా ఆరోపించారు. అవినీతి కేసులలో తనను అభిశంసించినప్పటికీ ప్రధానమంత్రి పదవికి రాజీనామ చేయబోనని 2018 డిసెంబర్ 31వ తేదీన నెతన్యాహు ప్రకటించారు. తనపై వచ్చిన అవినీతి ఆరోపణల కేసులను తిరస్కరించారు. తనపై విచారణ జరపకుండానే ఎలా అభిశంసిస్తారని ఆయన ఎదురుప్రశ్న వేశారు. ఎన్నికలలోపు తనపై విచారణ జరపడంకూడా ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు.

కాలం చెల్లిన మార్గంలోనే ట్రంప్

క్యూబానేత రాల్‌కాస్ట్రో విమర్శ



హవానా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కాలం చెల్లిన సంఘర్షణాత్మక పంథాలోనే కొనసాగుతున్నారని క్యూబా 60వ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా దేశ మాజీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు పార్టీనేత రాల్‌కాస్ట్రో విమర్శించారు. క్యూబా మొదటి అధ్యక్షుడు, విప్లవ యోధుడు ఫిడెల్ కాస్ట్రో నాయకత్వంలో 1959లో విప్లవం విజయవంతమయ్యింది. అమెరికా బంటు నియంత అయిన పాలకుడిని దించివేసి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కాస్ట్రో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటినుండి క్యూబాను ఎలాగైనా తన చెప్పుచేతుల్లోకి తీసుకురావాలని అమెరికా ప్రయత్నిస్తూనే ఉన్నది. బరాక్‌ఒబామా అధ్యక్షుడుగా వున్న కాలంలో రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడ్డాయి. క్యూబాలో విప్లవం విజయవంతమైన తరువాత లాటిన్ అమెరికా దేశాలన్నిటిలోను విప్లవ స్ఫూర్తినిపొంది బలమైన వామపక్ష ఉద్యమాలు జరిగాయి. క్యూబాకు సన్నిహితంగావున్న వెనిజులా, నికరాగ్వా దేశాలలో రాజకీయ అస్థిరతను సృష్టించేందుకు ట్రంప్ అన్నివిధాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ఇప్పటికీ క్యూబాపైన ట్రంప్ ఆంక్షలు విధిస్తున్నాడు. అమెరికా ముంగిటవున్న అతి చిన్న దేశం క్యూబా సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. విద్య, వైద్యరంగాలలో ప్రపంచంలోనే తలమానికంగా నిలిచింది. అమెరికా అనేక విధాలుగా దిగ్బంధం చేసినప్పటికీ క్యూబాలో సోషలిస్టు పంథాను ప్రభుత్వాలు వీడలేదు. ఫిడెల్‌కాస్ట్రో మరణానంతరం మరోసారి అమెరికా తన వికృతరూపాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోంది. ఫిడెల్‌కాస్ట్రో అధ్యక్ష పదవినుండి వైదొలగిన తరువాత రాల్‌కాస్ట్రో ఆ బాధ్యతలను ఇటీవల వరకు నిర్వహించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో మిగుల్‌డియాజ్‌కనెల్ ఎన్నికై కొత్త అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం రాల్‌కాస్ట్రో కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. 87 ఏళ్ల రాల్‌కాస్ట్రో సైనిక దుస్తులను, టోపీని ధరించి విప్లవ విజయోత్సవాల సందర్భంగా మాట్లాడుతూ బెదిరింపులకు భయపడబోమని ఆరు దశాబ్దాల క్యూబా విప్లవం నిరూపించిందని అన్నారు. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ తమదేశం విద్య, వైద్యరంగాలలో అమెరికాకంటే మిన్నగా ఉన్నదని, ఈ స్థాయి ముందుముందు కొనసాగుతుందని రాల్‌కాస్ట్రో అన్నారు. ఈ విషయంలో అమెరికా సిగ్గుపడాల్సిందేనని ఆయన విమర్శించారు. ఇరుగుపొరుగు దేశాలు పరస్పరం గౌరవిం చుకుంటూ శాంతియుత జీవనం గడపవలసిన స్థితిలో అమెరికా అనుసరిస్తున్న వైఖరి తీవ్ర విమర్శలకు గురైంది. ప్రస్తుత అధ్యక్షుడు కనెల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అమెరికా దిగ్బంధం కారణంగా అనవసరమైన ఖర్చులను తగ్గించవలసిన అవసరం వుందని ప్రజలు మరింతగా పొదుపును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

దుండగుల దాడిలో 37మంది మృతి



మొప్టి (మాలి) : మాలీలోని కౌలోగాన్ గ్రామంలో దుండగులు జరిపిన క్రూరమైన దాడిలో 37 మంది పౌరులు మృతిచెందారు. వీరిలో మహిళలు, పిల్లలు ఉన్నారు. గుర్తు తెలియని దుండగులు సంప్రదాయ వేటగాళ్ల రూపంలో గ్రామంపైన దాడిచేసి, కాల్పులు జరిపారని అనడోలు వార్తాసంస్థ ప్రభుత్వవర్గాలను ఉటంకిస్తూ తెలియజేసింది. మృతులంతా ఫులాని జాతికి చెందిన వారు. దాడి బెదిరింపుల నేపథ్యంలో గత డిసెంబర్ 22 నుంచి 31 వరకు గ్రామంలో సైనిక భద్రత ఉన్నది. 2012లో మాలీలో సైనిక తిరుగుబాటు విఫలమైంది. ఆ తర్వాత తురెగ్ జాతి గ్రూపు ఉత్తరమాలి ప్రాంతంలో మిలిటెంటు గ్రూపులను తయారుచేసి దాడులకు పూనుకుంటున్నదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

యునెస్కోకు అమెరికా, ఇజ్రాయిల్ గుడ్‌బై



టెలీఅవీవ్ : ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) నుండి అమెరికా, ఇజ్రాయిల్ లాంఛనంగా మంగళవారం వైదొలిగాయి. తూర్పు జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా ప్రకటించడం, దానిని అమెరికా సమర్థించడంపై పారిస్‌కు చెందిన ఒక సంస్థ తీవ్రంగా విమర్శించినట్టు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్ పత్రిక వార్తనందించింది. తూర్పు జెరూసలెంను ఇజ్రాయిల్ ఏనాడో ఆక్రమించింది. అమెరికా, ఇజ్రాయిల్ వత్తిడికి లొంగకుండా ఐక్యరాజ్యసమితి పాలస్తీనాకు పూర్తిస్థాయి సభ్యత్వాన్ని మంజూరు చేసింది. జెరూసలెంతో యూదులకు ఉన్న సంబంధాన్ని తొలగిస్తూ యునెస్కో చరిత్రను తిరగరాసిందని ఐరాసలో ఇజ్రాయిల్ రాయబారి దానిడానన్ వ్యాఖ్యాని చినట్టుగా టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్ పేర్కొన్నది. ఇజ్రాయిల్ శత్రువులు వ్యూహంపన్ని ఈ పని చేశారని, వాస్తవంగా జెరూసలెం యూదులదేనని డానన్ వాదిస్తున్నారు. తమకు వ్యతిరేకంగా ఉన్నందున యునెస్కోనుండి వైదొలగుతున్నట్లు డానన్ చెప్పారు. 2017లో యునెస్కో నుండి వైదొలుగుతామని అమెరికా ప్రకటించిన తరువాత ఇజ్రాయిల్ కూడా అదే మార్గాన్ని అనుసరించింది. యునెస్కో తన మార్గాన్ని మరల్చుకుంటుందని ఆశిస్తున్నామని, దాని వైఖరిలో మార్పువస్తే ఆ సంస్థలో కొనసాగేందుకు ఆలోచిస్తామని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్‌నెతన్యాహు అన్నారు. 1949 సెప్టెంబర్ 16న ఇజ్రాయిల్ యునెస్కోలో చేరింది. యునెస్కో నుండి వైదొలగినప్పటికీ అది తమ దేశంలో గుర్తించిన ఆరు ప్రపంచ వారసత్వ ప్రాంతాలను కొనసాగిస్తామని ఇజ్రాయిల్ తెలిపింది. యునెస్కో నుండి అమెరికా, ఇజ్రాయిల్ వైదొలగినంత మాత్రాన ఆ సంస్థకు ఆర్థికంగా ఇప్పుడు వచ్చే నష్టమేమీలేదని అల్‌జెజిర టెలివిజన్ పేర్కొన్నది. 2011 నుండే అమెరికా, ఇజ్రాయిల్, యునెస్కోకు నిధుల మంజూరు నిలిపివేశాయి.

కిమ్‌తో భేటీకి ట్రంప్ రెడీ



వాషింగ్టన్ : తమపై ఆంక్షలను కొనసాగిస్తూ, ఒత్తిళ్లు పెంచుతూ గతంలో కుదుర్చుకున్న ఒప్పందంలోని అంశాలను అమెరికా అమలుచేయకుండా ఆయుధాలను ధ్వంసం చేయాలని తమను డిమాండ్ చేసినట్లయితే తాము మరోమార్గం చూసుకోక తప్పదని ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్ హెచ్చరించిన మరుసటిరోజే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. కిమ్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే త్వరలో ఆయనతో భేటీ కావడానికి తాను ఎదురుచూస్తున్నానని తన ట్వీట్‌లో స్వల్ప సమాచారాన్ని అందించారు. ఉత్తరకొరియా గొప్ప ఆర్థిక శక్తిగల దేశమని తాను గుర్తించినట్టు ట్రంప్ పేర్కొన్నారు. గత ఏడాది జూన్‌లో సింగపూర్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్, కిమ్ పాల్గొని చరిత్ర సృష్టించారు. దీర్ఘకాలంగా రెండు దేశాల మధ్య నెలకొనివున్న శత్రు వైఖరిని విడనాడేందుకు ఈ సమావేశంలో కొన్ని ఒడంబడికలు చేసుకున్నారు. అయితే అవన్నీ అస్పష్టంగా ఉన్నాయి. కొరియా ద్వీపకల్పాన్ని అణ్వస్త్ర రహితం చేయాలన్న అంశం కూడా ఆ ఒడంబడికలో ఉన్నప్పటికీ అవి అస్పష్టంగా ఉన్నది. అణునిరాయుధీకరణ అంటే ఏమిటి? ఈ అంశంపై స్పష్టతలేదు. సింగపూర్ భేటీ తరువాత రెండుదేశాల మధ్య చర్చలు నెమ్మదించాయి. ముందుగా నిర్ణయించిన తేదీలు సమీపిస్తున్న దశలో పలు సమావేశాలు రద్దయ్యాయి. తమపై అనేక ఆంక్షలు విధించారని, వాటిని తక్షణం ఎత్తివేయాలని ఆ తరువాతనే అణ్వాయుధాల కార్యక్రమాన్ని నిలిపివేస్తామని ఉత్తరకొరియా పలుమార్లు స్పష్టం చేసింది. తమ దేశానికి భద్రతకు సంబంధించిన హామీని అమెరికా ఇవ్వాలని అప్పుడే తాము అణునిరాయుధీకరణను పూర్తిగా అమలుచేయగలమని ఉత్తరకొరియా స్పష్టం చేసింది. ఈ ఏడాది త్వరలోనే కిమ్‌తో భేటీ కావాలని తాను ఆశిస్తున్నట్టు ట్రంప్ పేర్కొన్నారు.గత డిసెంబర్ చివరిలో కిమ్ దక్షిణకొరియా పర్యటన ప్రతిపాదన నెరవేరలేదు. 2017లో ఉత్తరకొరియా 6 అణుక్షిపణులను ప్రయోగించిన తరువాత అమెరికా దిగివచ్చి ఉత్తరకొరియాతో భేటీకి అంగీకరించింది. కొత్త సంవత్సరం సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి కిమ్ మాట్లాడుతూ అమెరికా తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అమెరికా ఆచరణాత్మకమైన కార్యాచరణలను చేపట్టాలని ఆయన కోరారు.

టెక్సాస్‌లో జడ్జిగా భారత్-అమెరికా పౌరుడు

హ్యూస్టన్ : భారత-అమెరికా పౌరుడు కెపి. జార్జి టెక్సాస్‌లోని ఫోర్ట్‌బెల్ట్‌కౌంటీ జడ్జిగా ప్రమాణ స్వీకారం చేశారు. జడ్జిగా పదవీస్వీకారం చేసిన జార్జి ఈ తరగతికి చెందిన మొదటివ్యక్తి. ఆయన వయస్సు 53 ఏళ్లు. ఆయన డెమొక్రటిక్ పార్టీకి చెందినవారు. ఫోర్ట్‌బెండ్‌ఇండిపెండెంట్ స్కూల్ డిస్ట్రిక్టు బోర్డు ట్రస్టీకి నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్ జడ్జి రాబర్ట్‌హెబర్ట్‌ను ఓడించి జార్జి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా జార్జి ఎన్నికయ్యారు. అమెరికాలో జడ్జిల బాధ్యతను ఒక రాష్ట్రానికి మరొక రాష్ట్రానికి భిన్నంగా ఉంటాయి. పెద్ద రాష్ట్రంలో అయితే అనేక న్యాయ, పాలనకు సంబంధించిన విధులను నిర్వహించవలసి ఉంటుంది. ఫోర్ట్‌బెండ్ కౌంటీలో భారత్, అమెరికా పౌరులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. తాజా గణాంకాల ప్రకారం ఈ కౌంటీలో 35 శాతం ఆంగ్లో ఇండియన్‌లు, 24 శాతం హిస్పానిక్స్, 21 శాతం ఆసియన్‌లు తదితరులు ఉన్నారు. 20 శాతం ఆఫ్రికా-అమెరికా పౌరులున్నారు.

జార్జి భారతదేశంలోని కేరళ రాష్ట్రానికి చెందినవారు. ఆయన తండ్రి ట్రక్కు డ్రైవర్. అమెరికాలో డ్రైవర్‌గా పనిచేస్తూ రోజుకు 2 డాలర్లు సంపాదించేవారు. జార్జి కిరసనాయిలు దీపం వెలుగులో చదువుకుని ఎదిగారు. ఈ కౌంటీకి తన శాయశక్తులా సేవలు అందిస్తానని జార్జి ఈ సందర్భంగా చెప్పారు.

శబరిమలలో ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

సంప్రదాయ నల్లదుస్తులు ధరించి గుడిలో పూజలు నిర్వహించారు. దశాబ్దాల నాటి ఆచారానికి తెరదించారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, మహిళలపై దాడులు జరకుండా వారి ఇళ్ల వద్ద పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ మీడియాతో మాట్లాడారు. 50ఏళ్ల లోపు వయస్సుగల ఇద్దరు మహిళలు ఆలయంలోకి ప్రవేశించడం వాస్తవమేనని ధ్రువీకరించారు. 'ఆలయ ప్రవేశం కోసం మహిళలు ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. నేడు వారు ఆలయంలోకి ప్రవేశించడం నిజం.. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు రక్షణ కల్పించాం' అని విజయన్ అన్నారు. అయితే ఆలయంలోకి మహిళలు ప్రవేశించిన నేపథ్యంలో గుడిని మూసివేసి సంప్రోక్షణ చేపట్టాలని ప్రధాన పూజారి ఆదేశించారు. దీంతో దాదాపు గంట సేపు ఆలయ ద్వారాలను మూసి శుద్ధీకరణ చేపట్టారు. ఇందుకోసం భక్తులను పంపించివేశారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు తెరుచుకున్న ఆలయం సంప్రోక్షణ కోసం ఉదయం 10.30 గంటలకు మూతబడింది. సాధారణంగా మధ్యాహ్నం 12.30గంటల వరకు గుడిని తెరిచి ఉంచుతారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణ మాట్లాడుతూ 'సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహిళలు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ క్రమంలో ఆలయ ద్వారాలను మూసివేయడం చట్టవ్యతిరేకం. తాజా పరిణామాన్ని ప్రజలు స్వీకరించాలి. వాస్తవాలను గ్రహించాలి' అని అన్నారు. ఆలయంలోకి ప్రవేశించిన బిందు ఓ కాలేజి లెక్చరర్, కోజికోడ్ జిల్లాలోని కొయిలాండీలో సీపీఐ(ఎంఎల్) కార్యకర్త కాగా కనకదుర్గ మల్లప్పురంలోని అంగండిపురంలో సివిల్ సప్లయిస్ ఉద్యోగిని. గతేడాది డిసెంబరు 24న చెన్నైకు చెందిన 11మంది మహిళా కార్యకర్తలతో పాటు కనకదుర్గ శబరిమలకు వచ్చారు. అప్పయ్య భక్తులు అడ్డుకోవడంతో ఆలయాన్ని దర్శించుకోకుండానే ఆమె వెనుతిరిగారు. కాగా, వీరి ప్రవేశంపై బీజేపీ కార్య కర్తలు, అయ్యప్ప భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెండ్రోజుల నిరసనకు పిలుపునిచ్చారు.

ప్రతి మహిళకు పూజించే హక్కు ఉంది : బృందా కారత్

శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించడంపై సీపీఎం సీనియర్ నాయకులు బృందా కారత్ హర్షం వ్యక్తంచేశారు. 'ప్రతి మహిళకు ఆలయాన్ని దర్శించుకొని, పూజించే హక్కు ఉందన్నారు. 'ఆ ఇద్దరు ఆలయంలోకి వెళ్లి పూజలు చేయాలనుకున్నారు.. చేశారు. కేరళ ప్రభుత్వం వారికి భద్రతను కల్పించింది' అని బృందా కారత్ అన్నారు.

సమానత్వానికి విజయం : తృప్తి దేశాయ్

మహిళల ఆలయ ప్రవేశంపై సామాజిక కార్యకర్త తృప్తి దేశాయ్ హర్షం వ్యక్తం చేస్తూ.. 'ఇది సమానత్వానికి విజయం' అంటూ అభివర్ణించారు. 50ఏళ్ల లోపు ఇద్దరు మహిళలు సన్నిధానం వరకు వెళ్లి పూజలు చేయడం చారిత్రక మని అన్నారు. 'మా ఉద్యమం గొప్ప విజయాన్ని సాధించింది. సమానత్వం గెలిచింది. కొత్త సంవత్స రంలో ఇది శుభప్రారంభం. మహిళలను అడ్డుకున్న వారి పంతం ఓడింది' అని దేశాయ్ తెలిపారు. 10-50ఏళ్లలోపు మహిళలందరికి ఆలయ ప్రవే శాన్ని కల్పించాలని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న యువతులనూ అనుమతించాలని ఆలయ నిర్వాహ కులను కోరారు. నవంబరు 16న దాదాపు 13 గంటలు వేచి ఉన్నప్పటికీ ఆమె కొచ్చి ఎయిర్‌పోర్టు నుంచే వెనుతిరిగిన విషయం తెలిసిందే.

మతశక్తులను తిప్పికొట్టాలి..

- కేరళ ప్రజలకు సీపీఐ పిలుపు
- ఉమెన్ వాల్ సక్సెస్‌కు అభినందన

న్యూఢిల్లీ : శబరిమల ఆలయంలోకి అన్ని వయస్కుల మహిళలను అనుమతించాలన్న డిమాండుతో పాటు, లింగ వివక్ష, మతఛాందసవాదానికి వ్యతిరేకంగా లక్షలాది మంది మహిళలు రోడ్లపైకొచ్చి కేరళలోని 14 జిల్లాల్లో మహా మానవహారాన్ని నిర్మించడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభినందించింది. ఈ చారిత్రక కార్యక్రమానికిగాను కేరళ ప్రజలకు బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపింది. ఉమెన్ వాల్‌ను జయప్రదం చేసినందుకుగానూ ఎల్‌డీఎఫ్‌తో పాటు వివిధ మహిళా, విద్యార్థి, యూత్ సంఘాలకు శుభాభినందనలు తెలిపింది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టాలని కేరళ ప్రజలకు పిలుపునిచ్చింది. మతసంఘాలకు 'ఉమెన్‌వాల్' కనువిప్పు కావాలని సీపీఐ ఆకాంక్షించింది. కులం, మతం నీడలో అల్లర్లు సృష్టించే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని, సంస్కరణలతో రాష్ట్రాన్ని ముందుకు నడపాలని, మూఢాచారాలకు స్వస్తి పలకాలని సూచించింది. ఆలయాలను అడ్డంపెట్టుకొని కేరళ ప్రజలను విభజించవద్దని ప్రతి ఒక్కరికి సీపీఐ అప్పీలు చేసింది.

హైకోర్టు అధికారిక కార్యకలాపాలు ప్రారంభం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలో కొలువు దీరిన ఏపీ కొత్త హైకో ర్టులో బుధవారం నుంచి అధికారిక కార్య కలాపాలు ప్రారం భమయ్యాయి. ఉదయం 10 గంటలకే హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ప్రవీణ్ కుమార్ సహా న్యాయమూర్తులు విధులకు హాజర య్యారు. హైదరాబాద్ నుంచి తరలివచ్చిన న్యాయవాదులు, స్థానిక న్యాయవాదులు, మరోప్రక్క కక్షిదారులు కూడా పెద్దసంఖ్యలో కోర్టుకు హాజరు కావడంతో సందడి వాతావరణం నెలకొంది. హైకోర్టు విభజన నేపథ్యంలో ఈనెల 1వ తేదీ నుంచి ఏపీ హైకోర్టును తాత్కాలికంగా విజయ వాడలో సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రారంభించిన విషయం తెల్సిందే.

కేవలం మూడు రోజులు మాత్రమే పనిచేయనున్న హైకోర్టు 5వ తేదీ నుంచి సెలవులు ప్రకటిస్తున్నారు. జనవరి 20వ తేదీ నాటికి అమరావతిలో తాత్కాలిక హైకోర్టు నిర్మాణపనులు పూర్తి చేసి అక్కడకు తరలించనున్నారు.

పక్కా ప్రణాళికతోనే...

(మొదటిపేజీ తరువాయి)

నిర్ధారించారన్నారు. జగన్మోహనరెడ్డిపై హత్యాయ త్నానికి ముందు 45 రోజుల నుంచీ ముద్దాయి నిఘా పెట్టాడని సీపీ తెలిపారు. ఈ కేసులో 92 మందిని విచారించామన్నారు. నిందితుడు శ్రీనివాస్ 321 మందితో ఫోన్‌లో సంభాషించాడన్నారు. కేవలం పాపులారిటీ కోసమే దాడికి ప్రయత్నించాడన్నారు. పర్స్‌లో కోడికత్తిని పెట్టుకున్నాడన్నారు. అక్టోబరు 18నే జగన్‌పై దాడికి ప్రయత్నించగా జగన్‌మోహన్‌రెడ్డి 17నే ఎయిర్‌పోర్టుకు రావడంతో నిందితుడు అక్టోబరు 25న దాడికి పాల్పడ్డాడన్నారు. హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తిని రెండుసార్లు స్టెరిలైజ్ చేసి ఆనవాళ్లు దొరక్కుండా ఉండేందుకు ప్రయత్నిం చాడని విచారణలో తేలిందన్నారు. గద్దబొమ్మతో ఉన్న ఫ్లెక్సీని ముద్దాయి ఇంటి ముందు ఏర్పాటుచేసుకున్న విషయమై ఫ్లెక్సీ తయారుచేసిన వారిని సంప్రదించగా ఆ గద్దబొమ్మ తనకి ఇష్టమని, దానిని ఫ్లెక్సీలో ఉంచాలని ముద్దాయి శ్రీనివాస్ చెప్పాడన్నారు. ముద్దాయి బ్యాంకు ఖాతాలు పరిశీలించగా కేవలం ఇరవైవేల రూపాయిలు మాత్రమే ఉన్నాయని, అధికమొత్తంలో ఎలాంటి లావాదేవీలు జరగలేదని వెల్లడించారు.

సమావేశంలో డీసీపీ 2 అద్నాన్ నయీమ్ అస్మి, నార్త్ ఏసీపీ నాగేశ్వరరావు, ఏసీపీ లంకా అర్జున, సీఐలు మళ్ల శేషు పాల్గొన్నారు.

'రాఫెల్'పై సుప్రీంలో రివ్యూ పిటిషన్..!

యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ దాఖలు

న్యూఢిల్లీ : రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పంద కుంభకోణంపై గత నెల 14న వెలువరించిన తీర్పుపై పున: పరిశీలించాలని కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు. ఈమేరకు సుప్రీంకోర్టులో బుధవారం రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేశారు. రాఫెల్ ఒప్పందంలో భాగంగా 36 యుద్ధ విమానాల కొనుగోలులో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం విధితమే. రాఫెల్‌పై కేంద్ర ప్రభుత్వం సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించిన వివరాలు సరైనవికావని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. కోర్టుకు సీల్డ్ కవర్‌లో సమర్పించిన వివరాణత్మక పత్రంలో ఎలాంటి సంతకమూలేదని తెలిపారు. ప్రభుత్వం అందజేసిన తప్పుడు నివేదికపై ఆధారపడి గత నెల 14న సుప్రీంకోర్టు తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాఫెల్ ఒప్పందంపై ఓపెన్ కోర్టులో విచారణ చేపట్టాలని అభ్యర్థించారు. రాఫెల్ ఒప్పంద వివరాలను బహిర్గతం చేయాలని, భారత్, ఫ్రాన్స్ మధ్య జరిగిన ఒప్పందంలో రూ.58 వేల కోట్ల కుంభకోణం జరిగినందున ప్రభుత్వంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని గతంలోనూ కోరిన విషయాన్ని రివ్యూ పిటిషన్‌లో ఉటంకించారు. రాఫెల్ యుద్ధ విమానాల ధరను వెల్లడించేందుకు కేంద్రం నిరాకరించింది. ఇదే విషయాన్ని గతంలో కోర్టుకూ తెలియజేసింది.

అయితే పరిశీలన నిమిత్తం కాగ్‌కు పంపించామని, అనంతరం పీఏసీ కూడా పరిశీలించినట్లు కోర్టుకు కేంద్రం నివేదించింది. అయితే, దీనిపై ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఉభయసభల్లోనూ ఆందోళన చేస్తుండగా, బీజేపీకే చెందిన కేంద్ర మాజీ మంత్రులు పలుమార్లు సుప్రీంకోర్టులో పిటిషన్‌లను దాఖలు చేశారు. ఆ క్రమంలోనే యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ, ప్రశాంత్ భూషణ్ మరోసారి రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేశారు.

ఆయనకే ఆక్రోశం...!

(మొదటిపేజీ తరువాయి)

13 మంది కేంద్రమంత్రులు ప్రచారం చేసినా తెలంగాణలో ఒక్క సీటు మాత్రమే గెలిచారని దుయ్యబట్టారు. తెలంగాణలో కూటమి విఫలం అని బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. నాలుగు రోజులు కూడా గడువివ్వకుండా హైకోర్టును తరలించారని విమర్శించారు. ఏపీలో టీడీపీ గెలిస్తే తన అసమర్థత బయట పడుతుందని కేసీఆర్ భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. కేసుల మాఫీ కోసం జగన్‌కు అధికారం కావాలని, అందుకే మోడీ, కేసీఆర్‌తో జట్టుకడుతున్నారని అన్నారు. ఎవరైతే మనకు అన్యాయం చేశారో వాళ్లపై మనం పోరాడుతున్నామని, అలాంటి వారితో జగన్ స్నేహం చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ, జగన్, కేసీఆర్ ముగ్గురూ ఏపీపై పగబట్టారని, ముగ్గురు మోడీలతో మనం పోరాటం చేస్తున్నామని అన్నారు. ప్రజల్లో పట్టుదల పెరగాలని, అందరూ కసితో పనిచేయాలని సూచించారు. తెలంగాణలో ఏమీ చేయని కేసీఆర్ 80కి పైగా సీట్లలో గెలిచారని, అన్నీ చేసిన మనం ఇంకా ఎక్కువ స్థానాల్లో గెలవాలని నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివ ృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. మత వ్యవహారాల్లో బీజేపీ జోక్యం చేసుకుంటోందని ట్రిపుల్ తలాక్ విషయంలో ఒకలా.. శబరిమలలో ఇంకోలా బీజేపీ కుట్రలు చేసిందని చంద్రబాబు విమర్శించారు. విభజించి పాలించాలని ఆ పార్టీ చూస్తోందని మండిపడ్డారు. వారి కుట్రలను తిప్పికొట్టాలని నేతలకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

ధీరోదాత్తులు...!

(మొదటిపేజీ తరువాయి)

మధ్య ఘర్షణ జరుగుతోంది. చట్ట ఉల్లంఘన శక్తులకు బీజేపీ, కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు వెన్నుదన్నుగా ఉన్నారు. మరో నాలుగునెల లకాలంలో లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర సమాజం తీవ్ర విభజనకు గురైంది. శబరిమలలో మహిళల ప్రవేశం జరిగిన కొన్నిగంటల్లో ప్రధాని మోడీ వ్యాఖ్యానిస్తూ శబరిమల సమస్య, ట్రిపుల్ తలాక్ సమస్య వేరువేరు అని వ్యాఖ్యానించారు. ఈ సంఘటనపై బీజేపీ కేరళశాఖ మళ్లీ అల్లర్లకు దిగుతోంది. పైగా ముఖ్యమంత్రి పదవినుండి దిగిపోవాలని కోరుకుంటున్నది. దేవాదాయ శాఖమంత్రి కె.నరేంద్రన్ మాట్లాడుతూ, ఆలయ ప్రవేశానికి వయసును నిర్ణయించేందుకు ఇదేమీ పరీక్షకాదన్నారు. మత ఛాందసాన్ని నూరిపోసే శక్తులు ముఖ్యమంత్రి నివాసం వెలుపల, సచివాలయం వద్ద ప్రదర్శనకు దిగాయి. బిందు, కనకదుర్గల ఇళ్లవద్ద పోలీసులు భద్రత కల్పించారు. మతోన్మాద శక్తులనుండి వీరికి ప్రమాదం పొంచిఉంటుంది. రాష్ట్రంలో అనవసరమైన ఆందోళనలకు పూనుకున్నప్పటికీ కాంగ్రెస్ అధిష్టానవర్గం కార్యకర్తలకు ఎలాంటి సూచనలు చేయలేదు. మహిళావాల్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు ముఖ్యమంత్రి 'నవోతన నాయకన్' అని పేరుపొందారు. ఆలయంలో ప్రవేశించిన కనకదుర్గ, బిందులు నాలుగు నిమిషాలు మాత్రమే లోపల ఉన్నారు. శుద్ధిచేసే చర్యలు వంటి వాటితో తిరిగి అంటరానితనాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నించే శక్తులను సుప్రీంకోర్టు అయినా అడ్డుకుంటుందా...? కేరళలో ఈ అంశాన్ని ఆసరాగా చేసుకుని బీజేపీ రాజకీయ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిస్తున్న అంశం స్పష్టమే...

మూడు బ్యాంకుల విలీనానికి కేంద్రం ఆమోదం



న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఐదు అనుబంధ బ్యాంకులు విలీనం అనంతరం మరో విలీనానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వ రంగ బ్యాంకులైన దేనా బ్యాంక్, విజయా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా విలీనానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలుపుతున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మూడింటి విలీనం వల్ల ఏర్పడే కొత్త బ్యాంకు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ తర్వాత దేశంలోనే మూడో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనుంది. విలీనం వల్ల సదరు బ్యాంకు ఉద్యోగుల సర్వీసుపై ఎటువంటి ప్రభావం చూపబోదని ఆయన తెలిపారు. ఈ విలీనం వల్ల బ్యాంకు సిబ్బందితో పాటు ఖాతాదారులకు లాభాలు చేకూరతాయని ప్రభుత్వం చెబుతోంది. విలీన ప్రక్రియ ముగిశాక ఏర్పడే కొత్త బ్యాంకులో సుమారు 85వేల మందికి పైగా ఉద్యోగులుంటారు. దేశ, విదేశాల్లో కలిపి దానికి 9,485 శాఖలు ఏర్పడతాయి. ఏప్రిల్1, 2019 నుంచి ఈ విలీనం అమల్లోకి వస్తుంది. ఇదిలా ఉంటే మూడు బ్యాంకుల విలీనాన్ని వ్యతిరేకిస్తూ గత నెల బ్యాంకు యూనియన్లు సమ్మె బాట పట్టిన విషయం తెలిసిందే. బ్యాంకు విలీనం కారణంగా సిబ్బంది తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రెప్పపాటులో ఘోరం...!

- గుంటూరు జిల్లాలో ఒకేరోజు ఎనిమిది మంది దుర్మరణం
- వారంలో 22 మంది మృతి
- అతివేగమే ప్రమాదాలకు కారణం

విశాలాంధ్ర-గుంటూరు: గుంటూరు జిల్లాలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం చెందారు. జిల్లాలో వారం రోజుల్లో 22 మంది మృతిచెందారు. బుధవారం యడ్లపాడు, మాచర్ల, గుంటూరు(మానససరోవరం) వద్ద ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. యడ్లపాడు వద్ద కారు ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడగా మాచర్ల వద్ద జరిగిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్ని ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. గుంటూరు వద్ద కారు, లారీ ఢీకొన్న మరో ప్రమా దంలో ఒకరు మృతిచెందారు. చిత్తూరు జిల్లా మదనపల్లి మండలం మొలకలూరుకు చెందిన ఒక కుటుంబం తూర్పు గోదావరి జిల్లా కాకినాడ వద్ద జరిగిన కార్యక్రమానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వెళుతున్న తరుణంలో యడ్లపాడు వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టిన ఘటనలో నలుగురు మృత్యు వాత పడ్డారు. సుందరరామరాజు(32), భారతి(54), సూర్యనారాయణమ్మ(30), కస్విని(3) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన దంతలూరి సునీల్‌వర్మ,



సౌందర్య, జాహ్నవి మృత్యువుతో పోరాడుతున్నారు. మాచర్ల మండలం తాళ్ళపల్లి వద్ద జరిగిన ద్విచక్ర ప్రమాదంలో మరో ముగ్గురు మృత్యువాత పడ్డారు. నల్గొండకు చెందిన రామబ్రహ్మం దుర్గి మండలం ఓబులేశుపల్లిలో ఒక కార్యక్రమానికి హాజరై ద్విచక్ర వాహనంపై తన కుటుంబ సభ్యులైన ఐదుగురు ఒకే బైక్ మీద నల్గొండకు బయలుదేరారు. తమిళనాడుకు చెందిన సురేష్‌కుమార్, ఒలివేలులు ప్లాస్టిక్ వ్యాపారం నిర్వహిస్తూ నాగార్జున సాగర్ నుంచి బైక్‌పై మాచర్లకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో తాళ్ళపల్లి వద్ద రెండు బైక్‌లు ఢీకొని సురేష్‌కుమార్(38), వెంకట సాయి(8), మణిదీప్(8) మృతి చెందారు. గుంటూరులోని మానస సరోవరం సమీపంలో కారు, లారీ ఢీకొన్న ఘటనలో మరో వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం. ఈ వారం లోనే జిల్లాలో ప్రమాదాల బారిన పడి 22 మందికి పైగా మృతి చెందారు. యడ్లపాడు వద్ద జరిగిన ఘటనలో ఆరుగురు, ఫిరంగిపురం వద్ద బైక్ ప్రమాదంలో ముగ్గురు, గుంటూరు లాలుపురం వద్ద జరిగిన ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడ్డారు.



కార్మికవర్గానికి దిక్సూచి బర్దన్

ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కార్మిక రంగంలో పనిచేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించడానికి సులభశైలిలో శిక్షణా తరగతులకు సంబంధించిన బుక్‌లెట్స్ తయారు చేసి ఎందరో కార్మిక నాయకులను అధ్యాపకులుగా తీర్చిదిద్దడంతోపాటు కార్మిక వర్గానికి చక్కటి దిశా నిర్దేశం చేసిన మహానేత బర్దన్ అని ఏఐటీయూసీ నేతలు కొనియాడారు. సీపీఐ, ఏఐటీయూసీ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎ.బి.బర్దన్ 3వ వర్థంతి సందర్భంగా బుధవారం గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం నందు యూనియన్ అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు , డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్..వెంకటసుబ్బయ్య, కోశాధికారి బి.వి.వి.కొండలరావు తదితరులు బర్దన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ మొదటి తరానికి చెందిన కమ్యూనిస్టు యోధుడు,మార్క్సిస్టు సిద్ధాంత గ్రంధాలను ఆకలింపు చేసుకుని భారతదేశ కమ్యూనిస్టు,కార్మిక ఉద్యమాలకు అన్వయం చేసిన గొప్ప మేధావి బర్దన్ అన్నారు. అలాగే జాతీయ ప్రజా సంఘాల ఐక్యవేదిక(ప్లాట్‌ఫామ్ అఫ్ మాస్ అర్గనైజేషన్)ను రూపకల్పన చేసి అన్ని కార్మిక సంఘాలను ఒక ఛత్రం క్రిందకు తీసుకువచ్చి ఎల్‌పీజీ (ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, సరళీకరణ) విధానాలకు వ్యతిరేకంగా నిర్విరామంగా పోరుసల్పిన పోరాట యోధుడు బర్దన్ అని శ్లాఘించారు. 1990లో ప్రారంభమైన ఆ పోరాటాల ప్రాతిపదిక మీదనే నేడు దేశ వ్యాపితంగా పది కేంద్రకార్మిక సంఘాలు, 450 పైచిలుకు స్వతంత్ర ఫెడరేషన్లు నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాల పైన నగారా మోగించి 8,9 తేదీల్లో జాతీయ సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నాయన్నారు. ఈ సమ్మెలో యావత్తు కార్మిక,కర్షకులు, కష్టజీవులు పాల్గొని ఉద్యమించడమే బర్దన్ లాంటి మహావ్యక్తులకు మనం అర్పించే నిజమైన నివాళి అవుతుందని ఓబులేసు తెలియజేశారు.

కలెక్టర్ కారులో ఇసుక రవాణా..?!

విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం: ఉత్తరాంధ్రలో నిర్మాణ రంగానికి ఊతమిచ్చేందుకు, ఉచిత ఇసుక విధానంపై ప్రజల్లోని అసంతృప్తిని తగ్గించేందుకు స్వయంగా రంగంలోకి దిగిన జిల్లా కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి ఆశయానికి 'ఉప ముఖ్య' నేత గూట్లోని ఓ గుత్తేదారు సంస్థ, మరో రెవెన్యూ ఉద్యోగి కలసి తూట్లు పొడిచారు. అక్రమ రవాణా పేరుతో జిల్లా నుంచి తరలి పోతున్న వందలాది లారీలను క్రమబద్ధీకరించాలని క్యూ.ఆర్.స్కాన్ కోడ్‌తో పక్కా రశీదులను జిల్లా ఇసుక కమిటీ ఛైర్మన్ కలెక్టర్ ప్రవేశపెట్టారు. దీన్ని పర్యవేక్షించాల్సిన గనులు, భూగర్భశాఖ అదుపు తప్పడంతో కలెక్టర్, ఇతర అధికారుల కారు నెంబర్లతోనే రశీదులు సృష్టించి...ఇసుకను తరలిస్తున్న వైనం కలకలం రేపింది. అందరూ నూతన సంవత్సర వేడుకల్లో మునిగి తేలుతుంటే.. కలెక్టర్ కారు నెం. ఏపీ.30ఎస్ 6666తోనూ, జాయింట్ కలెక్టర్ కారు నెం. ఏపీ.30ఎఇ 99తో పాటు గనులు, భూగర్భశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కారు నెంబర్లను లారీలుగా పేర్కొంటూ రశీదులిచ్చేశారు. ఇసుక రవాణాకు సంబంధించిన (ఇసుక ఉచిత పంపిణీ బిల్లునెం. 1823, 1824) బిల్లులిచ్చేసారు. రేవులోకి వచ్చే లారీలను స్వయంగా పరిశీలించి వాటికి బిల్లులివ్వాల్సిన బాధ్యత గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ సెక్రటరీలకు అప్పగించారు. కేవలం పగటి వేళల్లో మాత్రమే ఇసుక రవాణా చేయాలి. కానీ ఇందుకు భిన్నంగా లాభదాయకమైన రాత్రిపూట రవాణాకు దారులు తెరుస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆ సమయంలో అక్కడ ఉండకపోవడంతో రాత్రి వేళల్లో వచ్చే లారీలకు



కలెక్టర్ కారు

'ఉప ముఖ్యనేత'కి చెందినదిగా భావిస్తున్న ఓ గుత్తేదారు సంస్థకు బిల్లులిచ్చే బాధ్యతను అప్పగించేశారు. అది లారీయా, కారా అనే విషయాన్ని ఆలోచించకుండా, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శుల సంతకాలు లేకుండా, 'బ్లూ ఫ్రాగ్' హెడ్ పేరుతో ఇష్టానుసారం బిల్లులను అమ్మేయడం మొదలెట్టారు. ఇసుక మాఫియాకు ఈ బిల్లులను రూ.500 నుంచి రూ.1000 వరకూ అమ్ముతుండటంతో వారంతా రాత్రివేళల్లో అనుమతి లేని రీచ్‌ల నుంచి ఇలా వందలకొద్దీ లారీలను విశాఖ తరలించుకు పోతున్నారు. గతంలో మైనింగ్ శాఖలో కలెక్షన్ కింగ్'ల పేరిట 'విశాలాంధ్ర'లో పతాక శీర్షికన వరుస కథనాలు వెలువడ్డాయి. గనులశాఖ మంత్రి సుజయకృష్ణ రంగారావు శ్రీకాకుళం జిల్లాలోని గనులశాఖపై దర్యాప్తునకు ఆదేశించారు. ఇక్కడ శాఖ ఉన్నతాధికారైన ఏడీపై బదలీ వేటు వేశారు. ఇక అంతా సర్దుకుందిలే అనుకుంటున్న దశలో 'విశాలాంధ్ర' పరిశోధనలో ఈ బిల్లుల బండారం బయటపడింది. నరసన్నపేట మండలం బుచ్చిపేట ఇసుక రేవులో ఇలా బిల్లులు ఇస్తున్న విషయం తెలుసుకున్న 'విశాలాంధ్ర' బృందం సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న 'బ్లూ ఫ్రాగ్' అనే సంస్థ నుంచి కొనుగోలు చేసింది. రేవులకు వచ్చే లారీలను పరిశీలించి నెంబర్లు ఇవ్వాల్సిన విషయాన్నే మర్చిపోయి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, గనుల శాఖ ఏడీ కార్ల నెంబర్లు చెబితే వాటినే రాసేసి బిల్లులిచ్చేసింది. ఇలా వందలకొద్దీ బిల్లులను బయటకు అమ్మేస్తూ సదరు సంస్థ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. 'ఉపముఖ్య నేత' సిఫార్సుతో సదరు సంస్థ జిల్లాలో రెండేళ్లుగా తిష్టవేస్తూ అక్రమార్కులకు సహాయ సహకారాలను అందిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఇదే సంస్థ చేనులవలస పేరుతో ఏకంగా ఇసుక ర్యాంపునే సాధించుకుంది. ఇంకా అమ్మకాలు మొదలుపెట్టనప్పటికీ వందలకొద్దీ లారీల ఇసుకను ఒడ్డున డంపింగ్ చేయిస్తోంది. స్వయంగా 'ఉప ముఖ్యనేత' కుమారుడే జిల్లాలో దగ్గరుండి మరీ పని చేయిస్తుండటంతో అటువైపు వెళ్ళేందుకు అధికారులు భయపడుతున్నారు.

క్యూ.ఆర్.స్కాన్ కోడ్ బిల్లులేంటి :

నాలుగు నెలల కిందట వంశధారకు అకస్మాత్తుగా వచ్చిన వరదలతో సరుబుజ్జిలి మండలం పురుషోత్తంపురం ఇసుక ర్యాంపులో 22 లారీలు చిక్కుకున్నాయి. 30 మంది డ్రైవర్లు నది మధ్యలో ఉండిపోయారు. వారిని రక్షించినప్పటికీ ఇసుక అక్రమ రవాణాకు కేరాఫ్ జిల్లాగా శ్రీకాకుళం జిల్లాకు చెడ్డపేరు వచ్చింది. ఉచిత ఇసుక పేరుతో దాదాపు రూ.500కోట్ల ఇసుకను మాఫియా తరలించుకుపోయింది. చాలా మంది ప్రభుత్వ పెద్దల సహకారంతోనే ఇదంతా జరిగిపోయేది. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటినుంచే ధనుంజయరెడ్డి ఇసుక అక్రమ రవాణాకు బ్రేకులు వేయించాలని కంకణం కట్టుకున్నారు. పురుషోత్తంపురం ఘటన తర్వాత ఆయనే స్వయంగా క్యూ.ఆర్. కోడ్‌తో కూడిన బిల్లులను ప్రవేశపెట్టారు. బిల్లులేని లారీలను సీజ్ చేయడంతో ఇసుక మాఫియాకు బ్రేకులు పడ్డాయి. దాదాపు 300 లారీలను ఇప్పటి వరకూ సీజ్ చేశారు. బిల్లుపై సెల్‌ఫోన్‌లో ఉన్న ప్రత్యేక యాప్‌తో స్కాన్ చేస్తే ఏ రేవు నుంచి ఇసుక తీసుకెళ్తున్నారో తెలిసిపోయే విధానంతో అధికారుల పని కూడా సులువయ్యింది. హైవేలో ఎక్కడికక్కడ నిఘా ఉండటంతో మాఫియా ఇలా బిల్లులనే అక్రమంగా కొనే పద్ధతిని అలవాటు చేశారు. మొత్తానికి ఓ సంస్థ నిర్వాకం, అధికారుల అలసత్వం కారణంగా మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వచ్చినట్లయింది. స్థానిక రెవెన్యూ అధికారి, పంచాయతీ సెక్రటరీలు తమ తప్పించుకోవడంతో 'ఉప ముఖ్య' నేత సంస్థ భారీగా లబ్ధిపొందుతోంది. ఇసుక రేవుల్లో ప్రభుత్వ బిల్లులు బయటకు వెళ్లిపోతున్నాయనే విషయంపై గనులు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సూర్య చంద్రరావును 'విశాలాంధ్ర' వివరణ కోరగా, ఆయన వెంటనే స్పందించారు. సదరు సంస్థ నుంచి బిల్లులను వెనక్కు తీసుకుని రెవెన్యూ యంత్రాంగానికి అప్పగించారు. కానీ అదంతా ఒక్క గంట వరకే పరిమితం చేయగలిగారు. చివరకు తీవ్రమైన ఒత్తిళ్ళతో మళ్లీ సదరు సంస్థకే బిల్లులు మంజూరు చేసే బాధ్యతలను అప్పగించక తప్పలేదు.

ఏపీ ప్రభుత్వంపై కుట్ర

సినీ నటుడు శివాజీ



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్): రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసి రాబోవు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్నతస్థాయి అధికారులతో కలసి కొత్త తరహా కుట్రలు చేస్తున్నారని సినీనటులు శివాజీ అరోపించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వాన్ని ప్రజల్లో అప్రతిష్ఠపాలు చేయడానికి గతంలో అనేక కుట్రలు చేశారని అయితే వారి ఆటలు సాగకపోవడంతో ప్రస్తుతం కొత్త తరహా కుట్ర చేస్తున్నారని చెప్పారు. దీని ద్వారా రైతుల్లో వ్యతిరేకత వచ్చి రాబోవు ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయకుండా చేయడమే వారి లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో చుక్కల, గుంటల భూములను రిజిస్ట్రేషన్ చేయాలని ముఖ్యమంత్రి స్వయంగా అధికారులను అదేశించినా కొంతమంది అధికారులు కావాలనే ఆపేశారని చెప్పారు. ఇది రాష్ట్రంలో మూడు లక్షల కుటుంబాలకు సంబంధించిన సమస్య అనీ, ఈ 3 లక్షల కుటుంబాలలో 12 లక్షల మంది ఓటర్లు ఉంటారని వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తే తిరిగి టీడీపీ ప్రభుత్వం రాదని వారి ఉద్దేశమని చెప్పారు. ఇలా చేయడానికి రాష్ట్రంలో ఉన్నతాధికారులుగా పనిచేసి పదవీ విరమణ చేసి ప్రతిపక్ష పార్టీలో చేరిన కొంత మంది అధికారులు ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న ముగ్గురు అధికారులతో కలసి ఈ విధంగా చేస్తున్నారని అరోపించారు. ఈస్టు ఇండియా కంపెనీ 1880లో చుక్కల భూములు రిజిస్ట్రేషన్ చేసిందని, ఆ విషయం చాలా మందికి తెలియదన్నారు. 22ఎ సర్వే నంబరు ప్రకారం 1910 నుండి 2016 వరకు రికార్డులు చూపడంలేదన్నారు. తెలంగాణ రీ సర్వే చేసిన వాటిని తాను తీసుకువచ్చానని చెప్పారు. ఒక జర్నలిస్టుగా ఇన్వెస్టిగేషన్ చేసి ఆధారాలు సేకరించా. జగన్, పవన్‌లకు ఇలాంటి సమస్యలు కనిపించవు అని ఎద్దేవా చేశారు. తన వెనుక ఏ పార్టీ లేదన్నారు. 12 లక్షల మందిని ప్రభుత్వానికి దూరం చేస్తే రాబోవు ప్రభుత్వం తమది అవుతుందని ఆ ముగ్గురు అధికారులు ఈ కుట్రలో భాగస్వాములయ్యారన్నారు. సీఎం చంద్రబాబుని కలిసి అన్ని వివరాలు చెప్తానన్నారు. సంక్రాంతి లోపు సమస్య పరిష్కారం కాకపోతే నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. కేంద్రంలో కచ్చితంగా ప్రభుత్వ మారుతుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చి తీరుతుందన్నారు. వెన్నుపోటుకి, వెన్నుదన్నుకి తేడా తెలియని వ్యక్తి లక్ష్మీస్ ఎన్టీఆర్ సినిమా తీస్తున్నాడు. ఆ రోజు చంద్రబాబు అలా చెయ్యకపోతే నేడు టీడీపీ ఉండేది కాదన్నారు. ఆ సమయంలో చంద్రబాబుతో కేసీఆర్ కూడా ఉన్నారు. ఎన్టీఆర్ చైతన్య రథంపై చెప్పులు వేసిన వ్యక్తి లక్ష్మీ పార్వతి మనిషే. వైస్రాయి హోటల్ దగ్గర ప్రత్యక్ష సాక్షిగా తాను ఉన్నాని శివాజీ తెలిపారు.

లౌకికవాదం-మతతత్వం మధ్యే పోటీ

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీశర్మ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వచ్చే ఎన్నికల్లో లౌకికవాదం-మతతత్వం, ప్రజలు-మోడీ, నియంతృత్వం-ప్రజాస్వామ్యం మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీశర్మ అన్నారు. మోడీ అభద్రతాభావంతోనే సీఎం చంద్రబాబుపై ఆరోపణలు చేస్తున్నారని ఆమె విమర్శించారు. విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. తనను నమ్ముకున్న ఐదు కోట్ల ఆంధ్రులతోపాటు దేశ ప్రజలందరి గొంతుగా మారి చంద్రబాబు కేంద్రం అనుసరిస్తున్న నిరంకుశత్వ విధానాలపై ఆక్రోశాన్ని వెలిబుచ్చారన్నారు. ఇటీవల మోడీ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. మోడీ నియంతృత్వ పోకడలకు చరమగీతం పాడేందుకు బీజేపీ వ్యతిరేక పార్టీలను ఏకం చేస్తూనే, ఏపీకి జరిగిన అన్యాయాన్ని జాతీయ స్థాయిలో వివరిస్తున్నారని తెలిపారు. ఏపీకి చెందిన బీజేపీ నేతలు రోజుకో అబద్ధం మాట్లాడుతూ పబ్బంగడుపుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ సీఎం కేసీఆర్, వైసీపీ అధినేత జగన్ ఇద్దరూ మోడీకి కుడి, ఎడమలుగా మారిపోయారన్నారు. ఈ ముగ్గురి కలయికలోని ఆంతర్యం ఏమిటో వారే బహిర్గతం చేయాలని యామినీశర్మ డిమాండు చేశారు.

50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

మంత్రి అచ్చెన్నాయుడుకు ఈయూ నేతల విజ్ఞప్తి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు వేతన సవరణలో భాగంగా 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) నేతలు విజ్ఞప్తి చేశారు. విజయవాడలో బుధవారం రవాణాశాఖమంత్రి కె.అచ్చెన్నాయుడును కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు వినతి పత్రాన్ని అందచేశారు. రోజురోజుకూ పెరుగుతున్న డీజిల్ ధరలు, ప్రభుత్వ విధానాలు, అక్రమ రవాణా తదితర కారణాల వలన సంస్థ నష్టాల్లో నడుస్తుందే తప్ప కార్మికులు కారణం కాదని వారు స్పష్టం చేశారు. నష్టాలపేరుతో 21 నెలల గడువు దాటినా వేతన సవరణలు జరగకపోవడంతో తాము యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. ఇప్పటికే ఎన్జీవోల కంటే 25 శాతం తక్కువ జీతాలు కలిగిన ఆర్టీసీ సిబ్బందికి 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం సమంజసమేనన్నారు. సంస్థను ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంత్రి స్పందిస్తూ త్వరలోనే యాజమాన్యం సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి సమ్మె లేకుండా చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకుందామని సూచించారు. మంత్రిని కలసినవారిలో ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.వి.రావు, పలిశెట్టి దామోదరరావుతోపాటు రాష్ట్ర నాయకులు ఎం.హనుమంతరావు, రామచంద్రరావు, సిద్ధిక్, శంకరరావు, సుభాని, చక్రవర్తి, వై.ఎస్.రావు, నారాయణ ఉన్నారు.

గడువులోగా హౌసింగ్ ప్రాజెక్టుల పూర్తి

అధికారులతో సీఎస్ పునేఠ

విశాలాంధ్ర - అమరావతి: నిర్ణీత గడువులోగా పట్టణ గృహనిర్మాణ ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) అనిల్ చంద్ర పునేఠ ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఏపీ టిడ్కో రాష్ట్రస్థాయి మంజూరు, పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో టిడ్కో హౌసింగ్ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. అన్ని ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. మొదటి దశ ప్రాజెక్టు పనులను నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశధించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టేందుకు కృషి చేయాలని సూచించిన ఆయన, రాష్ట్ర వాటాను త్వరగా విడుదల చేయాలని ఆర్థికశాఖను ఆదేశించారు. రాష్ట్రంలోని పలు గృహనిర్మాణ ప్రాజెక్టులపై టిడ్కో ఎండీ దివాన్ మైదీన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్‌టీఆర్ నగర్‌ల కింద పట్టణాల్లో 5,29,786 ఇళ్లు మంజూరవ్వగా, 4,60,492 ఇళ్లకు టెండర్లు ఖరారైనట్లు తెలిపారు. ప్రస్తుతం 3,60,365 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఎన్‌టీఆర్ అర్బన్ హౌసింగ్‌లో 4,28,444 ఇళ్లకు 71 వేల ఇళ్లు పూర్తయినట్లు తెలిపారు. పలు పథకాలలోని ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నుంచి రూ.861 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.676 కోట్లు సమకూరనున్నట్లు తెలిపారు. మిగిలిన రూ.1,191 కోట్లను లబ్ధిదారులు తమ వాటాగా భరిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాములు, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్, మున్సిపల్‌శాఖ డైరెక్టర్ కె కన్నబాబు, గృహనిర్మానశ్శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్ వల

రైతులు విలవిల

భూములు లాక్కోవడానికి వరుస జీవోలు

విశాలాంధ్ర-విశాఖ సిటీబ్యూరో: చంద్రబాబు ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ జోరు పెంచింది. విశాఖ పరిసర మండలాల్లో అత్యంత విలువైన భూములను పూలింగ్ పేరుతో గంపగుత్తగా కొట్టేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. గాజువాక, పరవాడ, సబ్బవరం మండలాల పరిధిలోని ట్రై జంక్షన్ పేరుతో ఆగనం పూడి, ఈ మర్రిపాలెం, పెదముషిడివాడ, గంగవరం, నంగినారపాడు గ్రామాల్లో 673.52 ఎకరాలు సమీకరించేందుకు జీవో జారీ చేసిన విషయం తెలి సిందే. ఇటీవల భీమిలి మండలం కొత్తవలస గ్రామంలో 42 ఎకరాలు, సౌభాగ్య రాయపురం గ్రామంలో 122.98 ఎకరాలు సమీకరించేందుకు జీవో 414ను జారీ చేశారు. టౌన్‌షిప్‌ల పేరిట ట్రై జంక్షన్‌లో 770 మంది అసైన్డు, అక్రమణదారుల నుంచి 673.52 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ పేరిట సమీకరించేందుకు రెండు నెలల కిందట జీవో జారీ చేశారు. ఈ జీవో ప్రకారం ఇప్పటికే ఈ ట్రై జంక్షన్‌లో 224 మంది బాధితుల నుంచి 245.525 ఎకరాలు సమీక రించింది. ఇంకా 546 మంది రైతుల నుంచి 427.995 ఎకరాలు సమీకరించేందుకు కసరత్తు చేస్తోంది. విశాఖ రూరల్ మండల పరిధిలోని పరదేశిపాలెంలో 251 మంది నుంచి 43.9 ఎకరాలు, కొమ్మాదిలో 109 మంది నుంచి 105.5 ఎకరాలు, భీమునిపట్నం మండలం కొత్తవలస గ్రామంలో తొమ్మిది మంది డిపట్టాదారుల నుంచి 42 ఎకరాలు, ఎస్.ఆర్.పురంలో 177 మంది నుంచి 122.98 ఎకరాలు, ఆనంద పురం మండలం దబ్బంద గ్రామంలో 54 మంది నుంచి 77.89 ఎకరాలు, గంగిగుండంలో 40 మంది నుంచి 79.20 ఎకరాలు సమీకరించడానికి జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఆ మేరకు ఎస్.ఆర్. పురం, కొత్తవలసలో 164.98 ఎకరాల కోసం ఇటీవల జీవో జారీ చేసింది. ఈ జీవో ప్రకారం కొత్తవలసలో తొమ్మిది మంది డి పట్టాదారుల నుంచి 42 ఎకరాలు, రికార్డుల్లో ఉన్న ఆక్రమణదారులు 125 మంది నుంచి 87.23 ఎక రాలు, రికార్డుల్లో లేని 47 మంది నుంచి 31.62 ఎకరాలు సమీకరించనున్నారు. పెందుర్తి మండలం ముదపాక, రామవరం గ్రామాల్లో మరో 850 ఎకరాలు సమీకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించారు. పది రోజుల్లో రెండు గ్రామాల్లోనూ భూములు సేకరించడానికి జీవో రానుంది.

అగ్రిగోల్డ్‌పై రాజకీయం తగదు

- రాజకీయ పార్టీల దీక్షలు విరమించాలి
- దీంతో నష్టపోయేది బాధితులే
- అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కష్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

విశాలాంధ్ర-ఒంగోలు: అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి తుదిదశలో ఉన్న సమయంలో కొన్ని రాజకీయ పార్టీలు సమస్యను రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రాజకీయ పార్టీలు దీక్షలను విరమించుకోవాలని, ఆ దీక్షల వల్ల నష్టపోయేది అగ్రిగోల్డ్ బాధితులేనని అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పన్నే ఉచ్చులో అగ్రిగోల్డ్ బాధితులు పడరాదని, అలా వారి వెంట వెళితే సమస్య మొదటికి వస్తుందన్నారు. నాలుగు సంవత్సరాలుగా అగ్రిగోల్డ్ బాధితులపక్షాన నిలిచి పోరాటం చేస్తున్నది అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఒక్కటి మాత్రమే అని చెప్పారు. దేశంలో అనేక కంపెనీలు ప్రజలను మోసం చేస్తే పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాలుగు సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. అసోసియేషన్‌కు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే పోరాటం చేసేందుకు సిద్దంగా ఉన్నామని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు చివరి పైసా దక్కేంత వరకు, అగ్రిగోల్డ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమం ఆగదన్నారు. ఈ పోరాటానికి కామా పెట్టామే తప్ప ఫులిస్టాప్ పెట్టలేదన్నారు. పోరాటం తొలిరోజులలో అన్ని రాజకీయ పార్టీల సహకారం కోరామన్నారు. డబ్బులు ఇచ్చేదశలో రాజకీయ పార్టీలు లేకపోయినా మరో అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా ఇచ్చేలా ముందుకు రావాలని, మృతుల కుటుంబాలను పరామర్శించాలని అనేక పర్యాయాలు కోరామన్నారు. అప్పుడు రాని కొన్ని రాజకీయ పార్టీలు సమస్య ఒక కొలిక్కి వచ్చిన దశలో ముందుకు ఎందుకు వస్తు న్నాయో తెలియటం లేదన్నారు. తాము ఏ రాజకీయ పార్టీ జెండా కింద ఈ పోరాటం చేయలేదన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు ద్వారా సీపీఐ కార్యాలయా లను సమావేశాలకు వాడుకున్నామని తిరుపతిరావు చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి రావు, అధ్యక్షులు విశ్వనాధరెడ్డి నిరవధిక నిరాహార దీక్ష చేసిన తర్వాతే ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. ఈ ఉద్యమానికి సీపీఐ అన్ని వేళలా వెన్నుదన్నుగా ఉందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు వి హనుమారెడ్డి, నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, నగర నాయకులు బి చంద్రశేఖర్, అసోసియేషన్ నాయకులు గోవింద రాజులు, సుధాకర్, శేషగిరిరావు, రత్నం, చంద్రకళ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌ను వాయిదా వేయాలి

ఏఐటీయూసీ డిమాండు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జనవరిలో జరుగనున్న మెడికల్, ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షలను తక్షణమే వాయిదా వేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. జనవరి 8,9 తేదీలందు జరిగే జాతీయ సార్వ త్రిక సమ్మెను నీరుగార్చాలనే దురుద్దేశ్యంతోనే మొదటి వారంలో మెడికల్, ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని ఆయన విమర్శించారు. వాస్తవానికి పది కేంద్ర కార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఏఐసీసీటీయూ, యూటీయూసీ, టీయూసీసీ, ఎల్‌పీఎఫ్, ఎస్ఈడబ్ల్యూఎలు 2018 సెప్టెం బర్ 28న న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సమ్మేళనంలో సమ్మె చేయాలని నిర్ణయించాయి. ఆ మేరకు 2018 డిసెంబర్ 17 నుండి 22 తేదీలందు అన్ని పరిశ్రమల్లో ఎస్టాబ్లిష్ మెంట్స్‌లలో సమ్మె నోటీసులు ఇచ్చారు. గత మూడు మాసాలుగా ఈ సార్వత్రిక సమ్మె పైన దేశవ్యాపితంగా సదస్సులు, ప్రదర్శనలు ద్వారా, కరపత్రాలు, పోస్టర్స్ తదితర రూపాల్లో విస్తృతంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. నేడు ఈ సమస్య జాతీయ అజెండాలో ప్రధాన సమస్యగా చర్చించబడుతుంది. ఈ నేపద్యంలో కేంద్ర ప్రభుత్వం ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశపరీక్షలు జరపాలని నిర్ణయించడం విడ్డూరమన్నారు. ఆ తేదీలందు పరీక్షలు నిర్వహిస్తే అన్ని రాష్ట్రాల్లో ఉన్న రవాణా రంగ కార్మికులు సమ్మె చేయడం వల్ల విద్యార్థులందరికీ అసౌకర్యం కలుగుతుంది. దీని వల్ల విద్యార్థుల్లో అశాంతి, అలజడి, ఆందోళన కలుగుతుంది. కావున ఈ పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని ఓబులేసు డిమాండు చేశారు.

కాళేశ్వరంలో...కేసీఆర్...!



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం కేసీఆర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కాళేశ్వరం పనులను కేసీఆర్ రెండో రోజూ పరిశీలించారు. మంగళవారం మేడిగడ్డ, కన్నేపల్లి పంపుహౌస్‌లను పరిశీలించిన ఆయన రాత్రి కరీంనగర్‌లో బస చేశారు. బుధవారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్‌లో కన్నేపల్లికి చేరుకున్నారు. 13.2 కిలోమీటర్ల మేర అక్కడ జరుగుతున్న గ్రావిటీ కాలువ పనులను రోడ్డు మార్గంలో పరిశీలించారు. నాలుగు చోట్ల ఆగి గ్రావిటీ కాలువ పనులను చూశారు. పనులు నెమ్మదించడాన్ని గమనించిన ఆయన త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. లైనింగ్ పనులు మరింత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అక్కడి నుంచి అన్నారం బ్యారేజీ వద్దకు వెళ్లారు. 66 గేట్ల బిగింపు, 90 శాతం పనులు అక్కడ పూర్తవ్వడంతో అధికారులను అభినందించారు. మిగిలిన పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల బ్యారేజీని సందర్శించారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవనం పనులను పరిశీలించనున్నారు.

సంపాదకీయం

గుల్లబారిన ప్రాథమిక విద్య

జాతి భవిత తరగతి గదిలో రూపుదిద్దుకొంటుంది. నాణ్యమైన విద్య పిల్లలందరికీ అందినప్పుడే మానవ వనరుల వికాసమూ సాకారమవుతుంది. బడి ఈడు పిల్లలందరికీ నిర్బంధ, ఉచిత విద్య అందిస్తామంటూ ఎనిమిదేళ్ల కిందట 2009లో విద్యాహక్కు చట్టం అమల్లోకి తెచ్చారు. అయితే దాని అమలు ఎంత నిష్ఫచ్చగా ఉందో ప్రాథమిక విద్యపై ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థ ఎత్తిచూపుతోంది. 2015-16తో పోలిస్తే 2016-17 విద్యా సంవత్సరంలో కనీసం పది రాష్ట్రాల్లో అర్థాంతరంగా చదువులు మానేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తాజా అధ్యయనం తేల్చింది. ప్రాథమికోన్నత దశలో బడి మానేస్తున్న పిల్లల సంఖ్య బీహార్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల్లో చాలా ఎక్కువగా ఉంటుందనీ, బడిలో చేరుతున్న ప్రతి వందమంది పిల్లల్లో ప్రాథమికోన్నతస్థాయికి 80మంది, మాధ్యమిక స్థాయికి 60 మంది కూడా చేరడంలేదని గణాంకాలు చాటుతున్నాయి. మరోవైపు దేశంలోని దాదాపు 14శాతం గ్రామాల్లో పాఠశాలలు లేవని గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించిన సమాచారం. అంతేకాదు, అంత్యోదయ కార్యక్రమానికి సేకరించిన సమాచారం ప్రకారం 47 శాతం గ్రామాల్లో ప్రాథమిక స్థాయి స్కూలు మాత్రమే ఉంది. 5,27,507 గ్రామాలు, 2.3 లక్షల గ్రామపంచాయతీల సమాచారం పరిశీలిస్తే, అందులో 75,613 గ్రామాలు అంటే 14.33 శాతం గ్రామాల్లో అస్సలు స్కూలన్నదే లేదు. ఎనిమిదో తరగతి వరకు చదువుకోడానికి స్కూలు సదుపాయం ఉన్న గ్రామాలు కేవలం 21 శాతం. హైస్కూలు అంటే 10వ తరగతి వరకు చదువుకునే సదుపాయం ఉన్న గ్రామాలు కేవలం 11 శాతం. దేశంలోని 15లక్షల 16వేలకు పైచిలుకు పాఠశాలలుంటే, వాటిలో లక్షల సంఖ్యలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఇదీ మన చదువుల దుస్థితి. విద్యాహక్కు చట్టం అమలు ఎంత ప్రహసనంగా తయారైందో అర్థమవుతోంది. ప్రాథమిక విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన సర్వశిక్షా అభియాన్ పనితీరు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఎకాయెకి ఆరుకోట్ల 21లక్షల మంది పిల్లలు బడి బయటే ఉన్నారని 2014లో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలు బడి మానేసే అవకాశం ఉన్న పిల్లల్ని గుర్తించి నిలువరించే యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేసుకోలేదంటే పాలకుల శ్రద్ధ ఏపాటిదో తేటతెల్లమవుతోంది. బడి మానేస్తున్న పిల్లల్లో 38.8శాతం దళిత, 48.2శాతం ఆదివాసీ వర్గాలకు చెందినవారే. ఇది సామాజిక అసమానతలకు మరింత ఊతంగా మారుతోంది. ఒకవైపు పాఠశాలల్లేని ఊళ్లుంటే, మరోవైపు హేతుబద్ధీకరణ పేరిట అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సర్కారీ స్కూళ్లను మూసివేయడం, కుదించడం వంటి చర్యలతో పిల్లల ముఖ్యంగా ఆడపిల్లల చదువులకు శరాఘాతమవుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో 25శాతం సీట్లు అంటే దాదాపు 20లక్షల సీట్లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇవ్వాలి. కానీ అందులో కేవలం 20శాతం సీట్లు మాత్రమే ఇస్తున్నారని ఇండస్ యాక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ తెలిపింది. 2016-17లో కేవలం 4.3 లక్షల ప్రవేశాలు ఉన్నాయి. ప్రతి పౌరుడు ప్రాథమిక విద్యను అందుకోగలిగితే ప్రపంచ పేదరికం సగానికన్నా అధికంగా తగ్గిపోతుందని ఐక్యరాజ్యసమితి నిరుడు జూన్‌లో ప్రకటించింది. సార్వత్రిక విద్యాలక్ష్యాల సాధనలో ఇప్పటికే అర్ధ శతాబ్ది వెనకబడిన భారత్, 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు చేరుకొనే అవకాశం సుదూరంలో ఎక్కడా కనిపించడంలేదు. విద్యారంగంలో తక్షణమే మౌలిక మార్పులు తీసుకురావాల్సిన వాస్తవాన్ని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. చదువుల్లోని నాణ్యత ఏటికేడు దిగనాసిపోతోంది. ఎనిమిదో తరగతి చదువుతున్న పిల్లలకు మాతృభాష చదవడం, రాయడం కూడా సరిగా రావడంలేదు. చిన్నచిన్న లెక్కలు కూడా చేయలేకపోతున్నారు. రోజురోజుకూ చదువుల నాణ్యత గాలిలో దీపంగా మారిపోతున్నది. నిధుల కేటాయింపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయి. 2016-17 ఎకనామిక్ సర్వేలోని గణాంకాల ప్రకారం 2013-14లో మొత్తం బడ్జెట్‌లో విద్యారంగానికి 4.57 శాతం కేటాయించిన కేంద్రం 2017-18కి వచ్చేసరికి దాన్ని 3.71 శాతానికి దిగజార్చింది. రాష్ట్రాల తీరుతెన్నులూ ఇలాగే ఉన్నాయి. నాలుగేళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా రెండు లక్షల పాఠశాలలు మూతబడ్డాయి. ఈ సమస్యల సంతతిని పట్టించుకోని పాలకులు మాత్రం విద్యా ప్రమాణాలు పడిపోవడానికి కారణం విద్యార్థులే అనే భావనతో వ్యవహరిస్తున్నారు. విద్యా హక్కు చట్టానికి రెండో సవరణ బిల్లును తెచ్చింది. దీని ప్రకారం ప్రతి తరగతిలోనూ నిర్దేశించిన మార్కులు పొందితేనే వారిని పై తరగతులకు పంపుతారు. రెండు నెలల్లో మరోసారి పరీక్ష నిర్వహించి, అందులోనూ ఉత్తీర్ణులు కాలేకపోతే అదే తరగతిలో ఉంచుతారు. ఈ బిల్లు నిర్బంధ విద్యాహక్కు చట్టానికి విరుద్ధం. నో డిటెన్షన్‌కు వీలు కల్పిస్తున్న విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 16ను సవరించాలని నిరుడు ఆగస్టులో కేంద్ర కేబినెట్ తీర్మానించింది. దీనికి 24 రాష్ట్రాలు అనుకూలంగా, ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వ్యతిరేకంగా ఉన్నాయని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ ఇటీవల చెప్పారు. రెండింటిలో ఏదో ఒక విధానాన్ని ఎంచుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు విడిచిపెట్టామనీ, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇది అమలవుతుందని కూడా ఆయన వెల్లడించారు. విద్యా ప్రమాణాలు పడి పోవడానికి నో డిటెన్షన్ విధానమే కారణమంటూ కేంద్రం దాన్ని తొలగించేందుకు నడుంబిగించింది. ఆడలేక మద్దెల ఓడు అన్నట్టు ఉంది కేంద్రం వైఖరి. పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, ఉన్న వాటిలో కనీస సదుపాయాలు కొరవడడం, ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీచేయకపోవడం.. ఇలా సమస్య మూలాలు తమ దగ్గరపెట్టుకొని, లోపం విద్యార్థులపైకి నెట్టడం క్షమించరాని నేరం. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఉన్న పాఠశాలలు పట్టుమని 10శాతం కూడా లేవు. బడిఈడు పిల్లలు తప్పనిసరిగా తరగతి గదిలో ఉండాలన్న సంకల్పానికి ఈ చర్య గండికొట్టేదిగా ఉంది. ఈ సవరణ అట్టడుగు వర్గాల పిల్లలకు తీరని అన్యాయం చేస్తుందనడంలో సందేహంలేదు. కాబట్టి దేశంలోని విద్యా వ్యవస్థకు సంబంధించిన ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు దృష్టి పెట్టకుండా ఇటువంటి చర్యలు చేపట్టడం విద్యా వ్యవస్థనే కాదు, దేశ ఆర్థిక భవితవ్యాన్ని కూడా దెబ్బతీసినట్లవుతుంది.

చురక

ప్రధాని మోడీగారు
ప్రజల ప్రేమ పాత్రుడు
వేధింపులు అసహనం
విశ్వాసపు పుత్రుడు

అందరికీ తన పాలన
ఆదర్శం అన్నమాట
ప్రజాస్వామ్య వ్యవస్థల
పైన దాడి ఉన్న మాట

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

ప్రధాని మోడీ కావాలని

దాచినవి, తెలిసి కూడా ఎఎన్ఐ అడగనివి !

ఎం కోటేశ్వరరావు

మిన్నువిరిగి మీద పడితే తప్ప ప్రధాని నరేంద్రమోడీ మీడియా గోష్టిలో ముఖాముఖీ మాట్లాడని భారత తొలి ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించటం ఖాయమని తేలిపోయింది. బహుశా ప్రపంచంలోనే తొలి ప్రజాప్రతినిధి కూడా అయి వుండవచ్చు. పది సంవత్సరాల కాలంలో మూడంటే మూడు సార్లు మాత్రమే మీడియాతో మాట్లాడిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను మౌనముని అని ఎద్దేవా చేసిన వారిలో బిజెపి కూడా ఉంది. సోనియాగాంధీ అనుమతి ఇవ్వని కారణంగా మన్మోహన్ అలా చేసి వుండవచ్చు. నాకు 56 అంగుళాల ఛాతీ వుంది, రిమోట్ కంట్రోలు లేదు అని చెప్పుకొనే నరేంద్రమోడీ ఒక్కసారి కూడా మాట్లాడకపోవటానికి కారణాలేమిటో ? అయితే ఏ ప్రధానీ ఇవ్వనన్ని ఫోజులు మీడియా కెమెరాలకు ఇచ్చారు కదా అని ఆయన భక్తకోటి దెబ్బలాటకు దిగవచ్చు. అలాంటి పెద్ద మనిషి నరేంద్రమోడీ జనవరి ఒకటవ తేదీన, హిందూత్వశక్తులు, అసలు సిసలు భారతీయతకు ప్రతీకలం అని చెప్పుకొనే వారు మొహాలు ఎక్కడో పెట్టుకొని సిగ్గుపడే విధంగా ఎఎన్ఐ అనే వార్తా సంస్థకు ఆంగ్ల సంవత్సరాది రోజు 95నిమిషాల ఇంటర్వ్యూ ఇచ్చారు. అది యాదృచ్ఛికం తప్ప ఆంగ్ల సంవత్సరాదికి మోడీ ఇంటర్వ్యూకు సంబంధం లేదని వితండవాదం లేదా భాష్యం చెప్పే బాపతు కూడా మనకు తగలవచ్చు.

బ్రిటన్‌లో చాలా కాలం కిందట రాజు గారి తరువాత రాణీగా ప్రతిపక్షంగా వ్యవహరించే పార్టీలు వుండేవి. అంటే రాజు, రాణీలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అణిగిమణిగి ప్రశ్నించే పక్షాలవి. అలాగే నరేంద్రమోడీ మన దేశంలో అలాం టి మీడియాను రంగంలోకి తెచ్చిన ఆద్యుడిగా చెప్పుకోవాలి. ఒక యాంకర్‌గా చర్చలో పాల్గనేవారి మీదకు ఎక్కే ఆర్నాబ్ గోస్వామి నక్క వినయాలతో నరేంద్రమోడీని ఇంటర్వ్యూ చేసిన విషయం తెలిసిందే. అంటే ముందుగానే ఏ ప్రశ్నలు అడగాలో ఏమి జవాబులు చెబుతారో, వాటి మీద ఉప ప్రశ్నలు వేయకుండా ఎలా నోరు మూసుకోవాలో అన్నీ ముందే నిర్ణయం అవుతాయి. ఒక వేళ నోరు జారితే ఆ భాగాన్ని తొలగిస్తారను కోండి అది వేరే విషయం. జనవరి ఒకటిన ఎఎన్ఐ ఇంటర్వ్యూ కూడా అలాంటి ముందస్తు ఏర్పాటుతో జరిగిందే అని వేరే చెప్పనవసరం లేదు. ఆ షరతుకు ఒప్పుకుంటేనే తన గదిలో మోడీ నోరు విప్పుతారు.

కొంతమంది ఓటమి లేదా తప్పిదాలను ఒక పట్టాన ఒప్పుకోరు. అందునా అవకాశవాద రాజకీయ నాయకులు కిందపడ్డా మాదే విజయం అంటారు. రెండు సంవత్సరాల క్రితం నరేంద్రమోడీ చేసిన పెద్ద నోట్లను రద్దు గురించి తాజా ఇంటర్వ్యూలో చెప్పిందేమిటి? ఇదేమీ ఝట్కా (ఆకస్మిక నిర్ణయం) కాదు, ఏడాది క్రితమే మీ దగ్గర నల్లధనం ఏదైనా వుంటే డిపాజిట్ చేయండి, అపరాధరుసుం చెల్లించండి, మీకు సాయం దొరుకుతుంది అని హెచ్చరించా. అయినప్పటికీ ఇతరుల మాదిరే మోడీ కూడా వ్యవహరిస్తారులెమ్మని కొంత మందే స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. నోట్ల రద్దుకు ముందు సమాంతర ఆర్థిక వ్యవస్థ వుంది, అది అంతర్గతంగా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసింది. సంచుల్లో దాచిన కరెన్సీ బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చింది.' అన్నారు మోడీ.

మోడీ మహాశయుడు నోట్ల రద్దు గురించి చెప్పిందాంట్లో కొత్తదేమీ లేదు. సాధించింది ఏమిటో చెప్పాలి కదా ! ఎంత నల్లధనం బయపడింది, దానిని ఎలా ఉపయోగించారు, దాని వలన ఆర్థిక వ్యవస్థకు జరిగిన మేలేమిటి? బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద మొత్తంలో కరెన్సీ వస్తే ఇప్పుడు బ్యాంకులకు ప్రభుత్వం మూలధనం సమకూర్చేందుకు రిజర్వుబ్యాంకుల వద్ద వున్న మిగులును ఇమ్మని ఎందుకు అడుగుతున్నట్లు ? వీటి గురించి ఎంత తరచినా కేంద్ర ప్రభుత్వం లేదా రిజర్వుబ్యాంకు అధికా రికంగా ఒక్క ప్రకటనా చేయలేదు. ఒక సాధారణ అంశం మాదిరి, 2018 ఆగస్టులో తన వార్షిక నివేదికలో తప్పదు కాబట్టి వివరాలను పొందుపరచింది. దాని ప్రకారం రద్దయిన నోట్లలో 99.3శాతం తిరిగి బ్యాంకులకు వచ్చాయి. ఆ మిగిలిన 0.7శాతం కూడా చిరిగిపోయి, ధ్వంసమై చెలామణిలో లేని లేదా అమాయకంగా మార్చుకోకుండా తమవద్దే వుంచుకున్న అమాయక సామాన్యుల వద్ద వుండిపోయింది తప్ప అది నల్లధనం కాదు. రద్దు వలన వచ్చిన లాభం కంటే జరిగిన నష్టమే ఎక్కువని అందరికీ తెలిసినా అంగీకరించటానికి 56 అంగుళాల ఛాతీకి ధైర్యం చాల్లేదు.

రిజర్వుబ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామా గురించి నరేంద్రమోడీ పెద్ద జోక్ పేల్చారు. మొదటిసారిగా బయట పెదుతున్నానంటూ రాజీనామాకు ఆరేడు నెలల ముందే తాను తప్పుకుంటానని చెప్పారని, వ్యక్తిగతంగా తనకు రాత పూర్వకంగా తెలియచేశారని నరేంద్రమోడీ చెప్పారు. రాజీనా మా సమయంలోనే ఈ విషయం ఎందుకు చెప్పలేదు, అదేమైనా రహస్యమా, దేశ భద్రతకు సంబంధించిన అంశమా ? రిజర్వుబ్యాంకు వద్ద వున్న నిధులను కేంద్ర ప్రభుత్వానికి బదలాయించమని పటేల్‌ను ఒత్తిడి చేసిన అంశం బహిరంగ రహస్యం. మిగులు నిధులు, ఇతర కొన్ని అంశాలలో తాము చెప్పినట్లు చేయకపోతే కుదరదని తెగేసి చెప్పటమే గాక దేశ చరిత్రలో తొలిసారిగా రిజర్వుబ్యాంకు చట్టంలోని సెక్షన్ ఏడును ప్రయోగించింది. దాని ప్రకారం ప్రభుత్వం చెప్పినట్లు రిజర్వు బ్యాంకు వ్యవహరించాల్సి వుంటుంది. ఒక స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన సంస్థకు అధిపతిగా వున్న వ్యక్తిలో ఏ కాస్త ఆత్మగౌరవం వున్నా దానికి నిరసనగా రాజీనామా చేయటం తప్ప మరొక మార్గం లేదు. ఉర్జిత్ పటేల్ ఆ పని చేయకుండా తన వ్యక్తిగత కారణాలు చూపి తప్పుకున్నాడు. అయినా నరేంద్రమోడీ ఈ విషయం గురించి పిట్టకథలు చెబుతున్నారు. రాజీనామాకు అనుమతించాలంటూ ఆరేడు నెలల క్రితం పటేల్ రాసిన లేఖను మోడీ బయట పెట్టి వుంటే ఆయన చెబుతున్న మాటలకు విశ్వసనీయత వుండేది.

రాజకీయాల గురించి ఎంత జాణతనంతో మాట్లాడినా చెల్లుతుంది. రైతాంగరుణ భారం వంటి తీవ్ర సమస్యల గురించి ప్రధాని మోడీ చాలా చులకనగా మాట్లాడారు. రుణాల రద్దు లాలీపాప్ వంటివన్నారు. అదే నిజమైతే ఆయన పార్టీ మంత్రులు ఎందుకు రుణాల రద్దు గురించి మాట్లాడుతున్నట్లు ? మోడీ మాట్లాడటానికి ఒక రోజు ముందే తమకు ఒడిషాలో అధికారమిస్తే రైతుల రుణాలను రద్దు చేస్తామని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ అన్నట్లుగా మోడీ తీరు వుంది. రుణాల రద్దు కొద్ది మందికే ఉపయోగ పడుతున్నాయని, బ్యాంకుల నుంచి తీసుకొనే వారు తక్కువ, వడ్డీ వ్యాపారుల వద్ద తీసుకొనే వారే ఎక్కువ కూడా మోడీ సెలవిచ్చారు.ఆయనకు వాస్తవాలు తెలియవా, నివేదికలు చదవరా ? చదివించుకోరా ? అర్థంగాకపోతే వివరించమని అధికారులను అడగరా ? బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొనే రైతులు చాలా తక్కువని ప్రధానే చెప్పారంటే అర్థం ఏమిటి? బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వటం లేదనే కదా ? అదే నిజమైతే కేంద్రం గత ఐదేండ్లుగా ఏమి చేస్తున్నట్లు, ప్రాధాన్యతా రంగంగా ప్రకటిం చిన వ్యవసాయానికి రుణాలు తగినన్ని ఇవ్వలేదని బ్యాంకులను ఎందుకు నిలదీయలేదు. అసలు వాస్తవం ఏమంటే 2018ఆగస్టులో నాబార్డు వెల్లడించిన అధ్యయనం ప్రకారం 52.5శాతం రైతు కుటుంబాలు రుణభారంలో కూరుకు పోయాయి. వీరిలో కేవలం 11.5శాతమే వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకున్నారు. మోడీ చెప్పిందేమిటి ?

సర్జికల్ దాడులు తీవ్రముప్పుతో కూడుకున్నవి గనుక ఎక్కువ సేపు సాగించకుండా తెల్లవారక ముందే పూర్తి చేసి రమ్మని తాను స్పష్టమైన మార్గదర్శక సూత్రాలను జారీచేసినట్లు ప్రధాని చెప్పుకున్నారు. వినేవారుంటే చెప్పేవారు ఎన్నయినా పిట్టకథలు చెబుతారు. ఇలాంటి దాడుల గురించి గతంలో వాటిని నిర్వహించిన వారు చెప్పాలి. లేని గొప్పలు చెప్పు కోవటం తప్ప ఏ అనుభవంతో మోడీ మార్గదర్శక సూత్రాలు జారీ చేసినట్లు? గతంలోనూ అనేక దాడులు జరిపారు అయినా ఏ ప్రధానీ వాటిని ఇంతగా గొప్పలు చెప్పుకోలేదు. గోవధల పేరుతో మూకదాడులు చేసిన వారి గురించి మోడీ ఖండించారు. మరోవైపు ఆయన మంత్రులు చేసిందేమిటి? దాడులకు పాల్పడి శిక్షలు పడిన ఎనిమిది మంది నేరగాండ్లు బెయిలు మీద బయటకు వచ్చినపుడు హజారీబాగ్‌లో పూలదండలు వేసి మరీ కేంద్ర మంత్రి జయంత సిన్హా స్వాగతం పలికారు. ఇదేమి పనయ్యా అని అడిగితే అది భావ ప్రకటనా స్వేచ్ఛ అంటూ మరో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ గడుసు తనంతో తప్పించుకున్నారు. దాద్రి హత్య కేసులో నిందితుడు చస్తే శవం మీద జాతీయజండాను కప్పి ఒక నేరగాడికి గౌరవం ఇచ్చిన మరో మంత్రి మహేశ్‌శర్మలు మోడీగారికి ఈ సమయంలో గుర్తు లేదా లేక మంత్రులను ఖండించినట్లా ? ఎందుకీ వంచన? ఉత్తర ప్రదేశ్‌లో గోరక్షకులుగా చెప్పుకొనే వారు ఒక పోలీసు అధికారినే హత్య చేసిన విషయం తెలిసిందే.

రాఫెల్ విమాన ఒప్పందం గురించి మోడీ అతి తెలివి తర్కానికి పాల్పడ్డారు. అదానీ, అంబానీలకు లబ్ధి చేకూర్చారు కదా అన్న ప్రశ్నకు వ్యక్తిగతంగా నా పేరు చెప్పలేదు కదా ప్రభుత్వాన్ని అన్నారు, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి, ఎంత ఇచ్చారో చెప్పమనండి అని అడ్డు సవాలు విసిరారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు తమ ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇచ్చిందని అన్నారు. అయితే మోడీ చెప్పనిది, ఇంటర్వ్యూ చేసిన వారు అడగనిది ఏమిటి ? 126 విమానాల కోసం గతంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి అధిక ధరలకు 36విమానాలు ఎందుకు కొన్నారు ? ఎంతో అనుభవం వున్న హాల్‌ను విస్మరించి ఎలాంటి అనుభవం లేని అనిల్ అంబానీకి కాంట్రాక్టు ఎందుకిచ్చారు? అంబానీ కంపెనీ దివాలా తీసిందా లేదా ? విమానాల ధరల వివరా లను పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీకి కాగ్ ఇచ్చినట్లు సుప్రీం కోర్టుకు ప్రభుత్వం తెలిపింది. అలాంటిదేమీ లేదని కమిటీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అధికారయుతంగా చెప్పారు. 2జి స్పెక్ట్రమ్ మాదిరి సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ ఎందుకు జరపరు? భారత ప్రభుత్వమే అంబానీ కంపెనీ పేరు సిఫార్సు చేసిందని ఫ్రెంచి మాజీ అధ్యక్షుడు హోల్లాండే ప్రకటించినదాని సంగతేమిటి ?

ముమ్మారు తలాక్ అంశం లింగవివక్షకు సంబంధిం చింది, శబరిమల అంశం సాంప్రదాయం అని మోడీ మహిళల పట్ల వివక్షను సమర్థిస్తూ సుప్రీం కోర్టు మెజారిటీ న్యాయమూర్తుల తీర్పును విస్మరించి వివక్షను సమర్థించిన మహిళా న్యాయమూర్తి ఇందు మల్హోత్రా చెప్పిన అంశాలను ప్రధాని వివరించారంటే దేశానికి ఏ సందేశం పంపినట్లు? అన్ని కేసులలోనూ మైనారిటీ న్యాయమూర్తుల వ్యతిరేక తీర్పులనే సమర్థిస్తారా ? అదే ప్రాతిపదిక అయితే ఆధార్ కేసులో ఆ పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలంటూ మైనారిటీ తీర్పు చెప్పిన చంద్రచూడ్ వైఖరిని అనుసరించి ఆధార్‌ను రద్దు చేస్తారా ? శబరిమలలో మహిళల పట్ల వివక్షను ప్రధాని సమర్థిస్తున్న సమయంలోనే కేరళ మహిళా మానవహారంలో పాల్గన్నట్లు చెబుతున్న 30 నుంచి 50లక్షల మంది వరకు మహిళలు ప్రధాని వైఖరిని ఖండించినట్లే. ఇలా అనేక అంశాలను మోడీ కావాలనే విస్మరించారు, ఇంటర్వ్యూ చేసిన వారికి అవన్నీ తెలిసి కూడా అడగకుండా దాటవేశారు.

చీకట్లను తరిమిన దివ్వె
'సావిత్రి బాయి పూలే'



దేశం అంధకారాలు
అలుముకుని
కనుమరుగవుతోంది
జాతి మొత్తం
దిక్కూమొక్కూ లేక
ఓ అమాస గుహలా
నిర్బంధంలో కూరుకుపోయింది
మానవ మెదళ్ళు కులం కంపులో కొట్టుకుంటూ
మతం ముసుగులో మారణ హోమం జరుపుకుంటూ
చీకటి రాజ్యాలు ఏలుతుంటే
ఒకానొక ఎడారి ప్రాంతంలో
దేశం చదువుకోసం గావుకేకలు పెట్టి
నీటి చెలమలులేని బతుకులా
జాతి గొంతులు ఎండిపోతున్న వేళ
జాతి జనుల దప్పిక తీర్చటానికి
ఓ చల్లని హృదయం
ఒయాసిస్సులా ఉద్భవించింది
కరుడుగట్టిన గుండెలకు
ఆమే ఓ చదువుల ధిక్కారమై
వెన్నులో వణుకు పుట్టించింది
కులం తాలుకు మూలాలను
ఎడం కాలుతో తంతూ గుండెల్ని కబళించేలా
కాలం కొలిమి నిప్పుల సెగల గుండా
సరికొత్త దేశచరిత్ర ఆమె పేరుతో లిఖించబడింది
భారతదేశ మొట్టమొదటి
'చదువుల తల్లి 'ఉపాధ్యాయురాలు'
సావిత్రి బాయిపూలే'

(నేడు భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు 'సావిత్రి బాయి పూలే' జయంతి సందర్భంగా)

- తంగిరాల సోని, సెల్ : 9676609234

సంస్మరణ

తొలితరం మహిళా ఉద్యమనేత

సుబ్బాయమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శం



పెన్మెత్స దుర్గాభవాని

జాతీయోద్యమ కాలంనాటి తొలితరం మహిళానేత, కమ్యూనిస్టు నాయకురాలు శ్రీమతి దూసనపూడి సుబ్బాయమ్మ డిసెంబరు 22న తాడేపల్లిగూడెంలోని స్వగృహంలో కన్నుమూసారు. ఏడున్నర దశాబ్దాల ప్రగతిశీల, వామపక్ష మహిళా ఉద్యమంలో దాదాపు ఐదు దశాబ్దాల పాటు క్రియాశీలకంగా పాల్గొన్న చరిత్ర సుబ్బాయమ్మ సొంతం. అవిద్య, మూఢనమ్మకాలు, సాంఘిక వెనుకబాటుతనం, మహిళలపట్ల తీవ్ర వివక్ష కొనసాగుతున్న రోజులలో కఠినమైన సాంఘిక మూస చట్రం నుండి బైటకొచ్చిన తొలితరం మహిళా ఉద్యమ కార్యకర్తలలో సుబ్బాయమ్మ ఒకరు. మహిళా సమస్యలపై సాగిన ఉద్యమాలకు మహిళలను సమీకరించి ఎన్నో పోరాటాలలో ఆమె పాల్గొన్నారు. మహిళల ఆకాంక్షలను, సమస్యలను ప్రతిబింబించే నినాదాలను ప్రాచుర్యంలోకి తేవడంతోపాటు, వాటికి సామాజిక ఆమోదం తీసుకురావడంలో తొలితరం మహిళా నేతల కృషి అనన్య సామాన్యం. అందులో సుబ్బాయమ్మ వంటి కార్యకర్తల కృషి చిరస్మరణీయమైనది.

తాడేపల్లిగూడెం పట్టణ ప్రముఖులు. మోడ్రన్ కేఫ్ హోటల్ వ్యవస్థాపకులు పైబోయిన వెంకట్రామయ్య, కొండమ్మ దంపతులకు 1931లో సుబ్బాయమ్మ జన్మించారు. ఐదవ తరగతి వరకు చదువుకున్నారు. తల్లితండ్రులు ఇద్దరూ కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వాములు కావడంతో సుబ్బాయమ్మపై కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం చిన్నతనంలోనే పడింది. తల్లి కొండమ్మ మహిళా సంఘం ఏర్పడిన తొలినాళ్ల నుండి చురుగ్గా పాల్గొన్నారు. తల్లితోపాటు సుబ్బాయమ్మ కూడా పాల్గొనడం ప్రారంభించారు. 1943 డిసెంబరు 24, 25 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా నవుడూరులో జరిగిన జిల్లా మహిళా సంఘం మహాసభలకు తన తల్లి, సోదరితోపాటు సుబ్బాయమ్మ హాజరయ్యారు.

నాటి మహిళా ఉద్యమనేతలు డా॥ కె. అచ్చమాంబ, మానికొండ సూర్యావతి, సంకు లక్ష్మీకాంతం, భూపతిరాజు లక్ష్మీకాంతమ్మ తదితరుల ప్రసంగాలతో సుబ్బాయమ్మ ఉత్తేజితులయ్యారు. నవుడూరు మహిళా మహాసభ చర్చించిన అంశాలు, ఆమోదించిన తీర్మానాలు అనంతర కాలపు మహిళా ఉద్యమానికి దిశా నిర్దేశం చేసాయి. నాటి మహిళా ఉద్యమ కార్యకర్తల దూరదృష్టి ఆ తీర్మానాలలో ప్రతిబింబించుతుంది. మహిళలకు ఆస్తిలో వారసత్వ హక్కు, వివాహాల తప్పనిసరి రిజిస్ట్రేషన్, విడాకుల హక్కు, బాల్య వివాహాల నిషేధం, బాలికలకు ప్రత్యేక పాఠశాలలు, ప్రతి గ్రామంలో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, ప్రతి గ్రామంలో శిక్షణ పొందిన ప్రసూతి కార్యకర్తల నియామకం, వ్యవసాయ పనులలో పాల్గొనే మహిళలకు పురుషులతో సమానంగా వేతనం మద్య నిషేధం వంటి సమస్యలపై నవుడూరు మహాసభ తీర్మానాలు చేసింది. క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టు చేసిన నేతలను విడుదల చెయ్యాలని, బెంగాల్ కరువు బాధితుల సహాయ కార్యక్రమాల కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసి ఐక్యంగా కృషి చేయాలని, ఫాసిస్టు శక్తుల ప్రమాదానికి వ్యతి రేకంగా పోరాడాలని మహిళా మహాసభ కోరింది. గ్రామాలలో బాల సంఘాలను ఏర్పాటు చెయ్యాలని, పిల్లలను దేశభక్తియుత పౌరులుగా తయారు చెయ్యాలని మహిళలకు మహాసభ పిలుపు ఇచ్చింది.

నవుడూరు మహాసభ ఉత్సాహంతో జిల్లాలో మహిళా ఉద్యమం బాగా విస్తరించింది. సుబ్బాయమ్మ 1944, 1945, 1946 సంవత్సరాలలో మందలపర్తి శేషమ్మ, యాళ్లబండి పుణ్యవతి, సంకు లక్ష్మికాంతమ్మ వంటి వారితో కలసి తాలూకాలోని పలు గ్రామాలలో మహిళా సంఘాల ఏర్పాటులో కృషి చేసారు. 1947 ఫిబ్రవరి 15,16 తేదీలలో తెనాలి తాలూకా చిలువూరులో జరిగిన ఆంధ్ర రాష్ట్ర మహిళా సంఘం ప్రథమ మహాసభకు సుబ్బాయమ్మ తన తల్లి, అక్కలతో కలిసి హాజరయ్యారు. చిలువూరు మహాసభ సుబ్బాయమ్మ ఆలోచనలకు పదునుపెట్టింది. మహిళా ఉద్యమంలో కమ్యూనిస్టు పట్టుదల కలిగిన ఒక కార్యకర్తగా సుబ్బాయమ్మ రూపొందడంలో నవుడూరు, చిలువూరు మహిళా మహాసభలు కీలక ప్రభావాన్ని వేసాయి.

1947 డిసెంబరు 26న సుబ్బాయమ్మ వివాహం అప్పటికే స్వాతంత్ర్యోద్యమంలో రెండుసార్లు జైలుకు వెళ్లివచ్చిన కమ్యూనిస్టు నాయకుడు దూసనపూడి విరాటరాజుతో జరిగింది. ఈ వివాహం జరిపించడానికి సంకు అప్పారావు, ఎంవిఎస్ కపర్దీ, స్వాతంత్ర్య సమరయోధులు పసలకృష్ణమూర్తి పూనుకున్నారు. డిసెంబరు 26 పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వివాహం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టునేత ఉద్దరాజురామం అధ్యక్షతన, సంకు అప్పారావు ఆచార్యత్వంలో దండల మార్పిడి ద్వారా సంస్కరణ వివాహం జరిగింది. అదే సందర్భంగా పార్టీ జిల్లా సర్వసభ్య సమావేశం కూడా అదే ప్రాంగణంలో జరిగింది. ఆ తర్వాత పార్టీ నేతలంతా అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. విరాటరాజు కూడా అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు.

1948-52 మధ్య కమ్యూనిస్టు పార్టీపై నిషేధం అమలులో వుండటంతో విరాటరాజు కుటుంబం తీవ్ర నిర్బంధాలను ఎదుర్కో వలసి వచ్చింది. విరాటరాజు తండ్రి నరసయ్యను పోలీసులు చితకబాదడంతో ఆయన కాళ్లు విరిగాయి. విరాటరాజు సోదరులు కొండయ్య, గెరాటరాజు, కృష్ణమూర్తిలను పోలీసులు అరెస్టుచేసి జైలుకు పంపారు. పలుసార్లు ఇంటిపై దాడులు జరిగాయి. భయోత్పాతం సృష్టించడానికి ఇంట్లో సామాగ్రిని, ఆహారపదార్థాలను, తలుపులను, ద్వారబంధాలను పగులగొట్టేవారు. పార్టీ నాయకుల ఆచూకీ చెప్పాలని కుటుంబ సభ్యులను హింసించేవారు. ఇంతటి



తీవ్ర నిర్బంధకాండను సబ్బాయమ్మ ఎంతో నిబ్బరంగా ఎదుర్కొ న్నారు. వివాహమైన రెండు నెలలకే సుబ్బాయమ్మసైతం జైలుకు వెళ్లాల్సి వచ్చింది. 1948 ఫిబ్రవరిలో మహిళా సంఘం కార్యకర్తల రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు విజయవాడలో జరిగాయి. దానికి సుబ్బాయమ్మ హాజరయ్యారు. కమ్యూనిస్టు మహిళలకు బాంబుల తయారీలో శిక్షణ ఇస్తున్నారన్న అభియోగంతో నాటి సబ్‌కలెక్టరు శిక్షణా తరగతులను నిషేధించారు. తమది మహిళా సంఘమనీ, మహిళా సమస్యలపై శిక్షణ ఇస్తున్నారనీ, తమపై నిషేధం విధిం చడం సమంజసం కాదని తరగతులకు హాజరైన మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ ప్రదర్శనను సైతం నిషేధించడంతో పోలీసులు లాఠీఛార్జీ చేసి మహిళలను అరెస్టు చేసారు. ఆనాటి ప్రదర్శనలో పాల్గొన్న సుబ్బాయమ్మ అరెస్టయ్యారు. శ్రీమతి వంక నాగమణితో కలిసి నందిగామ జైలులో శిక్ష అనుభవించారు.జైలు నుండి విడుదల అయిన ప్పటికీ పోలీసులు ఆమెను వేధిస్తూనే వచ్చారు. విరాటరాజు ఆచూకీ గురించి పార్టీ నేతల రాకపోకల గురించి అధికారులు సుబ్బాయమ్మను పలుసార్లు వేధించారు. నాటి డీఎస్పీ ఒకరు రివాల్వరు చూపించి నీ భర్తను కాల్చి చంపుతామని సుబ్బాయమ్మను బెదిరిం చారు. అయినప్పటికీ ఆమె జంకలేదు. పార్టీ కార్యకర్తలకు, నాయ కులకు ఆశ్రయం కల్పిస్తూనే వచ్చారు. సుబ్బా యమ్మ అన్నగారుపై బోయి న సోమ య్య నాటి గెరిల్లా దళ సభ్యుని పలు దళ చర్యలలో పాలుపంచుకున్నారు.

1952 తర్వాత దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సుబ్బాయమ్మ మహిళా సంఘం, కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొ న్నారు. 1953లో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలు తణుకులో జరిగిన సందర్భంలో మహిళలను సమీకరించడంలో కృషి చేశారు. 1966లో రైతు సంఘం రాష్ట్ర మహాసభలు తాడేపల్లి గూడెంలో జరిగిన సందర్భంలో మహిళా వాలంటీర్ల బృందంలో పనిచేసారు. 1981లో మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు తాడేపల్లిగూడెంలో జరిగినప్పుడు మహాసభలను విజయవంతం చేయడంలో ముఖ్యపాత్ర పోషించారు.

1952 నుండి 1994 వరకూ జరిగిన అన్ని ఎన్నికలలో పార్టీ అభ్యర్థులు బలపరిచిన అభ్యర్థుల విజయానికి మహిళా ప్రచార దళాలను ఏర్పరచి సారధ్యం వహించారు. పార్టీ ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారు. పలు ఉద్యమాల సందర్భంగా అరెస్టయ్యారు. మహిళా సంఘం పిలుపు మేరకు రాత్రి పాఠశాలలు ఏర్పాటు చేసారు. కుట్టు శిక్షణా కేంద్రాల ద్వారా స్వయం ఉపాధి శిక్షణ ఇప్పించారు. తొలి నుండి కులాంతర, మతాంతర, సంస్కరణ వివాహాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అటువంటి వివాహాల సందర్భంగా కుటుంబాల నుండి ప్రతిఘటన ఎదుర్కొన్న జంటలకు ఇంటిలో ఆశ్రయం కల్పించారు. తన కుటుంబంలో కూడా కులాంతర, సాంఘిక వివాహాలు జరిపించి ఆదర్శంగా నిలిచారు.భర్తల, అత్తమామల నిరాదరణకు, అకృత్యాలకు ఇబ్బందులు పడిన పలువురు మహిళ లకు ఆశ్రయం కల్పించారు. విద్యార్థి యువజనోద్యమాలలో తిరుగుతున్నందుకు కుటుంబాల ఆగ్రహానికి గురయిన పలువురు కార్యకర్తలకు నెలల తరబడి తన ఇంటిలో ఆశ్రయం కల్పించి అమ్మలా ఆదరించారు. పార్టీ కుటుంబాలలోని పిల్లల చదువులకు తోడ్పాటు అందించారు. మద్య వ్యతిరేక పోరాటాలలో, వరకట్న నిషేధం, వరకట్న వేధింపులు, అత్యాచార బాధితులు వంటి సమస్య లపై మహిళా సంఘం ఇచ్చిన కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుజ్జుల సరళాదేవి, సంకు లక్ష్మీకాంతమ్మ, వల్లూరి హైమావతి తదితరులతో కలిసి సుబ్బాయమ్మ పనిచేసారు. తన తర్వాతతరం మహిళా కార్యకర్తలు కాళ్ళ ధనలక్ష్మి, బోణం ధనలక్ష్మి, జాస్తి నిర్మల, మందలపర్తి సంధ్యారాణి, ఇందుకూరి సీతమ్మ, పెన్మత్స సీతమ్మ, ఉద్దరాజు బంగారమ్మ, రెడ్డి కల్పనాదత్, పూడియాద్రావమ్మ, మద్ది సీతమ్మ, మనోరమ వంటి వారితో కలిసి ఆమె మహిళా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారు.

వయసు పైబడిన తర్వాత ఆమె తన ఇంటికే పరిమితమయ్యారు. ఆమె భర్త విరాటరాజు 2008లో కన్నుమూసారు. ఐదు దశాబ్దాలకు పైబడి మహిళా ఉద్యమాలలో పాల్గొన్న సుబ్బాయమ్మ డిసెంబరు 22 రాత్రి 11 గంటలకు స్వగృహంలోనే కన్నుమూసారు. ఆమె భౌతిక కాయాన్ని ఏలూరు ఆశ్రమ మెడికల్ కళాశాలకు అప్పగించారు. తొలుత నేత్రదానం చేశారు.దృఢ సంకల్పానికి, నిర్భీతికి, నిరాడంబ రత్వానికి, ప్రతీకగా నిలిచిన దూసనపూడి సుబ్బాయమ్మ నేటితరం మహిళా ఉద్యమ కార్యకర్తలకు ఆదర్శం. నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి చూపిన కార్యశీలి ఆమె. నాటితరం మహిళా ఉద్యమకార్యకర్తలు చేసిన పోరాటాలు, త్యాగాలతోనే మహిళలు ఈ మేరకైనా ముందంజ వేయగలుగుతున్నారు. దూసనపూడి సుబ్బాయమ్మ వంటివారు వేసిన పునాదులపైనే మహిళా ఉద్యమం పలు విజయవాలు సాధించగలిగిందని చెప్పవచ్చు. సుబ్బాయమ్మ వంటి వారి కృషి భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. నేడు మహిళలకు ఇంటా బయటా రక్షణ కరువైంది. అన్ని రంగాల్లో లింగ వివక్ష కొనసాగుతోంది. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల మహిళల పరిస్థితి దుర్భరంగా మారుతుంది. ఆరోగ్య, ఆహార, ఉద్యోగ భద్రతలు కరువయ్యాయి. నిర్ణయాధికారాల్లో మహిళల భాగస్వామ్యం నేటికీ అందని ద్రాక్షగానే మిగిలింది. సామాజిక, సాంఘిక, ఆర్థిక రంగాల్లో మహిళలకు సమప్రాతినిధ్యం కోసం సుబ్బాయమ్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పోరాడాల్సిన బాధ్యత మనపై వుంది. అదే ఆమెకు మనం సమర్పించే ఘనమైన నివాళి.

(నేడు తాడేపల్లిగూడెంలో సంతాపసభ సందర్భంగా)

వ్యాస రచయిత : ఏ.పి. మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర

బతుకు
The Life

గురువారం
03 జనవరి 2019



సైకతం..!
కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ...అలహాబాద్‌లోని సంగం వద్ద కాలేజ్ విద్యార్థిని రూపొందించిన సైకత శిల్పం

బెటర్‌హాఫ్‌తో.... బెస్ట్ లైఫ్!



పెళ్ళి...పిల్లలు...జీవితం....ఇవి కూడా ఒక ఉద్యోగంగా భావించే రోజులు వచ్చాయి. ఇందుకు కారణాలు అనేకం. అమ్మాయిలైనా...అబ్బాయిలైనా బెటర్ హాఫ్‌తో జీవితం గురించి ఎన్నెన్నో కలలు కంటారు. వాస్తవానికి వచ్చేసరికి అన్నీ తలకిందులు అవుతాయి. కారణం...ఎక్కడో పుట్టి...ఎక్కడో పెరిగి...ఒక గూటికి చేరతారు భార్యాభర్తలు. వాళ్ళ ఆలోచనలు వేరు, అభిప్రాయాలు వేరు. అన్నింటిలోనూ పూర్తి భిన్నంగా ఉంటారు. ఇద్దరు అపరిచిత వ్యక్తులను పరస్పర నమ్మకంతో ఒక్కటి చేసేదే పెళ్ళి. మరి ఈ నమ్మకం జీవితకాలం కొనసాగితేనే బెటర్ హాఫ్‌తో బెస్ట్ లైఫ్ సాధ్యమవుతుంది. జీవిత భాగస్వామితో కలలు కన్న అందమైన జీవితాన్ని అందుకోవాలంటే... అన్నింటికంటే ప్రధానం అర్థం చేసుకోవడం. ఒకరి మనసును ఒకరు అర్థం చేసుకుంటే ప్రతి రోజూ పెళ్ళి రోజే అవుతుందనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. ఇందుకు ఎంతో సహనం, ఓర్పు కావాలి. కాలానుగుణంగా ఆలోచనల్లో మార్పు రావాలి. ఇంటి వాతావరణం నుంచి బయట ప్రపంచం వరకూ అన్నింటా మనదనే ఒక ముద్ర ఉండాలి. అప్పుడే పట్టపగలే పండు వెన్నెల కురుస్తుంది... ఊహా ప్రపంచం వాస్తవమవుతుంది..ఇల్లే స్వర్గమవుతుంది!

సహజంగా అబ్బాయిలు పొద్దస్తమాను కష్టపడి ఇంటికొచ్చిన తనకు భార్య కాఫీ కప్పుతో ఎదురురావాలని కోరుకుంటారు. సాధారణంగా సినిమాల్లో కనిపించే ఈ సీన్ ఒకప్పుడైతే సాధ్యమయ్యేదేమో...ఇప్పుడు సాధారణంగా ప్రతి ఇంట్లో అమ్మాయిలూ అదేనండీ భార్యలూ ఉద్యోగాలు చేస్తున్నారు. మరి ఇప్పుడు ఇదెలా సాధ్యం. ఈ విషయంలో మార్పు రావాల్సిందే. భార్య నుంచి కాఫీ కప్పు అందుకోవడమే కాదు...అవసరమైతే వారికి కాఫీ కలిపి ఇచ్చేందుకూ సిద్ధం కావాల్సిందే. పెళ్ళి అంటే ఒకరినొకరు భరించడం అనే అభిప్రాయంతో ఉన్నవాళ్ళూ ఉన్నారు. భార్యని షాపింగ్‌కి తీసుకెళ్ళాలి. అక్కడ గంటలు, గంటలు వారికోసం వేచిచూడాలి. ఇదంతా బోర్. అనుకునే మగమహారాజులూ ఉన్నారు. ఇందులో ఒకింత వాస్తవం ఉన్నా...ఆ పని కొంచెం ఇష్టంగా చేసి చూడండి...లేదా అది మీకు ఇష్టం లేని పని అని ఆమెకు సర్ది చెప్పి చూడండి. సమస్య ఎంత సులభంగా పరిష్కారమవుతుందో అర్థమవుతుంది. వాస్తవానికి ఇవన్నీ చిన్నచిన్న సమస్యలు. అలాగని కొట్టిపారేసేంత చిన్న సమస్యలు కాదు. ఇది ఎలాంటి సమస్య అనేది భార్యాభర్తల మధ్యన ఉండే అవగాహన, అర్థం చేసుకునే తీరును బట్టి ఉంటుంది. సరైన అవగాహన లేకపోతే, ఒకరిపై ఒకరికి ఇష్టం, నమ్మకమనేది లేకపోతే టీ కప్పులో తుఫానులా ఈ సమస్యలే ఇంటిని నరకం చేసేస్తాయి... భార్యాభర్తలను వేరు చేసేస్తాయి. అందుకు భార్యాభర్తల మధ్య అర్థం చేసుకోవడం అనే మాటకు అత్యధిక ప్రాధాన్యత ఉంది. ఈ పదం చాలా విస్తృతమైంది, విశాలమైంది. ఇలాంటి చిన్న సమస్యల పరిష్కారానికి, బెటర్ హాఫ్‌తో బెస్ట్ లైఫ్‌ని అందుకోవడానికి, ఇంటిని స్వర్గంగా మార్చుకోవడానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. ఇవన్నీ పాతవే అయినా...చెప్పుకోవలసినవి, అవసరమైనవి, ఎన్ని తరాలు మారినా...తెలుసుకోవలసినవీ, ఆచరించదగినవీ కాబట్టి....ఒక్కసారి గుర్తుచేసుకుందాం... వాటిపై ఓ లుక్కేద్దాం.

పనులు పంచుకోవడం

ఇది అబ్బాయిలు చేసేది, అది అమ్మాయిలు చేసే పని అంటూ ఏమీ లేదు. ఇంట్లో ఉన్నప్పుడు ఇద్దరూ ఉద్యోగాలకు బయటకెళ్లాలన్నప్పుడు ఇద్దరూ త్వరగా లేచి పనులు చేసుకోగలిగితే సమయం ఆదా అవుతుంది. ఇద్దరి మధ్య తెలీకుండానే మంచి సఖ్యత ఏర్పడుతుంది. పని చేసుకుంటూనే మంచి నిర్ణయాలు తీసుకునేందుకు, మనసు విప్పి మాట్లాడుకునేందుకూ మంచి సమయం చిక్కుతుంది. పైగా పని మనుషుల్ని పెట్టుకోవాల్సిన అవసరమూ ఉండదు. ఇలానూ డబ్బులు ఆదా చేసుకోవచ్చు. అన్నింటికంటే ముఖ్యవిషయం అన్ని పనులు భర్త కూడా నేర్చుకున్నట్టు ఉంటుంది. భార్య లేని సమయంలో బెంబేలెత్తిపోకుండా పనులు చేసుకోవడానికి వీలు అవుతుంది. ఇంటి పనుల్లో సాయం చేసే భర్త మీద భార్య ప్రేమ రెట్టింపు అవుతుంది. ఇంటి పనులు పంచుకోవడం వల్ల ఎన్ని లాభాలో కదా! సో...నేటితరం అబ్బాయిలూ....ఇంటి పనులు మగవాళ్ళు చేయకూడదని బీష్మించుకుని కూర్చోకండి !!




మనసులు కలిపే మాటలు

ఎక్కువ శాతం మగవారు ఉద్యోగం చేసి వచ్చి సాయంత్రం పూట టీ.వి ముందు అతుక్కుపోతారు. ఉద్యోగం చేసి వచ్చిన భార్యలు మాత్రం ఇంటి చాకిరీలో మునిగిపోతారు. పని మొదలుపెట్టడానికి ముందో లేదా పనంతా అయిపోయాకో పక్కన వచ్చి కూర్చున్న భార్యలను ఏమాత్రం పట్టించుకోరు. మీరూ ఇలాగే ఉన్నారా? అయితే మీ బంధం బలహీన మవడం ఖాయం. ఆఫీసులో జరిగిన విషయాల గురించి అడగాలని, తమతో కొంచెం ప్రేమగా మాట్లాడాలని కోరుకుంటారు ఇల్లాళ్ళు. అలా ఉండని భర్త మీద అయిష్టమూ వారికి తెలీకుండానే పెరిగిపోతుంది. ఈ విషయంలో ఇద్దరి మధ్య సరైన అవగాహన లేక బయటకు చెప్పుకోలేక అవస్థలు పడుతుంటారు. ఇలా కాకుండా ఉండాలంటే మాటలు ఉండాల్సిందే. మాటలు ఉంటేనే మనసులు కలుస్తాయి. సమస్యలు, అభిప్రాయభేదాలూ దూదిపింజల్లా ఎగిరిపోతాయి.

చెప్పాలనుకున్నది...

ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి భార్య ఎదురు రావాలని పూర్వపు రోజుల్లో పురుషులు ఎలా కోరుకున్నారో...ఇప్పుడు మహిళలూ అలాగే అనుకుంటున్నారు. మారిన కాలమాన పరిస్థితులే ఇందుకు కారణం. వాటి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు కానీ భార్య మనసు దోచుకోవాలనుకుంటే...."ండు రోజులకొకసారైనా ఆఫీసు నుండి భార్య కంటే ముందు వచ్చి ఇంట్లో ఉన్న చిన్న చిన్న పనులు చేయండి. ఉదయం ఆఫీసుకెళ్ళే హడావుడిలో చిందరవందరగా పడేసిన వస్తువులను తీసి ఎక్కడవక్కడ పెట్టడం, ఉతికిన దుస్తులన్నీ ఒకచోట వేయడం, కూరగాయలు కోసి ఉంచడం చేయండి. ఇలాంటి చిన్న చిన్న పనులు మీ మధ్య బంధాన్ని మరింత దృఢం చేస్తాయి. మీరు పని చేయడం ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రేమతో ఇకముందు మీచేత ఏ పనీ చెయ్యద్దు అనే చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అదీ మగువల సున్నిత మనస్తత్వం. అలాగే భార్య కూడా రెండు రోజులకొక సారి భర్త రాకముందే ఇంటికి వచ్చి కావల్సినవి తయారు చేసి వుంచితే ఇద్దరికీ సంతోషంగా వుంటుంది. నువ్వెందుకు చెయ్యవు అంటే నువ్వెందుకు చెయ్యవు అనుకుంటూ కూర్చుంటే గొడవలు తప్పవు. మనం ఎదుటి వారికి ఏం చెప్పాలనుకుంటున్నామో ఆ పనిని ముందుగా మనమే చేసి చూపిస్తే ఎదుటివారు దాన్ని తప్పకుండా ఆచరిస్తారు, ఇష్టంగా ఆ పని చేస్తారు...అన్నింటా మీ వెనకే నడుస్తారు.



ఎవరిది పై చేయి

కాలమెంత మారినా...ఆధునికత ఎంతగా చోటుచేసుకున్నా....ఇంట్లో పెత్తనం మాత్రం పురుషుడిదే..ఇందులో ఎలాంటి సందేహం లేదు...ఇందుకు నేటి రోజుల్లోనూ ఒకటో, అరో ఇళ్ళు మాత్రమే మినహాయింపు. ఈ పరిస్థితులు మారాలి. ఈ భావజాలం మారాలి. భార్యాభర్తల్లో ఎవరిది పై చేయి అంటే ఎవరిదీ కాదు....కాకూడదు...నేటి రోజుల్లో ఇద్దరూ చదువుకుంటున్నారు....ఉద్యోగాలు చేసుకుంటు న్నారు. ఎవరి వ్యక్తిత్వం... స్వతంత్రత... వారికుంటుంది.... ఉండాలి. అలాంటప్పుడు ఒకరిమీద ఒకరు అధికారం చూపించుకోవాల్సిన అవసరం ఏముంది. ఆమెకు సంతోషం కలిగించేదేదో చేయనివ్వండి. చిన్నప్పటి నుండి పెరిగిన వాతావరణం అలవాటైన పద్ధతుల్ని పెళ్లి చేసుకున్నాక మారిపోవాలి అని శాసించటం ఎంతవరకూ న్యాయం. భార్య కూడా మిమ్మల్ని ఇలా ఉండాలి, అలా ఉండాలి అని ఊహించుకునే ఉంటుంది కదా. దానికి తగ్గట్టుగా మీరూ మారాలని శాసిస్తే మీరు మారగలరా. మనం మారలేనప్పుడు ఎదుటివారు మారిపోవాలనుకోవడం ఎంత వరకూ సమంజసం. ఆమె ఇష్టాలు మీవిగా మీ ఇష్టాలు ఆమెవిగా భావించాలి.

అలాంటి వాతావరణాన్ని ఇంట్లో సృష్టించుకోవాలి. ఆమెకు పార్టీలు, డిన్నర్‌లు ఇష్టమైతే మీరూ ఆమెతో ఫాలో అవ్వండి లేదా తనని జాగ్రత్తగా వెళ్ళమని చెప్పండి. అలాగే మీ ఫ్రెండ్స్ వచ్చినప్పుడు తను వాళ్ళతో కలిసిపోయేలాచూడండి. ఒకరికొకరు సహాయం చేసుకుంటేనే ఏ పనైనా అవుతుందని గుర్తుపెట్టుకోండి. ఒకరినొకరు గౌరవించుకుం టేనే, ఒకరి ఇష్టాలను మరొకరు పంచుకుంటేనే...అన్నీ ఇచ్చిపుచ్చుకుంటేనే జీవితం అనేది సరైన దారిలో పడుతుంది. పాతరోజుల్లో ఆడవాళ్ళు అంతగా చదువుకునేవారు కాదు కాబట్టి అణిచి ఉంచాలను కునేవారు... తాము చెప్పినట్టుగా వినాలనుకునే వారు. కానీ ఇప్పుడు అందరూ చదువుకున్నవారే, ఉద్యోగాలు చేస్తున్న వారే. ఆలోచనా విధానంలో మార్పు వస్తుంది కదా! సరైన ఆలోచన సరైన దారిని వేస్తుంది. ఇంకెందుకు ఆలస్యం మీ భార్యలకు ఏది ఇష్టమో అదే చేయండి. మీ భర్తలకు ఏది ఇష్టమో అది మీరు వినండి. అప్పుడే గృహమే కదా స్వర్గసీమ అని పాటలు పాడుకున్నంత కమ్మగా జీవితాన్ని గడిపేయవచ్చు.

మునగ గింజలతో....నీరు శుభ్రం!



మునగకాయ రుచి ముందు అన్నీ దిగదుడుపే అంటే అతిశయోక్తికాదు. మునగ ఉష్ణదేశాల్లో మాత్రమే సుపరిచితమైన చెట్టు. ముఖ్యంగా మన దేశం మునగకాయలు రుచిలోనే కాక మంచి పోషక విలువలు కూడా కలిగి ఉన్నాయి. పదకొండు మునగ జాతులలో రెండింటికి ఆర్థికంగా కూడా మంచి డిమాండ్ ఉంది. అందులో ఒకటి మనదేశం మునగ, రెండవది ఆఫ్రికా మునగ.

ఆఫ్రికా మునగచెట్లు 6 నుంచి 12 మీటర్ల ఎత్తు ఎదుగుతాయి. చాలా ఎత్తుగల కాడ వ్యాసం 60 సెం.మీ. ఉంటుంది. వార్షిక వర్షపాతం 500–1400 మి.మీ. ఉన్న ప్రదేశాల్లో కూడా పెరుగుతుంది. ఆఫ్రికా మునగ ముఖ్యమైన ఉపయోగం, నీటిని శుభ్రపరిచే శక్తి కలిగి యుండటం. చర్యాశీలక పదార్థాలు విత్తనాల్లోని బీజదళాల్లో ఉంటాయి. మనదేశం మునగ విత్తనాల్లో ఉన్నట్లుగానే ఆఫ్రికా విత్తనాల్లో కూడా మూడు చర్యాశీలక పదార్థాలు ఉన్నాయి. ఇతర జాతులకన్నా ఆఫ్రికా మునగ విత్తనాలు నీటిని శుభ్రపరచడానికి ఎంతో అనువైనవి. దీని విత్తనాలు పెద్దవి 100– 150 మి.గ్రా. విత్తనాల పొడి బాగా కలుషితమైన ఒక లీటరు నీటిని చక్కగ శుభ్రపరుస్తుంది.

ఆఫ్రికా మునగ ఎంతో ఔషధ గుణం కలిగి ఉంది. వీటి వేర్లు, ఆకులను వైద్యానికి ఉపయోగిస్తున్నారు. వేర్లు జ్వరాన్ని తగ్గిస్తాయి. బి.పి., డయేరియా, డయాబెటిస్, గుండె సంబంధ వ్యాధుల చికిత్సకు వాడతారు. విత్తనాల్లో గల సూక్ష్మజీవనాశిక పదార్థం ప్రొటోజోవా, చేపలు ఇతర తక్కువస్థాయి జంతువులకు విషం లాగా పనిచేస్తుంది. అయితే మానవ వినియోగానికి అవసరమైన నీటిని శుభ్రపరచడానికి ఉపయోగించడం వల్ల ప్రమాదం ఏమీలేదని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మునగ ఆకులను గాయాల చికిత్సకు వాడతారు. వీటి పుష్పాలు ఆకలి పెంచడానికి, జీర్ణక్రియలోను సహకరిస్తాయి. దీని నూనె ర్యూమాటిజం నొప్పులను తగ్గించడానికి, పరిమళ ద్రవ్యంగా, గాయిటల్ వ్యాధి నివారణలోను తోడ్పడతాయి. వేర్లు మలబద్ధకాన్ని నివారిస్తాయి. బ్రోంకైటిస్, దగ్గు నివారణలో ఉపయోగిస్తారు. రక్తాన్ని శుద్ధిపరిచి, ఆకలిని పెంచుతాయి. బెరడు డిసెంటరీ తగ్గించడానికి, అంతర్గత పరాన్నజీవులను తొలగించడానికి పనిచేస్తుంది. కలపను దుస్తులు, అద్దకపు రంగుల తయారీలో వాడతారు. ఇవన్నీ సంప్రదాయంగా వస్తున్న ఉపయోగాలు.

తులసి టూత్ పౌడర్

మనిషికి నవ్వు అందం. ఆ నవ్వుకి నిండుదనాన్ని తెచ్చేది చక్కని పలువరస. పళ్ళను దానిమ్మ గింజలతో పోల్చడం మనందరికీ తెలిసందే. మంచి పలువరస ఉన్నవారిని ఇలా పోలుస్తారు. ఎంత అందమైన పలువరస ఉన్నా పళ్ళు పసుపు పచ్చని రంగులో ఉంటే నలుగురిలో నవ్వుకోవడం కాదు నిలబడడానికే ఇబ్బందిగా ఉటుంది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పళ్ళు పసుపురంగులోనే ఉంటు ఈసారి తులసి టూత్ పౌడర్‌ని వాడండి. ఇదేదో కొత్త బ్రాండ్ అనుకునేరు. ఇది మార్కెట్‌లో దొరికేది కాదు. మీకు మీరు ఇంట్లోనే తయారు చేసుకోవాలి. ఈ తులసి టూత్ పౌడర్‌ని వాడితే మీ దంతాలు పసుపు రంగు పోయి తెల్లగా మెరిసిపోతాయి. చక్కని ఆరోగ్యాన్ని సంతరించుకుంటాయి. మరి తయారుచెయ్యడమెలాగో చూద్దామా.

తాజాగా ఉండే తులసి ఆకులను తీసుకుని నీడలో ఎండబెట్టడండి. వీటిని అస్సలు ఎండలో పెట్టకూడదు. ఇవి పూర్తిగా ఎండిన తర్వాత ఆకును మెత్తగా నూరి పొడి చేసుకోవాలి. అంతే ఇంకేం చేయనక్కర్లేదు. ఇదే తులసి టూత్ పౌడర్. ఈ పొడిని ఉపయోగించి బ్రష్ చేయండి. మీ దంతాలపై పేరుకున్న పసుపు రంగును వదిలించేసుకోండి. ఈ పౌడర్‌తో బాగా రుద్దడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. నేరుగా కాకపోయినా మీరు వాడే టూత్‌పేస్ట్‌కి ఈ తులసి పౌడర్‌ని జత చేసి అయినా బ్రష్ చేసుకోవచ్చు. దీనివల్ల మీ పళ్ళు మెరిసిపోవడమే కాదు ఇతర దంత సమస్యలూ పోతాయి.



ఫ్యాన్సీ ఫుట్‌వేర్

పాదరక్షల్లోనూ ఫ్యాన్సీనే రాజ్యమేలుతోంది. అందుకు నిదర్శనమే ఈ ఫుట్‌వేర్. వస్త్రాల మాదిరిగా తళుకుబెళుకులు, మిలమిల మెరుపులతో కన్నుచెదిరే ఆకర్షణీయమైన ఈ ఫ్యాన్సీ ఫుట్‌వేరే నేటి ట్రెండ్. ఏ పాదానికైనా అమరిపోయే డిజైన్లలో మార్కెట్‌ల్లోకి వస్తున్నాయి ఈ ఫ్యాన్సీ ఫుట్‌వేర్. ధర కొంచెం ఎక్కువేకానీ అందుకు తగ్గ రిచ్‌లుక్‌తో మగువల మనసు దోచేస్తున్నాయి.







నేను - సుడిగుండం

(నవల) 4

పి.చంద్రశేఖర్ ఆజాద్
సెల్: 92465 73575

నిన్నటి సంచిక తరువాయి

అమ్మతో నేను తిరుమల వెళ్లి మొక్కు తీర్చుకుంటాను అన్నప్పుడు ఆశ్చర్యంగా చూసింది.

"మావయ్య ఆసుపత్రిలో వున్నప్పుడు భయం వేసింది. ఎందుకో దేవుడ్ని ' మొక్కాలనిపించింది. నీకు చెప్పాలనుకున్నాను. కానీ...."

"మావయ్య మీద నీకీ ప్రేమ ఎప్పుడూ వుంటుందా నాన్నా" అంది నా కళ్లల్లోకి చూస్తూ.

"అలా అన్నావేంటమ్మా?"

"నువ్వు పెద్దయ్యాక బాధ్యత లేకుండా వుంటావని నేను అనుకోను. అయినా మనుషులు ఎప్పుడూ ఒకే రకంగా వుండరు. చిన్నప్పుడు నన్ను మా అన్నయ్యలు బాగానే చూసుకున్నారు. పెళ్లిళ్లు జరిగాక మారిపోయారు. వారసత్వంగా కొన్ని లక్షణాలు వస్తాయంటారు. మేనమామల పోలికలు, గుణాలు అంటారు. అవి నీకు" అంటుండగా తల దించుకున్నాను.

అమ్మ నన్ను ఎప్పుడన్నా కసురుకుందేమోగాని నన్ను కొట్టలేదు. ఇప్పుడు మాత్రం పెద్ద కర్ర తీసుకుని కొట్టినట్లుగా బాధ పడ్డాను.

జలజలమంటూ కన్నీళ్లు నా బుగ్గల మీద కారటం అమ్మ చూసింది.

"నువ్వు మీ మావయ్యల్లా చేస్తావని నేను అనటం లేదు నాన్నా.... నిన్ను బాధ పెట్టాలని కూడా కాదు. ముందు జాగ్రత్తగా నేను చెబుతున్నా. క ృతజ్ఞతకి మించింది లేదు. నరసయ్య మావయ్యకి మనల్ని ఇక్కడికి తీసుకు రావలసిన అవసరం లేదు. ఎప్పుడన్నా చుట్టపు చూపుగా వచ్చినా రాకపోయినా అడిగేవారు వుండరు. ఎవరేమనుకున్నా లెక్క చేయని రోజులు. ఇవన్నీ మనం మరిచిపోకూడదు"

కళ్లు తుడుచుకున్నాను..

"ఎవరు ఎంత ప్రేమగా వున్నా ఎప్పుడో ఒకసారి చిన్న మాటతో పంతాలూ, పట్టింపులు వస్తాయి. దాంతో కొన్ని సంవత్సరాల బంధం తెగిపోతుంది. మాటకి అంత



శక్తి వుంటుంది. నీకు చెబుతున్నాను గానీ నేనూ ఆ తానులో ముక్కనే. అలా నేను ఎప్పుడన్నా ప్రవర్తిస్తే అమ్మని చూడకుండా నన్ను నువ్వు హెచ్చరించాలి. నిజమైన మనిషి అనిపించుకోవాలంటే ఎవరయినా ఎప్పుడూ ధర్మం, సత్యం పక్కన వుండాలి"

అంది.

అమ్మ నన్ను ప్రేమతో తడుముతున్నట్లుంది.

"నీ మాటలు ఎప్పుడూ గుర్తుంచుకుంటానమ్మా. మావయ్య నాకు గురువు. దారి చూపించే వాడు. ఆయన్ని నేను దూరం చేసుకుంటే అంతకుమించిన ద్రోహం వుండదు. నేను ద్రోహిని కావాలనుకోవటం లేదు" అన్నాను.

అప్పుడు తృప్తితో కూడిన కన్నీళ్లు అమ్మ చెంపల మీద జారుతున్నాయి.

****

తిరుమల కొండల మీద నా తల వెంట్రుకలు తీయిస్తున్నప్పుడు చిత్రమైన భావన కలిగింది.

నాది నొక్కుల జుట్టు. బాగా వొత్తుగా వుంటుంది. తల మీద నీళ్లు పోసుకుంటే లోపలకి వెళ్లకుండా అలా జారిపోతాయి. అలాంటి జుట్టు నా నుండి దూరం అయిపోతోంది. గుండులో నేనెలా వుంటానో! నాతోపాటు చదువుకుంటున్న వారు ఏమంటారో! ఇలాంటి ఆలోచనలు వచ్చాయి..

చూస్తుండగానే నా ముందు చిన్న చిన్న కుప్పలు. వాటిని చేతుల్లోకి తీసుకున్నాను నాకు తెలియ కుండానే. తర్వాత స్నానం చేస్తుంటే నీళ్లు జారిపోతున్నాయి. అద్దంలో చూసుకుంటే చిన్న చిన్న గాట్లు కనిపించాయి.

నేను బాలస్వామిలా వున్నాను. నుదుటి మీద విభూది బొట్టు, నామాలు పెట్టుకోలేదు. అదొక్కటే తక్కువ. తర్వాత కాలంలో స్వామికి తలనీలాలు ఇవ్వటం మీద, ఆ చర్య వెనక వున్న తత్వం గురించి కొంత తెలుసుకున్నాను.

ఓ మనిషిని అది ఆడవారయినా, మగ వారయినా అవమానించాలంటే తల గొరుగుతారు. కొంతమంది సగం మీసం, సగం తల వెంట్రుకలు తీసి సున్నం పూస్తారు. ఆడవారికి తల నీలాలంటే ప్రాణం. మగవారికి ఇవన్నీ వారి అహాన్ని సంతృప్తి పరుస్తాయి.

అందుకే వారు తప్పనిసరి పరిస్థితిలో భగవంతుడి కోసం ఆ త్యాగానికి సిద్ధపడతారు. అందులో వారి కోరికలు వుంటాయి. మిత్రులు నన్ను వింతగా చూసారు. ఓ మాస్టారు మాత్రం అడిగారు

"మీ ఇంట్లో ఎవరయినా పోయారా?"

నేను మాట్లాడలేదు.

"మొక్కా" అన్నారు.

తలూపాను.

"ఏమీ అనుకోకు. ముందే మొక్కా అని అడగాల్సింది" అన్నారాయన.

మావయ్య ఆరోగ్యంతో తిరుగుతున్నాడు. తొందర్లో ఆపరేషన్ చేయించుకోవాలనుకున్నాడు. ఊర్లో వారికి మావయ్య మళ్లీ తండ్రి కాబోతున్నాడని తెలిసినా నాతో ఏమీ మాట్లాడలేదు. నా గుండు గురించి మాత్రం రకరకాలుగా మాట్లాడుకున్నారు.

ఈసారి కూడా మావయ్యా వాళ్లకు అమ్మాయి పుట్టింది. దోసిళ్లలోకి తీసుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు. అది మళ్లీ అమ్మాయి పుట్టినందుకు కాదు.

"ఇలాంటి బంగారు తల్లినా నేను వద్దనుకుంది. నన్ను క్షమించమ్మా" అనుకున్నాడు. కాస్త దూరం నుండి చూస్తున్న నాకు ఆ మాటలు వినిపించాయి.

అప్పటిదాకా మేం వెన్నెలనీ అత్యంత గారాబంగా చూసుకుంటున్నాం, అందులో కొంత భాగం చెల్లెలి మీదకు మరలటంతో వెన్నెలలో మార్పు వచ్చింది.

"బావా నాకు చెల్లి ఇష్టం లేదు" అంది.

ఇలాంటివి సహజం అని నాకు తెలియదు

ఈ వారసత్వం ఎవరిది?!

ముందు ముందు అక్కా - చెల్లెలి మధ్య పెద్ద యుద్ధం జరుగుతుందా? సినిమాల్లో ఇలాంటివే చూపిస్తుంటారు. రెండో అమ్మాయికి 'అర్చన' అని పేరు పెట్టాడు మావయ్య.

మా అమ్మకి అర్చన అంటే ఇష్టం. వెన్నెలంటే ఇష్టం లేదని కాదు. అర్చన చిన్నది కావటంతో తన పనులన్నీ అమ్మ చూసుకునేది.

****

నేను టెన్త్ క్లాస్ పాసయ్యాను.

ఈలోగా పెద్ద పెద్ద సంఘటనలు, కుదుపులూ లేవు. ఇంట్లో ఖర్చులు పెరిగిపోయాయి. మావయ్య ఎప్పట్లానే సాయం చేస్తున్నాడు. మా ముగ్గురికీ ఒకేసారి బట్టలు తీసుకునేవాడు. అప్పుడప్పుడు బలవంతంగా నా జేబులో డబ్బులు పెట్టేవాడు. ఓసారి అమ్మ అడిగింది.

"నీకీ డబ్బులు ఎలా వచ్చాయి రామూ?"

మావయ్య ఇచ్చాడని చెప్పాను. మనకు సాయం చేస్తున్నది చాలక ఇదొకటా. మావయ్యకి ఇద్దరు ఆడపిల్లలున్నారు. తను ఇచ్చినా నువ్వు వద్దనాలి. అయినా మన అవసరాలకి డబ్బులు కావాలి. నీకు పుస్తకాలు, పెన్ను లాంటివి కావాలి. అంతకు మించి డబ్బులు అవసరమా అంది.

నేను మావయ్య ఇచ్చిన డబ్బులు ఖర్చు చేయటం లేదు. ఓ పక్కన వుంచుతున్నానని అమ్మకు చెప్పాను.

మన అవసరాలకు మించి వచ్చేది ఏదీ తృప్తిని ఇవ్వదు. అన్నీ మన శ్రమతో సాధించుకోవాలి అంది అమ్మ. అప్పుడప్పుడూ ఇలా మాట్లాడుతుంది. అది సూచనో, హెచ్చరికో, రెండూనో తేల్చుకోవాల్సి వుంటుంది.

నన్ను ఇంటర్ మీడియట్లో చేర్చాలి. మాకు పది కిలోమీటర్ల దూరంలో ఇంకో ఊరిలో జూనియర్ కాలేజ్ వుంది. త్వరలో గ్రాడ్యుయేషన్‌కి అనుమతులు వస్తాయంటున్నారు. చదువుకోవాలంటే ఆ ఊర్లో గది తీసుకోవాలి.

"బుల్లమ్మాయ్... అక్కడ రెండు గదుల ఇల్లు తీసుకుందాం. నువ్వు- అల్లుడు అక్కడ వుండండి. రెండు మూడు రోజులకోసారి నేను రావటమో- ఎవరితోనన్నా పాలు, పెరుగు, కూరగాయలు పంపించటమో చూస్తాను. రెండేళ్లు కళ్లు మూసుకుంటే నువ్వు మనూరు వచ్చేయవచ్చు" అన్నాడు.

"వాడికి ఏదన్నా ఉద్యోగం చూసి పెట్టు అన్నయ్యా" అంది

"ఇప్పుడే ఉద్యోగమా! నేను ఒప్పుకోను. పదో తరగతికి ఏ ఉద్యోగం ఇస్తారు?"

"లేదంటే ఏ దుకాణంలోనో చూడు" "నువ్విలా మాట్లాడొద్దు బుల్లమ్మాయి"

"ఆడపిల్లలు పెద్దవారవుతున్నారు. ముందు ముందు ఎన్నో ఖర్చులున్నాయి అన్నయ్యా"

"నాకు అన్నీ తెలుసమ్మా, అల్లుడికి మంచి భవిష్యత్తు వుంది. దాన్ని మనం మధ్యలో తుంచేయకూడదు"

అమ్మ ఆ ఊరి నుండి రావటానికి ఒప్పుకోలేదు.

మా ఊరి నుండి ఉదయం, సాయంకాలం మాత్రం బస్సులుంటాయి. మావయ్య నాకు సైకిల్ కొన్నాడు.

"నువ్వు సైకిల్ మీద కాలేజ్‌కి వెళ్లి రావాలి. ఎప్పుడయినా నీకు ఓపిక లేదనుకుంటే అక్కడ సైకిల్ పెట్టి బస్ కి రా. అలాగే రేపు నువ్వు ఏం కావాలను కుంటున్నావో ఇప్పుడు నిర్ణయించుకో. డబ్బుల గురించి, మీ అమ్మ గురించి ఆలోచించకు. గుమస్తా వుద్యోగాలకి పనికి వచ్చే చదువులు చదవొద్దు" అని గట్టిగా చెప్పాడు.

నేను సైన్స్ సబ్జెక్ట్ ని ఎన్నుకున్నాను.

నేను కాలేజ్ కి వెళ్లే రోజు అమ్మ చెప్పింది.

"నువ్విప్పుడు చిన్నపిల్లాడివి కాదు. అందులోనూ ఆడపిల్లలు, మగపిల్లలు కలిసి చదువుకుంటారంట. నీ దృష్టి చదువు మీద వుండాలి. ఆడపిల్లల మీద కాదు. మీ మావయ్య నీ మీద చాలా ఆశలు పెట్టుకున్నాడు" అంది. నేను తలూపాను.

ఈ రెండు సంవత్సరాల సైకిల్ ప్రయాణం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. మా ఊరిని దాటి బయటి ప్రపంచాన్ని చూసింది అప్పుడే. మావయ్య వద్దన్నా డబ్బులు ఇస్తుండేవాడు. మిత్రులతో పరిచయం అయ్యాక వారి రూమ్ లో ఒకటి రెండు రోజులుండే వాడిని.

(ఇంకా ఉంది)

క్రీడారంగంలోనూ ఉద్యోగాలు ఎన్నెన్నో..



ఐపీఎల్, హాకీ ఇండియా లీగ్, ప్రో-కబడ్డీ, ఇండియన్ సూపర్ లీగ్ (ఫుట్‌బాల్), ఇండియన్ బ్యాడ్మింటన్ లీగ్ వంటివాటిని ఇటీవలికాలంలో భారీఎత్తున, విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆటగాళ్లు, మైదానాలు, ప్రకటనకర్తలు, ప్రేక్షకులను సమన్వయం చేసుకుంటూ ఇంత పెద్దఎత్తున జరిగే ఈ కార్యక్రమాల నిర్వహణ ఎవరు చేస్తారు? ఎంతమంది ఉంటారు? వాళ్లకు ఈ నైపుణ్యాలు ఎలా వచ్చాయి... ఇదంతా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్. ఇవన్నీ ఆటలు చూపే కెరీర్ బాటలు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిల్లో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా భారత క్రీడారంగంలో వేగవంతమైన వృద్ధి కనిపిస్తోంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), ప్రో కబడ్డీ లీగ్ విజయవంతం కావడంతో రెజ్లింగ్, బ్యాడ్మింటన్‌లలో సైతం లీగ్‌లు మొదలయ్యాయి. భారత అథ్లెట్లు అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటడంతో దేశీయంగా మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో క్రీడల్లో సేవలు అందించే సంస్థలు విస్తరిస్తున్నాయి.

ఈ రంగాన్ని నిపుణులైన మేనేజర్ల కొరత వేధిస్తోంది. స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ డిగ్రీలు ఉన్నవారు ఇందులో రాణించడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. ఔత్సాహికులను స్పోర్ట్స్ బిజినెస్ వైపు అడుగులేయించడం, ప్రభుత్వ, పబ్లిక్ రంగాలు, అటానమస్ స్పోర్ట్స్ బాడీలకు మరింత వృత్తిపరమైన దృష్టి కల్పించి వారిని క్రీడల అభివృద్ధికి వినియోగించడం, పాతతరం క్రీడాకారులను తీసుకోవడం, బ్రాండ్ బిల్డింగ్‌లో క్రీడలు ఉపయోగించడంపై మార్కెటర్లకు అవగాహన కల్పించడం ఇవన్నీ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నేర్పిస్తారు. ఈఎస్‌పీఎన్, జీ, టెన్ స్పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యు స్పోర్ట్స్, ఎడ్యూ స్పోర్ట్స్, లిబరో స్పోర్ట్స్, ఐఎంజీ...తదితర సంస్థలు అవకాశాలు కల్పిస్తున్నాయి.

పలు హోదాలు

స్పోర్ట్స్ మేనేజర్లు : వీరు క్రీడాకారులకూ బయట ప్రపంచానికీ మధ్య సంధాన కర్తలుగా వ్యవహరిస్తారు. ఆటగాళ్ల లీగల్ కాంట్రాక్ట్, ఫైనాన్స్ వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. క్రీడాకారుడి స్థాయిని బట్టి వీరికి వేతనాలు లభిస్తాయి. అలాగే అనుభవానికీ ప్రాధాన్యం ఉంటుంది. రూ.పాతికవేలకు తగ్గకుండా లక్ష రూపాయల వరకు నెలవేతనం అందుకోవచ్చు. నేడు క్రీడాకారులు వ్యక్తిగత స్పోర్ట్స్ మేనేజర్లను నియమించుకుంటున్నారు. క్రీడలతో ముడిపడిన కంపెనీలు సైతం స్పోర్ట్స్ మేనేజర్లను తీసుకుంటున్నాయి. బహుళ జాతి కంపెనీలు కూడా స్పోర్ట్స్ మేనేజర్లను తీసుకుని ఉద్యోగుల మధ్య క్రీడాపోటీలు నిర్వహిస్తున్నాయి.

స్పోర్ట్స్ కన్సల్టెంట్లు : స్పోర్ట్స్ కన్సల్టింగ్ సంస్థల్లో అవకాశాలుంటాయి. ఇందులో స్పోర్ట్స్ క్లబ్బులకు కన్సల్టెంట్‌గా వ్యవహరించవచ్చు. ఆటగాళ్లకు కావాల్సిన అవసరాలను వీళ్లు తీర్చుతారు. వారికి సరైన శిక్షకులను కేటాయించడం, సూచనలు చేయడం లాంటివి చేస్తారు.



ఈవెంట్ కోఆర్డినేటర్లు : వివిధ స్థాయిల్లో జరిగే క్రీడా పోటీలకు సంధానకర్తగా వ్యవహరిస్తారు. సరైన వేదికను ఎంపికచేయడం, ఆటగాళ్లతో సమన్వయం, క్రీడలను ప్రసార మాధ్యమాల్లో అందుబాటులోకి తేవడం ఇవన్నీ చూసుకుంటారు.

ఫిట్‌నెస్ డైరెక్టర్లు : వీరు ఫిట్‌నెస్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఆ గ్రూప్ సభ్యులు ఫిట్‌నెస్ కోల్పోకుండా ఉండడానికి కావాల్సిన క్రీడలు, వ్యాయామాలు వారితో చేయిస్తారు. ఇందుకు అనువైన వేదిక, పరికరాలను సమకూరుస్తారు. కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు ఉంటాయి. సొంతంగానూ రాణించవచ్చు.

స్పోర్ట్స్ ప్రమోటర్లు : స్పోర్ట్స్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో స్పెషలైజేషన్ చేసినవారు స్పోర్ట్స్ ప్రమోటర్లగా రాణించవచ్చు. ఏదైనా ఈవెంట్‌కు ప్రచారం చేయడానికి వీరు కమిషన్ తీసుకుంటారు లేదా సొంతంగా కంపెనీ సైతం నిర్వహించుకోవచ్చు. నిర్వహణ నైపుణ్యం, ప్రణాళికల ద్వారా స్పోర్ట్స్ ప్రమోటర్లుగా మెప్పించవచ్చు.

అకౌంట్ కోఆర్డినేటర్లు : మార్కెటింగ్ వ్యూహాలు రచించడంలో ఉన్నత స్థాయి ఉద్యోగులకు సహాయకులుగా వీరు వ్యవహరిస్తారు. సంస్థలు, కార్పొరేట్ క్లయింట్లతో సంబంధ బాంధవ్యాలు నెలకొల్పుతారు.

పబ్లిక్ రిలేషన్స్ అసిస్టెంట్లు : వీరు క్రీడాసంస్థల్లోని కోచ్‌లు, క్రీడాకారులు, ఉన్నత స్థాయి ఉద్యోగులకు సహాయపడతారు. అవసరమైతే కోచ్, క్రీడాకారులతో ఇంటర్వ్యూలు ఇప్పించడం లాంటివి చేస్తారు. స్పోర్ట్ ఇన్ఫర్మేషన్ డైరెక్టర్ పోస్టు కూడా ఇలాంటిదే. స్పోర్ట్స్ టీం, మీడియా మధ్య సంధానం చేస్తారు. మీడియా సమావేశాలు నిర్వహించడం, అవసరమైన సమాచారం మీడియాకు అందించడం మొదలైనవి వీరు చూసుకుంటారు.

స్పోర్ట్స్ బ్రాడ్ కాస్టర్ : స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో మరో కెరీర్ అవకాశమిది. మంచి ఆహార్యం, విశ్లేషణ నైపుణ్యం, వాక్ చాతుర్యం ఉన్నవాళ్లు నేరుగా స్క్రీన్ మీద సత్తా చాటవచ్చు. ఇందుకోసం సంబంధిత క్రీడాంశాల్లో మంచి పట్టు తప్పనిసరి. తెర వెనుక జరిగే తతంగాన్ని పర్యవేక్షించి ఆ సంఘటనను విజయవంతం చేయడానికి సైతం ఎంతోమంది అవసరం ఉంటుంది.

ఫిజియోలో ప్రత్యేక ప్రావీణ్యం ఉంటే స్పోర్ట్స్ థెరపిస్టులుగా రాణించవచ్చు. స్పోర్ట్స్ మెడిసిన్, స్పోర్ట్స్ జర్నలిజం తదితర అవకాశాలూ లభిస్తున్నాయి. దాదాపు ప్రతి మీడియా సంస్థలోనూ స్పోర్ట్స్ జర్నలిస్టులు ఉన్నారు. స్పోర్ట్స్ సైకాలజీ పూర్తి చేసుకున్నవారు స్పోర్ట్స్ సైకాలజిస్టులుగా రాణించవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు టీం తరపున స్పోర్ట్స్ సైకాలజిస్టులు ఉంటారు.

డిగ్రీ, పీజీ, డిప్లొమా

స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో బీఏ, బీబీఎం కోర్సులు చేయడానికి ఏ గ్రూప్‌తోనైనా ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు. పీజీ డిప్లొమా చేసేందుకు కనీస అర్హత డిగ్రీ. పీజీ కోర్సులను సాధారణ డిగ్రీతో చదువుకోవచ్చు. అయితే కొన్ని సంస్థలు ఫిజికల్ ఎడ్యుకేషన్ చదువుకున్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నాయి.

యూజీ స్థాయిలో బీఏ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, బీబీఏ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, బ్యాచిలర్ ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఉన్నాయి. పీజీలో ఎంఏ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, ఎంబీఏ స్పోర్ట్స్ బిజినెస్, మాస్టర్ ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కోర్సులను పలు సంస్థలు అందిస్తున్నాయి. పీజీ డిప్లొమా ఇన్-స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ / స్పోర్ట్స్ బిజినెస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉంటే ఈ విభాగంలో పీహెచ్‌డీ కూడా చేయవచ్చు. కొన్ని సంస్థలు దూరవిద్య ద్వారా యూజీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సులను అందిస్తున్నాయి.

ఏ సంస్థల్లో...?


స్కిల్ నేషన్ ఇండియా (ముంబయి) స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రసిద్ధి చెందింది. ఫుట్‌బాల్, టెన్నిస్, గోల్ఫ్, క్రికెట్, బాస్కెట్ బాల్, రెజ్లింగ్, హాకీ, బ్యాడ్మింటన్, షూటింగ్‌ల్లో... ఈ కోర్సులు అందిస్తోంది. ఇక్కడ ఫుల్ టైం, పార్ట్ టైం, ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ సంస్థ ఇంటర్న్‌షిప్, ఉద్యోగాలను కల్పిస్తోంది. www.skillanation.com

➠ నేషనల్ అకాడమీ ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, ముంబయి - జార్జ్ కాలేజ్, కోల్‌కతా - ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, ముంబయి

➠ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, కోల్‌కతా - ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పుణె - తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, చెన్నై - లక్ష్మీబాయ్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, గ్వాలియర్ - నేతాజీ సుభాష్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్ఎస్ఐఎస్), పాటియాలా - శ్రీ ధర్మస్థల మంజునాథ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్, మైసూరు. - మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, పశ్చిమ బెంగాల్.

(సంస్థల వారీగా అందిస్తున్న కోర్సులు, మరిన్ని వివరాల కోసం https://goo.gl/CMWME7 చూడవచ్చు.)

భువనేశ్వర్-ఎయిమ్స్‌లో 124 పోస్టులు



భువనేశ్వర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న **124** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు...

1. సీనియర్ రెసిడెంట్లు : 123

విభాగాలు : అనస్థీషియాలజీ, బయో కెమిస్ట్రీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ తదితర విభాగాలు...

అర్హత : పోస్టును బట్టి సంబంధిత విభాగంలో పీజీ (ఎండీ/ఎంఎస్/డీఎం/ఎంసీహెచ్/డీఎన్‌బీ) ఉత్తీర్ణత.

2. పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ (కార్డియో-థొరాసిక్ అనస్థీషియా) : 1

అర్హత : ఎండీ/ డీఎన్‌బీ ఉత్తీర్ణత.

వయసు : సీనియర్ రెసిడెంట్ పోస్టులకు 37 ఏళ్లు, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పోస్టుకు 45 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : సీనియర్ రెసిడెంట్ పోస్టులకు రాత పరీక్ష, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పోస్టులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉంటుంది.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : జనరల్, ఓబీసీలకు రూ.1000; ఎస్సీ, ఎస్టీలకు రూ.500.

దరఖాస్తుకు చివరితేదీ : ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (2018, డిసెంబర్ 22-28)లో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : https://aiimsbhubaneswar.nic.in

ఇస్రోలో 18 ఖాళీలు

బెంగళూరు ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 18 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీ ఖాళీలు : సైంటిస్ట్/ఇంజనీర్-ఎస్సీ (సివిల్-9, ఎలక్ట్రికల్-6, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్-2, ఆర్కిటెక్చర్-1).

అర్హత : పోస్టును బట్టి సంబంధిత విభాగాల్లో బీఈ/ బీటెక్, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.

వయసు : జనవరి 15, 2019 నాటికి 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : రూ.100.

రాత పరీక్షతేదీ : మార్చి 10, 2019.

పరీక్షా కేంద్రాలు : అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, చండీగఢ్, చెన్నై, గువాహటి, హైదరాబాద్, కోల్‌కత్తా, లక్నో, ముంబై, న్యూఢిల్లీ, తిరువనంతపురం.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 15, 2019.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : www.isro.gov.in

విక్రమ్ సారా భాయ్ స్పేస్ సెంటర్లో 78 ఉద్యోగాలు

తిరువనంతపురంలోని భారత ప్రభుత్వ అంతరిక్ష పరిశోధనా సంస్థ అయిన విక్రమ్ సారా భాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 78 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీ ఖాళీలు..

1. టెక్నీషియన్-బీ : 34 (ఎలక్ట్రీషియన్-7, ఎలక్ట్రానిక్ మెకానిక్-5, మెషినిస్ట్-5, ఫిట్టర్-3, ఎఫ్ఆర్‌పీ-4, కెమికల్ ఆపరేటర్-2, టర్నర్-2, ఎమ్మార్ అండ్ ఏసీ-2, ఎలక్ట్రోప్లేటర్-1, ప్లంబర్-1, బ్లాక్‌స్మిత్-1, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-1).

2. డ్రాఫ్ట్స్ మెన్ బి (మెకానికల్) : 4

3. కుక్ : 3

4. ఫైర్‌మెన్-ఏ : 1

5. క్యాటరింగ్ అటెండెంట్-ఏ : 22

అర్హతలు : ఎస్ఎస్ఎల్‌సీ/ ఎస్సెస్సీ, సంబంధిత విభాగాల్లో ఐటీఐ/ ఎన్‌టీసీ/ ఎన్ఏసీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 11, 2019.


అసిస్టెంట్ పోస్టులు - 14

1. టెక్నికల్ అసిస్టెంట్ : 11

అర్హత : సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ డిప్లొమా, డిప్లొమా ఉత్తీర్ణత.

2. సైంటిఫిక్ అసిస్టెంట్ : 1

అర్హత : అగ్రికల్చర్ లేదా హార్టికల్చర్ స్పెషలైజేషన్‌తో బీఎస్సీ ఉత్తీర్ణత.



3. లైబ్రరీ అసిస్టెంట్ : 2

అర్హత : లైబ్రరీ సైన్స్/ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 9, 2019


పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : www.isro.gov.in

ఏఐఏటీఎస్ఎల్‌లో 375 ఉద్యోగాలు

ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఐఏటీఎస్ఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 375 పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఒప్పంద కాల వ్యవధి : మూడేళ్లు.

విభాగాల వారీ ఖాళీలు : జూనియర్ ఎగ్జిక్యూటివ్ (పాక్స్)-9, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (టెక్నికల్)-4, కస్టమర్ ఏజెంట్-155, సీనియర్ ర్యాంప్ సర్వీసెస్ ఏజెంట్-34, ర్యాంప్ సర్వీసెస్ ఏజెంట్-16,



యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్-10, హ్యాండీమ్యాన్/హ్యాండీ ఉమెన్-147.

అర్హత : పోస్టును బట్టి పదో తరగతి, డిప్లొమా/ ఐటీఐ, ఇంజనీరింగ్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. హిందీ, ఇంగ్లిష్, స్థానిక భాషలో పరిజ్ఞానంతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు : డిసెంబర్ 1, 2018 నాటికి 28 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : స్క్రీనింగ్/ ఫిజికల్/ ట్రేడ్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు : రూ.500.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీలు :

1. జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు : జనవరి 3, 2019.

2. కస్టమర్ ఏజెంట్ పోస్టులకు : జనవరి 5, 2019

3. హ్యాండీమాన్/ హ్యాండీఉమెన్ పోస్టులకు : జనవరి 6, 2019.

4. మిగతా పోస్టులకు : జనవరి 4, 2019.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : www.airindia.com

విశాలాంధ్ర బిజినెస్

363.05 ▲ సెన్సెక్స్ 35,891.52	117.60 ▲ నిఫ్టీ 10,792.50	◀◀ బంగారం (విజయవాడ) 30,010 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 30,210 ప్రొద్దుటూరు 30,210 22 క్యారెట్లు, 10 గ్రాములు	-100 ▼ వెండి (విజయవాడ) 39,300 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 41,400 ప్రొద్దుటూరు 41,463 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 70.17

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
సన్‌ఫార్మా	440.05	1.50
టీసీఎస్	1,923.30	1.08
ఏషియన్ పెయింట్స్	1,383.30	0.86
భారతీ ఇన్‌ఫ్రాటెల్	266.00	0.76
ఇన్ఫోసిస్	674.00	0.60

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఐషర్ మోటార్స్	21,162.30	-8.76
జేఎస్‌డబ్ల్యూస్టీల్	288.70	-5.02
వేదాంత	193.15	-4.43
టాటాస్టీల్	506.80	-4.29
ఎం&ఎం	772.80	-4.09

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	69.45	70.17
యూరో	79.85	80.05
పౌండ్	88.55	88.77
ఆస్ట్రేలియా డాలర్	49.05	49.16
సింగపూర్ డాలర్	50.97	51.42

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,390	32,502
చెన్నై	30,390	32,502
బెంగళూరు	29,700	31,764
ముంబై	30,660	32,791
విజయవాడ	30,010	32,850
విశాఖపట్నం	30,210	31,700
ప్రొద్దుటూరు	30,210	31,720
ముడి చమురు		45.41

బుగ్గ'కారు'కు బ్రేక్...!

- మంత్రివర్గ విస్తరణ కుదరదు
- అమల్లోకి ఎన్నికల కోడ్
- టీ-ఎన్నికల సంఘం స్పష్టం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగరా మోగిన నేపథ్యంలో శుక్రవారం ఎన్నికల పరిశీలకులతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం నిర్వహించనుంది. ఇక, పంచాతీయ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీంతో శాసనసభ్యుల ప్రమాణ స్వీకారం మరింత ఆలస్యం కానుంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేపట్టరాదని స్పష్టం చేసింది. భారీ మెజారిటీతో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ.. ముహూర్తాలు లేకపోవడంతో ఇప్పటికీ సీఎం కె.చంద్రశేఖరరావు మంత్రివర్గ విస్తరణ చేపట్టని సంగతి తెలిసిందే. సంక్రాంతి తరువాత మంత్రివర్గ విస్తరణ, తొలి శాసనసభ సమావేశాలు నిర్వహించాలని భావించినప్పటికీ ఎన్నికల కోడ్ పూర్తయ్యేవరకు ఇక మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం కనిపించడం లేదు. మూడు విడతల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు ఈ నెల 7 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై 30వ తేదీతో ముగియనుంది. దీంతో టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులంతా ఎన్నికల హడావుడిగాలో నిమగ్నం కానున్నారు. ఇప్పటికే కొన్ని పంచాయతీలను ఏకగ్రీవంగా గెలవాలని టీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తిస్థానాలను గెలుచుకునే లక్ష్యంతోనే వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పార్టీ శ్రేణులకు ఆదేశిస్తూ, పంచాయతీ బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలకు కట్టబెట్టిన చిన విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో మంత్రివర్గ విస్తరణ చేపడితే కొందరు అసంతృప్తికి గురికావడం, ఆ ప్రభావం పంచాయతీ ఎన్నికలపై పడుతుందని పార్టీ భావిస్తోంది. కాగా మంత్రి పదవులు ఆశిస్తున్నవారికి సస్పెన్స్ కొనసాగుతుంది. పనితీరు ప్రాతిపదికగా కొత్త మంత్రులను తీసుకుంటామని ప్రకటించిన గులాబీ దళపతి గత ప్రభు త్వంలో వారి వ్యవహార శైలిని పరిశీలిస్తున్నారు. మాజీ మంత్రుల్లో కొంతమందికి అవకాశం రావడం ఖాయంగా కనిపిస్తోంది. పాత మంత్రివర్గంలో మొత్తం 18 మంది ఉండగా.. తుమ్మల నాగేశ్వరరావు, పట్నం మహేందర్‌రెడ్డి, జూపల్లి క ృష్ణారావు, అజ్మీరా చందూలాల్ ఎన్నికల్లో ఓడిపోయారు. మిగిలిన మం త్రులు గత ప్రభుత్వంలో ఆయా శాఖలను నిర్వహిం చిన తీరు, పాలనలో వారి ముద్ర, వ్యవహారశైలి, పథకాల ప్రగతి, సమ స్యలు, వైఫల్యాలను ముఖ్యమంత్రి పరిశీలి స్తున్నట్లు సమాచారం. మరోవైపు ఐఎఎస్, ఐపిఎస్‌లతో సహా అధికారులెవరినీ బదిలీ చేయరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. బతుకమ్మ చీరల పంపిణీ, రైతుబంధు చెక్కుల పంపిణీ వంటివి వెంటనే నిలిపి వేయాలని ఆదేశాలు ఇచ్చింది. అయితే, పాలక మం డళ్లు ఉన్న చోట జిల్లా, మండల, మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసుకోవచ్చునని, కానీ, విధాన పరమైన నిర్ణయాలు తీసుకోకూడదని సూచించింది. రోజుకు రూ. 50 వేలు నగదు మాత్రమే వెంట తీసు కెళ్లేందుకు అనుమ తించింది. జిల్లాల్లో, రాష్ట్ర సరిహ ద్దుల్లో చెక్ పోస్టుల ఏర్పాటు చేసి, తనిఖీలు నగదు పంపిణీపై తనిఖీలు చేపట్టాలని అధికార యంత్రాం గాన్ని ఆదేశించింది. ఎన్నికల ఫిర్యాదుల కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.


విజ్ఞానం

చక్కెర పానీయాలతో కిడ్నీ వ్యాధులు



చక్కెరతో కూడుకున్న పానీయాల వినియోగంతో మూత్ర పిండ వ్యాధికి కారణమవుతుందని అమెరికాలోని జాన్ హాప్‌కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ తాజా అధ్యయనంలో వెల్లడించింది. పండ్ల రసాల్లో సోడా, వాటర్‌తోపాటు తీపిని జత చేయడంతో దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధులకు కారణమవుతుందని తెలుస్తోంది. వాటర్‌లో ఉండే వివిధరకాలు-ఫ్లేవర్డ్, స్వీటెనర్ వాటర్ వంటి వాటి వినియోగంతోఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపు తుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఎటువంటి బెవరేజెస్ కిడ్నీలకు హానిచేకూరుస్తాయనే దానిపై పరిశోధన కొనసాగుతోంది. ఆహారసరఫరాల్లో భాగంగా వివిధరకాలు బెవరేజెస్‌పై ఆరోగ్య ప్రభావంపై సమగ్ర పరిశోధన మరింతగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. 3,003 మంది పురుషులు, స్త్రీలకు సంబంధించిన మూత్రపిండాలపై పరిశోధనలో బెవరేజెస్ వినియోగిస్తున్న వారిలో మూత్రపిండ సంబంధిత వ్యాధులు 61శాతం ఉన్నట్లు తెలుస్తోంది.

ఒబెసిటీ, కేన్సర్‌కు లింక్...



శరీరబరువుకు, కేన్సర్‌కు లింక్ ఉన్నట్లు నిపుణుల తాజా అధ్యయనం వెల్లడించింది. అంతర్జాతీయంగా శరీం బరువు అధికంగా లేక ఒబెస్‌లో 3.9 శాతం కేన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఒబెసిటీకి సుమారు 13 రకాల కేన్సర్లకు సంబంధం ఉంది. పోస్ట్ మెనోపాజల్ బ్రెస్ట్ కేన్సర్, లివర్ కేన్సర్‌లతోపాటు ప్రోస్టేట్ కేన్సర్ మరో మూడురకాల కేన్సర్లకు లింక్ ఉన్నట్లు హ్యూయనా సంగ్ అనే అధ్యయనవేత్త వెల్లడించారు. 2030 నాటికి 21.7 మిలియన్లమందికి తాజాతా కేన్సర్ వ్యాధికి గురికాగా 13మిలియన్లమంది కేన్సర్‌గా కారణంగా మరణిస్తారని అంచనా...జెండర్ ఆధారంగా కేన్సర్‌కు, శరీరబరువుకు సంబంధం ఉంటుంది. మహిళల్లో మొత్తం కేన్సర్ల సంఖ్య పురుషులతోపోల్చుకుంటే రెట్టింపు కావచ్చునని తెలుస్తోంది. పురుషుల్లో ముఖ్యంగా లివర్ కేన్సర్ ముప్పు పొంచిఉన్నట్లు తెలుస్తోంది. గతనాలుగు దశాబ్దాలుగా ఒబెసిటీకి ప్రాంతీయ, అంతర్జాతీయ ప్రభావం ఎక్కువగా ఉంది.పురుషుల్లో ఒబెసిటీ 21శాతం పెరగగా, మహిళల్లో 24శాతం పెరిగే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా 40శాతంమందికి కేన్సర్ సోకే అవకాశాలు ఉన్నాయి. అన్నిదేశాల్లో శరీర బరువు మాత్రం పెరుగుతూనేఉంది. ప్రోటీన్లు, న్యూట్రిషన్ల లోపంతో ఉన్న ఆహారం, శారీరక వ్యాయామం లేకపోవడం ప్రధాన కారణాలుగాఉన్నాయి.

బ్యాంకులకు డబ్బు కట్టలేదు: జెట్ ఎయిర్‌వేస్

న్యూఢిల్లీ: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రముఖ విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ తాజాగా ఓ ప్రకటన చేసింది. బ్యాంకుల కన్సార్టి యంకు తమ సంస్థ చెల్లించాల్సిన డబ్బు ఆలస్యమవుతోందని తెలిపింది. ఎస్‌బీఐ నేతృత్వంలోని బ్యాంకుల కన్సార్టియంకు జెట్ ఎయిర్‌వేస్ చెల్లిం చాల్సిన అసలు, వడ్డీ చెల్లింపు ఆలస్యమయ్యిందని స్వయంగా పేర్కొంది. తాత్కాలికంగా నగదు నిల్వల్లో వచ్చిన తేడాలతో ఈ సమస్య ఏర్పడ్డట్లు తెలిపింది. 2018 డిసెంబరు 31 నాటికి డబ్బు చెల్లించాల్సి ఉండగా తాము ఇంకా కట్టలేదని స్పష్టంచేసింది. తాము బ్యాంకుల కన్సార్టియంతో చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించింది. 25ఏళ్ల క్రితం ప్రారంభ మైన జెట్ ఎయిర్‌వేస్ గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అప్పుల్లో కూరుకుపోవడంతో.. పైలట్లు సహా ఇతర సిబ్బందికి జీతాలు కూడా సరిగ్గా ఇవ్వలేని పరిస్థితి. 2018లో డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ బాగా బలహీన పడడం, ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడంతో ఆ ప్రభావం విమానయాన సంస్థలపై అధికంగా పడింది. జెట్ ఎయిర్‌వేస్‌ను చిక్కుల్లో నుంచి బయట పడేసేందుకు అబుదాబికి చెందిన ఎతిహాద్ ఎయిర్‌వేస్ కూడా బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. ఎతిహాద్‌కు జెట్‌ఎయిర్‌వేస్‌లో 24శాతం వాటా ఉండగా, ఇప్పుడు ఆ వాటాను పెంచుకునే అవకాశం ఉంది.

ఈపీఎఫ్ వడ్డీ రేటు పెంపుదల..!

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు దూసుకు వస్తున్న .. నేపథ్యంలో ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాల వడ్డీరేటును పెంచాలని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ వార్షిక అంతర్గత సమీక్షలో భాగంగా వడ్డీరేటు పెంచాలని భావిస్తున్నట్టు సమాచారం. 2018-19కు గాను వడ్డీమ రేటును 8.55 శాతం నుంచి పెంచాలని యోచిస్తోంది. దీంతో 6 కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులు లబ్ధిపొంద నున్నారు. జనవరి మాసాంతంలో జరిగే సెంట్రల్ బోర్డ్ మీటింగ్‌లో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 1న జారీ చేసే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు భావిస్తు న్నాయి. ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యుడు ప్రభాకర్ బనసూర్ వడ్డీరేటు పెంపునకు ఎక్కువ అవకాశం ఉందంటూ ధ్రువీకరిం చారు. వాస్తవానికి డిసెంబర్ నెలలో ఈపీఎఫ్ వడ్డీరేటును ప్రకటించాల్సి ఉన్నప్పటికీ అకౌంట్ల ఆడిటింగ్ ఇంకా కొనసాగుతున్న కారణంగా ఆలస్యమైందని మరో సభ్యుడు తెలిపారు. కాగా 2017-18 ఏడాదికి ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈపీఎఫ్ ఖాతాలపై వడ్డీరేటు 8.55శాతంగా ఉంది.



తీవ్ర ఊగిసలాట మధ్య

సెన్సెక్స్ పతనం

ముంబై: అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలతో భారీనష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్‌మార్కెట్లు విదేశీ పెట్టుబడులు ఉపసంహరించుకోవడంతో 1శాతం నష్టాల్లో నమోదయ్యాయి. ప్రారంభంలో 200పాయింట్లు పతనమైన సెన్సెక్స్ అమ్మకాల ఒత్తిడితో మరింత కుదేలైంది. తీవ్ర ఒడిదుడుకుల మధ్య కొనసాగుతున్న మార్కెట్లలో సెన్సెక్స్ 363 పాయింట్ల నష్టంతో 1శాతంతో 35,891వద్ద, 36వేల దిగువన ట్రేడయింది. నిఫ్టీ సైతం 117.60 పాయింట్ల పతనమై 1.08 శాతంతో 10,792 వద్ద ట్రేడయింది. ఈ సంవత్సరంలో జరగనున్న సాధారణ ఎన్నికలు నేపథ్యం, కార్పొరేట్ల ఫలితాలు వెలువడనుండటంతో మార్కెట్లు తీవ్ర ఊగిసలాటలకు మొగ్గాయి. ప్రధానంగా ఆటో, మెటల్ స్టాక్స్ నష్టాల్లో నమోదవుతుండటం డిసెంబర్ అమ్మకాలు నెమ్మదించడంతో ఆటోరంగం దాదాపు 2శాతం బలహీనపడగా, రూపాయి 1శాతంపైగా నష్టపోయింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు తీవ్ర నిరాశపర్చడంతో ఐషర్ మోటార్స్ పతనం 6. 9 శాతం పతనంకాగా.. తమిళనాడులో స్టెరిలైట్ ఫ్యాక్టరీ విషయంలో ఎదురు దెబ్బ తగలడంతో వేదాంతా 4శాతం పతనమైంది. డిసెంబరులో వాహనాల అమ్మకాలు 4నుండి 9శాతానికి పైగా తగ్గాయి. నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3శాతంపైగా దిగజారింది. బిఎస్ఇ మిడ్‌కాప్, స్మాల్‌కాప్ సూచీలు 1.26శాతం, 0.74శాతం దిగజారాయి. బిఎస్ఇ సెక్టరల్ సూచీలు ఐటి, టెక్ నష్టాల్లో నమోదుకాగా మెటల్, ఆటో 3శాతంపైగా నష్టపోయాయి. వినియోగ, బేసిక్ మెటీరియల్స్, యుటిలిటీస్ 1.8శాతంపైగా దిగజారాయి. సన్ ఫార్మా, టిసిఎస్,ఆసియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్,యస్‌బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు మేజర్ లూజర్స్ కాగా కీలకసూచీలైన వేదాంత,ఐషర్ మోటార్స్, టాటాస్టీల్, ఎమ్అండ్ ఎమ్, జెఎస్‌డబ్ల్యు స్టీల్ టాప్ లూజర్స్‌గా ఉన్నారు.

ఇరాన్ చమురు పన్ను

మినహాయింపు

న్యూఢిల్లీ: ఇరాన్ ప్రభుత్వ కంపెనీ 'నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ' (ఎన్ఐఓసీ) నుంచి కొనుగోలు చేసే ముడి చమురు కోసం రూపాయల్లో జరిపే చెల్లింపులపై ప్రభుత్వం పన్ను మినహాయించింది. ఇందుకు సంబంధించి డిసెంబరు 28వ తేదీతో కూడిన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటివరకున్న నిబంధనల ప్రకారం.. ఏదేని విదేశీ కంపెనీ భారత బ్యాంక్ ఖాతా ద్వారా అందుకునే ఆదాయంపై 40 శాతం విత్‌హోల్డింగ్ ట్యాక్స్ వర్తిస్తుంది.

గుంటూరులో స్విగ్గీ రెడీ..!

గుంటూరు: ఫుడ్ డెలివరీ రంగంలో పేరుగాంచిన స్విగ్గీ గుంటూరు నగరంలో అడుగు మోపింది. దేశ వ్యాప్తంగా కోరుకున్న రెస్టారెంట్ నుంచి వినియోగదారుడి ఇంటికి ఫుడ్‌ను డెలివరీ చేయటంలో స్విగ్గీ తనకు తానే సాటిగా నిలుస్తోంది. దేశంలో ఆగ్రా, అహ్మదాబాద్, చండీగఢ్, జైపూర్, కోయంబత్తూర్, కొచ్చి, నాగ్‌పూర్, లక్నో, వైజాగ్, ఇండోర్, సూరత్, వడోదర, మైసూర్, డెహ్రాడూన్, త్రివేంద్రం, పాండిచేరీ, తిర్పూర్, తిరుపతి, త్రిస్సూర్, వరంగల్, నాసిక్, అలహాబాద్, గౌహతి ఇలా దేశంలోని 50 నగరాల్లో స్విగ్గీ తన సేవలను అందిస్తోంది. తాజాగా గుంటూరు నగరానికి తన సేవలను విస్తరించింది. దీంతో ఏపీలోని మూడో నగరంలో స్విగ్గీ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. త్వరలో విజయవాడకు విస్తరిస్తారు. ప్యారడైజ్ బిర్యానీ, బేకర్స్ ఫన్, టొమాటోస్, సబ్‌వే, శ్రీశంకర విలాస్, కేఎఫ్‌సీ, ఐబాకో... ఇలా 150 రెస్టారెంట్ల నుంచి వినియోగదారులకు ఫుడ్‌డెలివరీ చేస్తుంది. గుంటూరులోని లక్ష్మీపురం, కొత్తపేట, బ్రాడీపేట, రైలుపేట, అరండల్‌పేట, గోరంట్లలో స్విగ్గీ శాఖలను అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా స్విగ్గీ మార్కెటింగ్ విభాగం వైస్‌ప్రెసిడెంట్ టీఎస్ శ్రీవత్సవ్ మాట్లాడుతూ, రుచికి మారుపేరుగా నిలిచే గుంటూరులో తమ సేవలు విస్తరించటం ఆనందంగా ఉందన్నారు. రూ.99లకు తక్కువ కాకుండా చేసిన తొలి ఆర్డర్‌పై 50 శాతం రాయితీ ఇస్తామన్నారు.

మైన్‌మ్యాక్స్ టైర్ల ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: సియెట్ స్పెషాలిటీ టైర్ లిమిటెడ్ (సిఎస్‌టిఎల్) టిప్పర్ ట్రక్కులకు అవసరమయ్యే 'మైన్‌మ్యాక్స్' ప్రత్యేక టైర్లను రామగుండంలో ఆవిష్కరించింది. టైర్ బ్రేకర్ పై టెక్నాలజీ అందుబాటులోకి తెచ్చిన ఈ టైర్లు ఎక్కువగా కాలం మన్నిక కలిగి ఉంటాయని సియెట్ స్పెషాలిటీ టైర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ గంభీర్ తెలిపారు. క్లిష్టమైన రహదారులపై సులువుగా వెళ్లడంతో పాటు, పంక్చర్ రెసిస్టెన్స్ వీటి విశిష్టత అని, 11.00-20, 12.00-20, 12.00-24 సైజుల్లో ఈ టైర్లు అందుబాటులో ఉన్నాయని, మరింత మెరుగైన గ్రిప్‌ను, ట్రాక్షన్‌ను కలిగి ఉండేలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలిపారు. మైన్‌మ్యాక్స్ టైర్లు దేశంలోని అన్ని సిమెంట్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

ఏటీఎంలో క్యాష్ లేకపోతే ఫైన్



న్యూఢిల్లీ: బ్యాంకుల సేవింగ్ ఖాతాల్లో మినిమం బాలెన్స్ లేకపోతే కస్టమర్లనుండి ఛార్జీలు వసూలు చేస్తారు. అయితే ఏటీఎంలో సరిపడినంత నగదు ఉంచడంలో ఫెయిలైన అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంకు ఎస్‌బీఐకి భలే షాక్ తగిలింది. కస్టమర్ ఫిర్యాదును విచారించి వినియోగదారుల ఫోరం ఎస్‌బీఐకు జరిమానా విధించింది. అంతేకాదు ఇంటర్నెట్ ఫెయిల్యూర్, ఎస్‌బీఐ కస్టమర్ కాదు లాంటి కుంటిసాకులతో తప్పించుకోజూసిన బ్యాంకుకు మొట్టికాయలు కూడా వేసింది. రాయపూర్‌కు చెందిన వినియోగదారుడు ఏటీఎంలో నగదు విత్ డ్రా కోసం వెళ్లినపుడు నో క్యాష్ మెసేజ్ వెక్కిరించింది. మూడుస్లారు ఇలాంటి అనుభవం ఎదురు కావడంతో చిర్రెత్తుకొచ్చిన సదరు కస్టమరు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. 2017 ఏడాదిలో మే, జూన్ నెలలో ఒకసారి, మరోసారి ఇలా మూడుసార్లు ఏటీఏంలో నగదు తీసుకోలేకపోయాననీ, ఈ వ్యవహారంలో తనకు న్యాయం చేయాల్సిందిగా కన్స్యూమర్ ఫోరంలో ఫిర్యాదు చేశారు. దీన్ని విచారించిన కోర్టు అన్నిబ్యాంకులు ఏటీఏం సేవలపై ఏడాదికి ముందే ఫీజును కస్టమర్ల వద్దనుంచి వసూలు చేస్తున్నపుడు..ఏటీఏంలో నగదు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఆయా బ్యాంకులకు ఉందని వినియోగదారుల ఫోరం తన తీర్పులో పేర్కొంది. మూడు సందర్భాల్లో ఏటీఎంలో క్యాష్ లభించపోవడంపై ప్రశ్నించింది. అయితే కేవలం ఇంటర్‌నెట్ వైఫల్యమని, దీనికి సర్వీసు ప్రొవైడర్ బాధ్యత వహించాలన్న ఎస్‌బీఐ వాదనను కూడా తోసి పుచ్చింది. అలాగే మినిమం బ్యాలెన్స్ మెయింటైన్ చేయని యూజర్ల నుంచి ఏడాదిలో ముందే ఛార్జి వసూలు చేస్తున్నపుడు ఏటీఎంలలో నగదు లేకుండా ఏలా చేస్తారని ప్రశ్నించింది. రూ.2500 ఫైన్ చెల్లించాలని ఆదేశించింది. ఎస్‌బీఐ నెలకు రూ. వెయ్యి-మూడువేల వరకు కనీస నిల్వను ఉంచని పొదుపు ఖాతాల ఖాతాదారుల నుంచి జీఎస్‌టీ తోపాటు 5-15శాతం జరిమానా వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో 2017-18 సంవత్సరం లోని ఎనిమిది నెలల కాలంలో 41కోట్ల మంది సేవింగ్స్ ఖాతాదారులను కలిగి ఉన్న ఎస్‌బీఐ దాదాపు రూ.1772 కోట్లను జరిమానా రూపంలో వసూలు చేసింది.

కొత్త ఏడాదిలో బీఎస్ఎన్ఎల్ ఆఫర్లు


హైదరాబాద్: నూతన సంవత్సర కానుకగా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) వినియోగదారులకు కొత్త ఆఫర్లు ప్రకటించింది. ఈ వివరాలను హైదరాబాద్‌లో మంగళవారం తెలంగాణ టెలికాం సర్కిల్ సీజీఎం వి.సుందర్ వెల్లడించారు. మొబైల్ వినియోగదారులు వర్షికా-1699 ప్లాన్‌లో భాగంగా రూ.1,699తో ఏడాదిపాటు అపరిమిత (లోకల్ అండ్ రోమింగ్) వాయిస్‌కాల్స్, రోజుకు వంద ఎస్సెమ్మెస్‌లు, ఉచిత కాలర్‌ట్యూన్, అపరిమిత డేటా పొందొచ్చు. రోజుకు 2జీబీ ఉపయోగించాక డేటా వేగం 80 కేబీపీఎస్‌కు తగ్గిస్తారు. ఇవే ఆఫర్లు రూ.2,099తో రీచార్జ్ చేసుకునే వర్షికా ప్లస్-2099 ప్లాన్‌కూ వర్తిస్తాయి. అయితే రోజుకు 4జీబీ వినియోగించాక డేటా వేగం 80 కేబీపీఎస్‌కు కుదిస్తారు. రూ.300టాప్‌అప్‌తో రూ.30 అదనపు టాక్‌టైం పొందొచ్చు. గురు, శుక్ర, శనివారాల్లో రూ.250, సోమ, మంగళ, బుధవారాల్లో రూ.500, రూ.600 టాప్‌అప్‌తో పదిశాతం అదనంగా టాక్‌టైం లభిస్తుంది. కాంబో ఎస్టీవీ-175లో రూ.200, కాంబో ఎస్టీవీ-219లో రూ.250 టాక్‌టైంతో పాటు 0.5జీబీ డేటా 60రోజుల కాలపరిమితితో లభిస్తోంది. కాంబో ఎస్టీవీ-252లో రూ.350 టాక్‌టైం, 2 జీబీ డేటా, కాంబో ఎస్టీవీ-402లో రూ.600 టాక్‌టైం, 4జీబీ డేటా 60 రోజుల కాలపరిమితితో అందిస్తున్నారు. రాష్ట్రంలో బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే 487 వైఫై హాట్‌స్పాట్‌లను నెలకొల్పింది. మరో 423 హాట్‌స్పాట్‌లను ఫిబ్రవరిలోగా ఏర్పాటు చేయనుంది. ఈ హాట్‌స్పాట్‌ల నుంచి 100 మీటర్ల పరిధిలో 2 నుంచి 10 ఎంబీపీఎస్ వేగంతో రోజుకు 4జీబీ డేటా చొప్పున బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు పొందొచ్చు.

'ప్రభాస్' కేసు వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు ప్రభాస్ గెస్ట్ హౌస్ సీజ్ వ్యవహారంలో రెవెన్యూ అధికారులకు హైకోర్టు మొట్టికాయలు వేసింది. ప్రభాస్ పెట్టుకున్న రెగ్యులరైజేషన్ దరఖాస్తును పరిశీలనలోకి ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించింది. రెగ్యులరైజేషన్‌ను తిరస్కరించినట్టు ఉత్తర్వులు ఉన్నాయా? అని అధికారులను ప్రశ్నించింది. దీంతో స్పందించిన ప్రభుత్వం తరపు న్యాయవాది పూర్తి వివరాలను రేపు కోర్టు ముందు ఉంచుతామని చెప్పారు. దీంతో విచారణను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ కేసులో పూర్తి వివరాలను అందివ్వాలని అధికారులను ఆదేశించింది. రాయదుర్గంలోని పాన్ మక్తా గ్రామ రెవెన్యూ సర్వే నంబరు 46లో గల 84 ఎకరాల 30 గుంటల భూమి ప్రభుత్వానిదేనంటూ సుప్రీం కోర్టు తీర్పునివ్వడంతో శేరిలింగంపల్లి తహసీల్దార్ వాసుచంద్ర ఆ స్థలంలోని నిర్మాణాలు తొలగించి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో ప్రభాస్ ఇల్లు ఉండటంతో దాన్నీ సీజ్ చేశారు. అయితే తనకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇల్లు సీజ్ చేయడంపై ప్రభాస్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

ఆన్‌లైన్‌లో ఔషధ విక్రయాల నిషేధంపై స్టే

న్యూఢిల్లీ: అన్‌లైన్‌లో ఔషధాలను విక్రయించే విధానాన్ని నిషేధించాలని గత నెలలో ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై తాజాగా మద్రాస్ హైకోర్టులోని ద్విసభ్య ధర్మాసనం నిలుపుదల ఉత్తర్వులు (స్టే) ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం చట్టబద్ధమైన మార్గ దర్శకాలు రూపొందించేవరకూ స్టే కొనసాగుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ-ఫార్మా సంస్థలు దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ ఎం.సత్యనారాయణన్, జస్టిస్ పి.రాజమాణిక్యంతో కూడిన ధర్మాసనం.. ఈ మేరకు తీర్పు వెలువరించింది. ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాల నిషేధం 30 నుంచి 40 లక్షల రోగులపై ప్రభావం చూపుతుందని, దీనివల్ల రానున్న రెండు నెలల్లోనే పరిశ్రమ రూ.300 కోట్ల వరకూ నష్టపోవాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. "మద్రాసు హైకోర్టు తీర్పుతో మేం చాలా సంతోషంగా ఉన్నాం. ప్రజలు ఆర్డర్ చేసిన మేరకు మందులను మేం నిబద్ధతతో సరసమైన ధరలకు అందించేందుకు మరింత కృషి చేస్తాం." అని ఓ ఆన్‌లైన్ ఫార్మసీ సంస్థ వ్యవస్థాపకుడు ఆనందం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలను నిషేధించాలని కోరుతూ ఓ వ్యక్తి ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. డ్రగ్స్, కాస్మొటిక్స్ చట్టం-1940, ఫార్మసీ చట్టం-1948 ప్రకారం



ఔషధాలను ఆన్‌లైన్ వేదికల్లో అమ్మేందుకు అనుమతి లేదని ఆయన పిల్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం లక్షల సంఖ్యలో మందులు ఆన్‌లైన్ పోర్టళ్ల ద్వారా అమ్ముడవు తున్నందున, పొర పాటున ఔషధ మార్పిడి జరిగితే రోగులతో పాటు వైద్యులకు సైతం ప్రమాదం పొంచి ఉంటుందని వివరించారు. దీనిపై విచారణ జరిపిన ఏక సభ్య ధర్మాసనం ఆన్‌లైన్‌లో మందులను విక్రయించడం నిలిపేయాలని గత నెలలో తీర్పునిచ్చింది.

ఐటీ రంగంలో యువ సంచలనం..

రాహుల్ డొమినిక్

చిన్నప్పుడే కంప్యూటర్లతో ఆడేసుకున్నాడు.. పదేళ్లకే ఎన్ఐఐటిలో కోర్సు..అమ్మ ఇబ్బందిని చూసి గృహిణుల కోసం యాప్.. క్లాస్ రూములో ఏం చెప్పారో తెలుసుకునేందుకు మరో యాప్.. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది... ఇది సర్వసాధారణం, అందరికీ తెలిసిన విషయమే. సాధారణంగా గొప్ప గొప్ప వ్యక్తులు వారి బాల్యంలో చేసిన మంచి పనులను గురించి వివరించడానికి ఇలా చెప్తూ ఉంటారు. మరి రాహుల్ డొమినిక్‌ను కూడా ఆ జాబితాలోకి చేర్చవచ్చా? అది నిర్ణయించే ముందు అసలు ఈ రాహుల్ డొమినిక్ ఎవరో తెలుసుకుందాం.



రాహుల్ డొమినిక్... పదేళ్ల వయసులోనే కంప్యూటర్ ప్రోగ్రాములు రాయడం మొదలుపెట్టిన బాలమేధావి. తండ్రి కంప్యూటర్ పై పని చేసుకుంటుంటే చూసిన రాహుల్... పూర్తిగా అర్థం కాకపోయినా, ఆ కంప్యూటర్ స్క్రీన్ పైన జరుగుతున్న మార్పులపై ఆసక్తితో తండ్రిని, ఆయన పనిని అలాగే తదేకంగా పరిశీలించేవాడు. కుమారుడిలోని జిజ్ఞాసను గమనించిన ఆయన... ప్రోత్సహించడం మొదలుపెట్టారు. రాహుల్‌కి కంప్యూటర్‌ని ఇచ్చి ఏం కావాలంటే అది చేయమనేవారు. ఏం చేసినా ఎప్పుడూ అడ్డుకోలేదు. అయితే కొన్నిసార్లు ఇది రాహుల్ తండ్రికి ఇబ్బందులు కూడా తెచ్చిపెట్టేది.

"ఓసారి ఏంజరిగిందంటే...

నేనూ అమ్మా కలిసి ఓసారి అమ్మ స్నేహితురాలి ఇంటికి వెళ్లాం. ఆమె సన్ మైక్రోసిస్టమ్స్‌లోని ఐటీ విభాగంలో పనిచేస్తుంది. మేం వెళ్లే సమయానికి ఆమె ఏదో కంప్యూటర్ ప్రోగ్రామ్‌పై పని చేస్తున్నారు. మమ్మల్ని చూసి ఆప్యాయంగా పిలిచి, కాఫీ తీసుకువస్తానని లోపలికి వెళ్లారు. కంప్యూటర్ చూస్తే నా చేతులు ఆగవు కదా! ఆమె కాఫీ తీసుకుని వచ్చేంతలో ఏదో చేశాను. కానీ ఏం చేశానో, ఎలా చేశానో తెలియదు... ఆమె సుమారు 18 గంటలపాటు కష్టపడి చేసిన పని మొత్తం డిలీట్ అయిపోయింది. ఇది జరిగినప్పుడు నాకు నాలుగేళ్ల నుకుంట" అంటూ తన బాల్యంలోని సంఘటనలను గుర్తుచేసుకుంటాడు రాహుల్.

పదేళ్ల వయసొచ్చాక 'సి' ప్రోగ్రామింగ్ నేర్చుకోవడానికి ఎన్ఐఐటీలో చేరాడు రాహుల్. కానీ అక్కడి ఫ్యాకల్టీ, ఇతర సిబ్బంది ఎవరూ రాహుల్‌ని చేర్చుకునేందుకు ఒప్పుకోలేదు. ఏదో పిల్లాడు కంప్యూటర్ చూడటానికి సరదా పడుతున్నాడు అనుకున్నారు వారంతా. ఒక్క రోజు ఒక్క క్లాసులో కూర్చోపెడితే తనకు తానుగానే భయంతో పారిపోతాడు అని భావించారు. కానీ రాహుల్‌కి ఆ క్లాసు ఆసక్తిగా ఉండటంతో రోజూ వచ్చి, మొత్తం కోర్సు పూర్తిచేశాడు. దీంతో ఆశ్చర్యపోవడం ఫ్యాకల్టీ వంతైంది.

ఇక పన్నెండేళ్లప్పుడు ఎంట్రప్రెన్యూర్‌గా మారాడు రాహుల్. ఇది నిజమే. ఆ అవకాశం ఎలా వచ్చిందంటే... రాహుల్‌కి పన్నెండేళ్లప్పుడు తండ్రి ఓ ఫైనాన్స్ కన్సల్టెన్సీని ప్రారంభించారు. ఆ కంపెనీకి అవసరమైన వెబ్‌సైట్ రూపకల్పన బాధ్యతను రాహుల్‌కి అప్పగించారు తండ్రి. తర్వాత ద్యూకో పెయింట్ అనే ఓ సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశాడు రాహుల్. దీని సహాయంతో పిల్లలు రంగులు, గ్రాఫిక్స్ వంటి అంశాలు నేర్చుకోవచ్చు. ఇది విడుదలైన కొద్దిరోజుల తర్వాత తెలిసిన విషయమేంటంటే దీన్ని పిల్లలు కంటే పెద్దలే ఎక్కువగా ఉపయోగిస్తున్నారని. దీన్ని ఓ సాఫ్ట్‌వేర్‌గా మొదట్లో రూపొందించినా తర్వాత కాలంలో విండోస్ అప్లికేషన్‌గా అభివృద్ధి చేశారు.

'వైర్డ్ ఇన్'...

రాహుల్ డొమినిక్ కలల ప్రాజెక్టు. దీనికోసం రాహుల్ విపరీతంగా ఆలోచించిందేమీ లేదు. పరిశోధించింది అంతకన్నా లేదు. ఓసారి రాహుల్ తన స్నేహితులతో కలసి ఓ విహారయాత్రకు వెళ్లాడు. స్కూల్ ఎగ్గొట్టి అలా వెళ్లినందుకు... రాగానే ఆ రోజు స్కూల్లో జరిగిన క్లాసులు, హోమ్ వర్క్, నోట్స్... ఎవరిని అడగాలో తెలియదు. ఒకవేళ ఎవరైనా చెప్పినా అది ఎంతవ రకూ కరెక్టో తెలియదు. వీటన్నింటితో రాహుల్‌కి బోర్ కొట్టింది. ఆ విసుగు నుంచి పుట్టిందే వైర్డ్ ఇన్ యాప్. ప్రతిరోజూ టీచర్లు తమ క్లాసు పూర్తయిన తర్వాత వారు చెప్పిన పాఠాలు, పిల్లలు చేసుకురావల్సిన హోమ్ వర్క్‌కి సంబంధించిన వివరాలను ఈ యాప్‌లో అప్ లోడ్ చేస్తారు. అది విద్యార్థులందరూ చూసి తదనుగుణంగా వర్క్ చేసుకుని తర్వాత రోజు స్కూలుకి వచ్చేవారు. ఇది రాహుల్ కెరీర్‌లోనే అతిపెద్ద విజయం.

వైర్డ్ ఇన్ అప్లికేషన్‌పై టీచర్ల ఫీడ్ బ్యాక్ కోసం ఓ సర్వే నిర్వహించగా దాదాపు 86 శాతం మంది పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన 14 శాతం కూడా యాప్ పనితీరుపై ఎలాంటి విమర్శలూ చేయలేదు, వారికి దాని ధరకు సంబంధించి కొన్ని అభ్యంతరాలున్నాయి. అంటే వారు కూడా యాప్‌తో సంతృప్తి చెందినట్లే. ఈ యాప్‌లో ఎలాంటి అడ్వర్టైజ్‌మెంట్లూ లేకుండా విద్యార్థులకు అందించాలనేది రాహుల్ లక్ష్యం.

అమ్మకు చేసిన సాయం

రాహుల్ తల్లి సిస్కోలో పనిచేస్తారు. ఎప్పుడూ తీరికలేని పని, హడావుడి. దీంతో ఇంట్లో వంట విషయానికి వచ్చేసరికి... ఏం చేయాలో, ఎలా చేయాలో తెలియక ఎప్పుడూ సతమతమైపోతూ ఉండేవారు. అది చూసిన రాహుల్‌కి వంటలు, విశేషాలను అందించేందుకు ఓ అప్లికేషన్ రూపొందిస్తే ఎలా ఉంటుందా అని ఓ ఆలోచన మెరిసింది. అలా చేయగలిగితే తన తల్లి లాంటి ఎందరో గృహిణులకు ఉపయుక్తంగా ఉంటుందనిపించింది. కొద్ది రోజుల్లోనే ఆ యాప్ ఆచరణ రూపం దాల్చింది.

ప్రశాంత ప్రపంచానికీ మరో యాప్

రాహుల్ మరో ఆవిష్కరణ వెరి సేఫ్. ప్రపంచాన్ని ఓ అందమైన, ప్రశాంతమైన ప్రదేశంగా మార్చడానికి ఎప్పుడూ తాపత్రయపడుతూ ఉండేవాడు. ఆ లక్ష్యానికి ప్రతిరూపమే వెరి సేఫ్. మన చుట్టూ ఉన్న ప్రదేశాలు, నగరాలు లేదా దేశంలో ఏ ప్రదేశం నివాసానికి అనుకూలంగా ఉంటుంది? నేరాల రేటు ఎక్కడ తక్కువ ఉంటుంది? ఇలాంటి ఎన్నో అంశాలు ఈ అప్ ద్వారా కస్టమర్లకు ఉచితంగా అందుతున్నాయి.

పెద్ద పెద్ద వ్యాపారవేత్తలకే సైతం సాధ్యంకాని ఆవిష్కరణలను పదహారేళ్లకే ఆవిష్కరించి శభాష్ అనిపించుకున్నాడు రాహుల్. భవిష్యత్తులో ఇంకా ఎలాంటి అద్భుతాలు రానున్నాయో వేచి చూద్దాం.

విదేశాలకూ విస్తరిస్తున్న

'మేకర్స్ ఆఫ్ మిల్క్‌షేక్'



లండన్‌లో మిల్క్‌షేక్ రుచిచూశాడు. అలాంటిదే భారత్‌లోనూ తయారు చేసి విక్రయించాలనుకున్నాడు. ఏడాదిపాటు అధ్యయనం చేసి చివరకు 'మేకర్స్ ఆఫ్ మిల్క్‌షేక్స్' పేరిట రంగంలోకి దిగాడు. తొలిసారిగా ఏర్పాటుచేసిన స్టోర్ విజయవంతమైంది. మిల్క్‌షేక్స్ రుచికి ఫిదా అయిన ఇంజనీరింగ్ విద్యార్థుల బృందం ఫ్రాంచైజీకి ముందుకొచ్చింది. అలా మొదలైన కంపెనీ ప్రస్థానం ఐదేళ్లలో 75 ఔట్‌లెట్ల స్థాయికి చేరింది. ఇప్పుడు యూఎస్‌లోనూ అడుగుపెడుతున్నట్లు 'మేకర్స్ ఆఫ్ మిల్క్‌షేక్స్' ఫౌండర్ రాహుల్ తిరుమలప్రగడ తెలిపారు. కంపెనీ భవిష్యత్ ప్రణాళిక ఆయన మాటల్లోనే...

హైవేలో దూసుకెళ్లాం..

యూకేలోని సండెర్లాండ్ యూనివర్సిటీలో ఎంబీఏ చేశా. అక్కడ చదువుకునే రోజుల్లో ఓ స్టోర్‌లో దొరికే మిల్క్‌షేక్స్ బాగా ఆకట్టుకున్నాయి. అదే వ్యాపారంలోకి అడుగుపెట్టాలనుకున్నా. ఏడాది పాటు అధ్యయనం చేసి 2013లో హైదరాబాద్-బెంగళూరు హైవేలో మేకర్స్ ఆఫ్ మిల్స్‌షేక్స్ స్టోర్‌ను ప్రారంభించా. కస్టమర్లు బాగా ఆకర్షితులయ్యారు. ఔట్‌లెట్ మొదలైన కొద్దిరోజుల్లోనే ఓ స్నేహితుల బృందం ఫ్రాంచైజీకి ముందుకొచ్చింది. అలా ఇప్పుడు 75 ఔట్‌లెట్లు నడుస్తున్నాయి. వీటిలో 73 ఫ్రాంచైజీలవే.

మిల్క్‌షేక్స్ 105 ఫ్లేవర్లలో..

ఓ ఫుడ్ కంపెనీ సాయంతో ఆరు నెలలపాటు శ్రమించి బేస్ మిల్క్ షేక్ మిక్స్‌ను అభివృద్ధి చేశాం. మిల్క్‌షేక్స్ తయారీకి ఈ మిక్స్ ప్రధాన ముడిపదార్థం. కొవ్వు, చక్కెర శాతం తక్కువ. యూకే, యూఎస్ స్టాండర్డ్స్ పాటిస్తున్నాం. ముడి సరుకు ఏమాత్రం వృథా కాదు. మొత్తం 105 రకాల రుచులను విక్రయిస్తున్నాం. ఎప్పటికప్పుడు కొత్త వెరైటీలను ప్రవేశపెడుతున్నాం. మిల్క్‌షేక్స్ ధర రూ.140తో మొదలై రూ.250 వరకు ఉంది.


విదేశాల్లో 'షేక్'..

యూఎస్‌లో స్టోర్ ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. దుబాయి తదితర దేశాల నుంచీ ఎంక్వైరీలు వస్తున్నాయి. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్‌లోనూ అడుగుపెట్టబోతున్నాం. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అన్నవరంలో మా కేంద్రాలున్నాయి. 2018లో మొత్తం 100 కేంద్రాలు, 2019 డిసెంబరు నాటికి 200 స్టోర్ల స్థాయికి చేరుకుంటాం. భారత్‌లో అన్ని ప్రధాన పట్టణాల్లోకీ ప్రవేశిస్తాం. ప్రతి కేంద్రం ద్వారా 3-5 మందికి ఉపాధి లభిస్తుంది. కంపెనీలో 250 మంది ఉద్యోగులున్నారు.

2018-19లో రూ.40 కోట్లు..

సీడ్ ఫండ్ కింద రూ.35 లక్షలు పెట్టుబడి పెట్టాం. నిధుల సమీకరణ ఆలోచన లేదు. సంస్థలో మరో ఇద్దరు భాగస్వాములు అభిలాష్, శ్రీనివాస్‌లకు చెరి 10 శాతం వాటా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.25 కోట్ల వ్యాపారం చేశాం. 2018-19లో రూ.40 కోట్లు ఆశిస్తున్నాం. ఒక్కో స్టోర్‌కు ఫ్రాంచైజీకి రూ.18 లక్షలవుతుంది. ఏడాదిలో పెట్టుబడి మీద లాభాలు ఆర్జించొచ్చు. 300-1,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండాలి. సిబ్బందికి శిక్షణ మేమే ఇచ్చి నియమిస్తాం అని రాహుల్ వివరించారు.

ప్రేమికుల రోజున వస్తున్న 'గల్లీ బాయ్'



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గల్లీ బాయ్'. 'అప్నా టైమ్ ఆయేగా' (మనకూ టైం వస్తుంది) అన్నది ఉపశీర్షిక. ఆలియా భట్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్లను ఈరోజు విడుదల చేశారు. లుక్‌లో ఆలియా, రణ్‌వీర్ బాధగా, ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటున్నట్లుగా కన్పించారు. ఇందులో ఆలియా ముస్లిం యువతిగా నటిస్తున్నట్లు లుక్‌ను బట్టి తెలుస్తోంది. మ్యూజికల్ డ్రామా చిత్రంగా దీనిని తెరకెక్కిస్తున్నారు. వివియన్ ఫెర్నాండెజ్, నవేద్ షేక్ అనే ఇద్దరు గాయకుల నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతోందట. ఈ చిత్రానికి జోయా అఖ్తర్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఫర్హాన్ అఖ్తర్, రితేశ్ సిధ్వానీ, జోయా అఖ్తర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రణ్‌వీర్, ఆలియా కాంబినేషన్‌లో వస్తున్న తొలి చిత్రమిది. వ్యాలెంటైన్స్ డే సందర్భంగా ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మరోపక్క రణ్‌వీర్ '86', 'తఖ్త్' సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆలియా కూడా 'తఖ్త్', 'బ్రహ్మాస్త్రా', 'సడక్' చిత్రాల్లో నటిస్తున్నారు.

జాతి వివక్షపై అస్త్రం.. 'రెయిన్‌బో'



ప్రముఖ లఘు చిత్రాల దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆనంద్ కుమార్ రూపొందించిన 'రెయిన్‌బో' ఆల్బమ్‌ను టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు విడుదల చేయనున్నారు. 'ప్రేమ, శాంతిని పంచుదాం' అనే సామాజిక అంశంతో రూపొందించిన 'రెయిన్‌బో' కాన్సెప్ట్ వీడియోకు సంబంధించి లిరికల్ వీడియోను నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం విడుదల చేశారు. ఆ లిరికల్ వీడియోకు మంచి స్పందన వస్తున్నట్లు దర్శకుడు ఆనంద్ కుమార్ తెలిపారు. రెయిన్‌బో(ఇంద్రధనుస్సు)లోని ఏడు రంగుల్లా.. ఏడు భాషల్లో ఈ వీడియోను సంగీత ప్రియుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ఆనంద్ పేర్కొన్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, బెంగాలీ భాషల్లో వీడియోను రూపొందించామని, యాంటీ రేసిజం(జాత్యంహకార వ్యతిరేకత) అనే నినాదంతో ఈ ఆల్బం రాబోతోందని ఆయన చెప్పారు. "చెట్టంత ఎదిగిన కొడుకులు అర్థాంతరంగా చనిపోతే ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంటుంది. వాళ్ళను ఓదార్చటం ఎవరితరమూ కాదు. ఈ క్రమంలో శ్రీనివాస్ కూచిభొట్ల సతీమణి సునయన రాసిన ఉత్తరం ప్రపంచం మొత్తాన్ని కదిలించింది. ఈ జాత్యాంహకారాన్ని రూపుమాపడానికి నా వంతుగా ఏదైనా చెయ్యాలని అప్పుడే అనుకున్నా. జాతి వివక్ష, కుల వివక్షల నిర్మూలనలో నా వంతు పాత్రే ఈ పాట. సాటి మనిషి మీద విషం చిమ్మడం, కక్ష్య, పగలతో రగిలిపోయి ఒకరి జీవితాన్ని అన్యాయంగా అంతం చేసే హక్కు ఎవరికీ లేదని చెప్పే ప్రయత్నం చేశాం. ఈ కాన్సెప్ట్ చెప్పగానే స్వాతి పెనుగొండ నిర్మించడానికి ముందుకు వచ్చారన్నారు. ఏడు రంగులు కలిస్తేనే హరివిల్లు.. అలాగే మనుషులందరూ కలిస్తేనే ఒక అందమైన ప్రపంచాన్ని ఆవిష్కరించగలం అనే థీమ్ ఈ ఆల్బంలో దాగివుంది. జాత్యాంహకార దాడులు మాని శాంతిని పెంపొందించాలనే లక్ష్యమే ఈ ఆల్బంకు ఊపిరి పోసింది. అనన్య పెనుగొండ ఇందులో నటించడంతో పాటు చాలా అద్భుతంగా పాడారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హీరో సుధీర్‌బాబు ఆశీస్సులతో 'రెయిన్‌బో' ఆల్బమ్‌ను ఈ నెల 7న విడుదల చేస్తున్నాం. అలాగే 6వ తేదీ సాయంత్ర 'ఏబీఎన్' చానెల్‌లో లైవ్ షో చేయబోతున్నాం." అని డైరెక్టర్ ఆనంద్ వివరించారు. ఈ పాట షూటింగ్ ఎక్కువ భాగం తెలంగాణలోని ఉస్మానియా యూనివర్సిటీ, లక్కవరం, నాగార్జున సాగర్, రామప్ప దేవాలయం వంటి అందమైన లోకేషన్లలో ఆరు రోజుల్లో చిత్రీకరించారు. దీనికి సంగీతం, సాహిత్యం పెద్దపల్లి రోహిత్ అందించారు. కొరియోగ్రఫీ కిరణ్ అంబుల సమకూర్చారు. సుందర్ శాస్త్రి నిర్మించారు. శరత్ కొప్పు తండ్రి కొప్పు రామ్మోహన్ సమర్పిస్తున్నారు.



సిద్ధార్థ్ హీరోగా

అరువం



ట్రైడెంట్ ఆర్ట్స్ బ్యానరుపై రవీంద్రన్ నిర్మిస్తున్న కొత్త చిత్రం 'అరువం'. సిద్ధార్థ్ హీరోగా నటిస్తున్నారు. కేథరిన్ కథానాయిక. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా ఇది. సాయిశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను తాజాగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ఇది థ్రిల్లర్ చిత్రం. రూపానికి వికృతి పదమే 'అరువం'. ప్రతి ఒక్కరిలో మరో కోణం ఉంటుంది. ఆ విషయాన్ని చాటిచెప్పే చిత్రమే ఇది. ఇదివరకు ఏ సినిమా చెప్పని విషయాన్ని ఇందులో ప్రస్తావించాం. కబీర్‌సింగ్, మధుసూన్‌రావు, స్టంట్ సిల్వాలు ముఖ్యపాత్రలు పోషించారు. సతీష్, మయిల్‌స్వామి హాస్యాన్ని పంచనున్నారు. తమన్ సంగీతంలోని ఈ చిత్రానికి ఎన్‌కే ఏకాంబరం సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. స్టంట్ సిల్వా కూడా విలన్‌గా నటించారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు.

'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' కన్పించడంలేదు

యూట్యూబ్‌పై అనుపమ్ ఖేర్ అసంతృప్తి



భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవితాధారంగా తెరకెక్కిన చిత్రం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. విజయ్ రత్నాకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇటీవల ఈ చిత్ర ట్రైలర్ విడుదలైంది. అయితే ఈ వీడియో యూట్యూబ్‌లో కనిపించడంలేదట. ఈ విషయాన్ని అనుపమ్ ఖేర్ ట్విటర్ ద్వారా వెల్లడిస్తూ యూట్యూబ్ వ్యవహారం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. 'డియర్ యూట్యూబ్.. 'యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' అని యూట్యూబ్‌లో టైప్ చేస్తుంటే వీడియో కన్పించడంలేదు. ఈ విషయం గురించి నాకు అభిమానుల నుంచి మెసేజ్‌లు, కాల్స్ వస్తున్నాయి. మొన్నటివరకు మా ట్రైలర్ యూట్యూబ్ ట్రెండింగ్స్‌లో మొదటి స్థానంలో ఉంది. ఇప్పుడు చూస్తే కనీసం 50వ స్థానంలో కూడా లేదు. అసలు కనిపించడంలేదు. సాయం చేయండి.' అని వెల్లడిస్తూ అభిమానుల కోసం మరోసారి ట్రైలర్ లింక్‌ను పోస్ట్ చేశారు. ఈ ట్రైలర్‌ను ఇప్పటివరకు 37 మిలియన్ మందికి పైగా వీక్షించారు. ఇందులో మన్మోహన్ సింగ్ పాత్రలో అనుపమ్ ఖేర్ నటించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఆయన వద్ద జాతీయ భద్రతా సలహాదారుడిగా వ్యవహరించిన సంజయ్ బారూ..మన్మోహన్ జీవితాధారంగా రాసిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' అనే బయోగ్రఫీ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ట్రైలర్ విడుదలయ్యాక సినిమాపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. సినిమాను ముందు తమకు చూపించాల్సిందిగా డిమాండ్ చేసింది. అయితే ప్రత్యేక స్క్రీనింగ్‌కు మన్మోహన్ ఒప్పుకొంటేనే వేస్తామని అనుపమ్ స్పష్టం చేశారు. ఈ నెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

నిర్మాతగా మారనున్న స్టార్ డైరెక్టర్



ఇప్పటివరకూ అపజయమంటే ఏంటో తెలియని డైరెక్టర్ కొరటాల శివ. రచయితగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన కొరటాల అనంతరం 2013లో 'మిర్చి' సినిమాతో డైరెక్టర్‌గా మారారు. అనంతరం తీసిన శ్రీమంతుడు, జనతా గ్యారేజ్, భరత్ అనే నేను చిత్రాలు బ్లాక్ బస్టర్ సక్సెస్‌ను సాధించాయి. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో సినిమా చేసేందుకు కొరటాల సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం చిరు 'సైరా నరసింహారెడ్డి' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే కొరటాలతో సినిమా చేయనున్నారు. అయితే ప్రస్తుతం కొరటాల నిర్మాతగా కూడా ఓ సినిమాను తెరకెక్కించనున్నట్టు తెలుస్తోంది. ఆ చిత్రాన్ని మూడు నెలల్లో కంప్లీట్ అయ్యేలా చూస్తారట. కొరటాల నిర్మాణంలో తెరకెక్కనున్న చిత్రానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

మార్చిలో రెండు సినిమాలు : దిల్‌రాజు



ఈ ఏడాది మార్చినెలలో మరో రెండు సినిమాలు ప్రారంభం కానున్నాయని సినీ నిర్మాత దిల్‌రాజు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట మీడియాతో మాట్లాడుతూ జనవరిలో ఎఫ్-2, ఏప్రిల్‌లో మహేశ్‌బాబు హీరోగా నటించిన మహర్షి విడుదల కానున్నట్టు తెలిపారు. దర్శనానికి ముందు దిల్‌రాజు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ప్రభాస్‌తో సుస్మితాసేన్.. వైరల్ అవుతున్న ఫోటో



జైపూర్ పెళ్లిలో తీసుకున్న కొన్ని అద్భుతమైన ఫోటోలను సుస్మితా సేన్ షేర్ చేసుకున్నారు. అవి అభిమానులకు విజువల్ ట్రీట్‌లా మారాయి. రాజమౌళి కుమారుడు కార్తికేయ వివాహానికి హాజరైన సుస్మిత.. ప్రభాస్‌తో కలిసి తీసుకున్న పిక్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వివాహ సమయంలో ప్రభాస్, ఆమె ఫ్యామిలీతో తీయించుకున్న పిక్స్‌ను సుస్మిత సోషల్ మీడియాలో షేర్ చేశారు. సుస్మిత, ప్రభాస్‌తో కలిసి ఫోజిచ్చిన పిక్ ప్రస్తుతం బాగా వైరల్ అవుతోంది. ఆ పిక్‌లో ఇద్దరూ స్మైలింగ్ లుక్స్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. అలాగే వెడ్డింగ్ ప్రారంభమైనప్పటి నుంచి రామ్ చరణ్, అతని భార్య ఉపాసన, రానా దగ్గుబాటి తదితరులు సంగీత్, వివాహానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేసి అభిమానులకు అరుదైన ట్రీట్‌ను అందించారు.

హైకోర్టు విభజనపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు విభజనను తాత్కాలికంగా వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఇప్పటికే రెండు హైకోర్టులకు సంబంధించి వేర్వేరుగా ప్రమాణ స్వీకారాలు కూడా పూర్తైన నేపథ్యంలో జోక్యం చేసుకోలేమంటూ పిటిషనర్ల వాదనను తోసిపుచ్చింది. ఏపీ రాజధాని అమరావతిలో హైకోర్టు భవనాలు, జడ్జిల నివాస సముదాయాలు పూర్తయ్యే వరకు హైకోర్టు విభజన తాత్కాలికంగా వాయిదా వేయాలని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తొలుత అత్యవసర విచారణ చేపట్టాలన్న అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీం కోర్టు... బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ల వాదనను జస్టిస్ ఏకే సిక్రి, జస్టిస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. ఇప్పటికే రెండు హైకోర్టులు ఏర్పాటు కావడంతో జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది.

క్యూబా విప్లవానికి 60ఏళ్లు : సీపీఐ విప్లవాభినందనలు

న్యూఢిల్లీ : అమెరికా-బటిస్టా నియంతృత్వానికి వ్యతిరేకంగా 1959లో జరిగిన క్యూబా విప్లవానికి 60ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా క్యూబా ప్రజలకు, అక్కడి కమ్యూనిస్టు పార్టీకి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) విప్లవాభినందనలు తెలిపింది. సామ్రాజ్య వాదుల బెదిరింపులు, దాడులను ఎదుర్కొంటూ సోషలిజాన్ని నెలకొల్పినందుకుగాను క్యూబాలోని కమ్యూనిస్టు ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం, అనాగరికతకు సోషలిజం ఒక్కటే ప్రత్యామ్నాయమని యావత్ ప్రపంచానికి క్యూబా రుజువు చేసిందని సీపీఐ శ్లాఘించింది. సోషలిస్టు విజయానికి దోహదపడిన కామ్రేడ్ ఫిడెల్‌కాస్ట్రో సేవలను స్మరించుకునేందుకు ఇదే సరైన సందర్భంగా పేర్కొంది. ఈ 60ఏళ్లలో సామ్రాజ్యవాదుల విద్రోహ చర్యలను ఐక్యంగా తిప్పికొట్టిన క్యూబా ప్రజలకు సీపీఐ జాతీయ సమితి శాల్యూట్ చేస్తోందని పార్టీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. క్యూబా విప్లవం స్ఫూర్తిని, సందేశాన్ని భారతీయులకు చేర్చేందుకు ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పనిచేస్తామని తెలిపింది. క్యూబా విప్లవానికి 60ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా భారత్‌లో సముచిత కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీపీఐ వెల్లడించింది. ఈ సందర్భంగా క్యూబా పీసీసీ తొలి కార్యదర్శి రాల్ కాస్ట్రో క్రజ్, అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కెనెల్ బెర్ముడెజ్, పీసీసీ ఆఫీసు బేరర్లు, క్యూబా ప్రభుత్వంతో పాటు ఆ దేశప్రజలందరికీ విప్లవాభినందనలను సీపీఐ తెలిపింది.

రాఫెల్ రగడ



- దద్దరిల్లిన లోక్‌సభ
- గదిలో దాక్కున్న మోడీ : రాహుల్
- అబద్ధాల వారసుడు రాహుల్ : జైట్లీ
- విమర్శలు, ప్రతివిమర్శలు

న్యూఢిల్లీ : రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం కుంభకోణంపై బుధవారం లోక్‌సభ దద్దరిల్లింది. అధికార, విపక్షాల మధ్య విమర్శలు-ప్రతివిమర్శలు, దాడి-ప్రతిదాడి జరిగింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మధ్య మాటల తూటాలు పేలాయి. రాహుల్ ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి బదులు జైట్లీ ఎదురుదాడికి దిగారు. గతంలో కాంగ్రెస్ కుంభకోణాలను పదేపదే ప్రస్తావించారు. చివరికి గందరగోళం చెలరేగడంతో సభ వాయిదా పడింది. రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందంపై లోక్‌సభలో చర్చ జరిగింది. రాహుల్‌గాంధీ చర్చను ప్రారంభిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోడీపై నిప్పులు చెరిగారు. విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే మోడీ పార్లమెంటుకు రావడం లేదని రాహుల్ ఘాటుగా నిందించారు. ప్రధాని తన గదిలో దాక్కున్నారని ఆరోపించారు. దీనికి అరుణ్‌జైట్లీ ఎదురుదాడికి దిగారు. అబద్ధాలు మాట్లాడటమే రాహుల్‌కు తెలుసునని వ్యాఖ్యానించారు. అందుకే పదేపదే అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని నిందించారు. గత రక్షణ కుంభకోణాల కుట్రదారులే ఇప్పుడు నరేంద్రమోడీ ప్రభుత్వం వైపు వేళ్లు చూపుతున్నారని ప్రత్యారోపణ చేశారు. రాఫెల్ కుంభకోణంపై విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేయాలని రాహుల్‌గాంధీ డిమాండు చేశారు. రాఫెల్ ఒప్పందంపై గోవా మంత్రి చేసిన వ్యాఖ్యలతో కూడిన ఆడియోను సభలో ప్రదర్శించడానికి అనుమతివ్వాలని రాహుల్ కోరగా అందుకు స్పీకర్ సుమిత్రా మహాజన్ నిరాకరించారు. ఈ ఆడియో సీడీ ఆరోపణను జైట్లీ కొట్టిపారేశారు.

'మీ ప్రియమిత్రుడు అనిల్ అంబానీకి ఈ ఒప్పందాన్ని ఎందుకు కట్టబెట్టారు? దీనివల్ల రూ.30వేల కోట్లు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది నిజం కాదా? పార్లమెంటుకు వచ్చి విపక్షాల ప్రశ్నలను ఎదుర్కొనే ధైర్యం కచ్చితంగా ప్రధానికి లేదు. అందులో ఎలాంటి అనుమానం లేదు. మోడీ తన గదిలో దాక్కున్నారు. ఏఐఏడీఎంకే సభ్యులను అడ్డుపెట్టుకొని రక్షణమంత్రి నాటకాలాడుతున్నారు. రాఫెల్‌పై చర్చ జరగకుండా అన్నాడీఎంకే సభ్యులు సభలో గందరగోళం సృష్టిస్తున్నారు' అని రాహుల్ నిశిత విమర్శలు చేశారు. దీనికి జైట్లీ స్పందిస్తూ రాఫెల్ ఒప్పందంపై సుప్రీంకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ ఒప్పందం గురించి ఇక మాట్లాడేదేమీ లేదని సుప్రీం స్పష్టం చేసిందన్నారు. 'నిజాలు మాట్లాడటం సహజంగా కొంతమందికి ఇష్టం ఉండదు. రాఫెల్‌పై గత ఆరుమాసాలుగా పార్లమెంటు లోనూ, బయటా ఇదే అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఆయనకు అబద్ధాలు మాట్లాడటం వారసత్వంగా వచ్చింది. గతంలోనూ ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడుతో మాట్లాడానని రాహుల్ చెప్పడం సత్యదూరం. రాహుల్ ప్రకటనను ఫ్రెంచ్ ప్రభుత్వం ఖండించింది' అని జైట్లీ చెప్పుకొచ్చారు. రాఫెల్‌పై సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించినా రాహుల్ అదే ప్రచారం చేయడం తమకు బాధ కలిగించిందని జైట్లీ అన్నారు.

అంతకుముందు రాహుల్ మాట్లాడుతూ 'రాఫెల్ వ్యవహారంపై జేపీసీ వేయాల్సిందే. భయపడవద్దని బీజేపీ నాయకులకు చెబుతున్నాను. మహా అయితే వాస్తవాలు బయటికి వస్తాయి. రాఫెల్ ఒప్పందానికి సంబంధించిన మొత్తం విధానాన్ని మోడీ పక్కదారి పట్టించారు. తన అనుంగు మిత్రుడు అనిల్ అంబానీకి రూ.30వేల కోట్లు లబ్ధి చేకూర్చారు. ఈ విషయం దేశం మొత్తానికి తెలుసు. ప్రధానమంత్రికి తెలుసు' అని వివరించారు. 'ప్రధాని సభకు రావాలి. విపక్ష సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. యావత్ దేశం మోడీ వైపే వేలుచూపుతుంది' అని రాహుల్ అన్నారు. దీనికి జైట్లీ స్పందిస్తూ గాంధీ కుటుంబంపై ఎదురుదాడి చేశారు. కొంతమంది నాయకులు, వారి కుటుంబాలకు డబ్బులకు సంబంధించిన అంశాలే తెలుస్తాయని, దేశ భద్రత వారికి పట్టదని వ్యాఖ్యానించారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్, నేషనల్ హెరాల్డ్ కేసులను జైట్లీ ప్రస్తావించారు. కాంగ్రెస్ నాయకత్వంపై దాడికి ఒట్టావియో ఖత్రోచీ పేరును సైతం బయటికి లాగారు. జైట్లీ మాట్లాడుతుండగా కాంగ్రెస్ సభ్యులు ఆందోళనకు దిగారు. పేపర్ రాకెట్లు విసిరారు. దీనిపై స్పీకర్ సుమిత్రా మహాజన్ సభ్యులను హెచ్చరించారు. కొత్త సంవత్సరం రోజు మోడీ ఇచ్చిన ఇంటర్వ్యూను ప్రస్తావిస్తూ రాఫెల్‌కు సంబంధించి తనకు వ్యతిరేకంగా ఎలాంటి ఆరోపణ లేదని మోడీ చెప్పడాన్ని రాహుల్ తప్పుబట్టారు. రాఫెల్‌పై యావత్ దేశం మోడీని ప్రశ్నిస్తోందని చెప్పారు. గంటన్నర సేపు ఇంటర్వ్యూ ఇచ్చిన మోడీ..రాఫెల్ వివాదంపై అడిగిన ఒక్క ప్రశ్నకూ సమాధానం చెప్పలేదని రాహుల్ అన్నారు. రాఫెల్ ఒప్పందంపై మోడీకి రాహుల్ అనేక ప్రశ్నలు సంధించారు. విమానం ధరను రూ.526 కోట్ల నుంచి రూ.1600 కోట్లకు పెంచడాన్ని రక్షణమంత్రిత్వశాఖ అధికారులు వ్యతిరేకించారా? లేదా అని నిలదీశారు. తన ప్రియమిత్రుడు అనిల్ అంబానీకి మోడీ రూ.30వేల కోట్లు కట్టబెట్టారని ఆరోపించారు.

జనవరి 1న
3,95,000 జననాలు

పుట్టిన ప్రతిశిశువుకు జీవించే హక్కు : యూనిసెఫ్ వెల్లడి



ఐరాస : ప్రపంచవ్యాప్తంగా కొత్తఏడాది రోజున 3లక్షల95వేల మంది శిశువులు జన్మించినట్లు యూనిసెఫ్ తెలిపింది. భారత్‌లో అత్యధికంగా 70వేల మంది పుట్టినట్లు రికార్డులు నమోదయ్యాయి. పుట్టిన వారిలో సగం మంది భారత్, చైనా, పాకిస్థాన్, అమెరికా, బంగ్లాదేశ్‌ల్లోనే ఉన్నట్లు అంచనా.. భారత్‌లో 69వేల944 మంది, చైనాలో 44,940 మంది, నైజీరియాలో 25,685, పాకిస్థాన్‌లో 15,112, ఇండోనేషియాలో 13,256, అమెరికాలో 11,086, డెమాక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో 10,053, బంగ్లాదేశ్‌లో 8,428 మంది పుట్టినట్లు తెలిసింది. డిసెంబరు 31 అర్ధరాత్రి 12 గంటలకు సిడ్నీలో 168 మంది , టోక్యోలో 310, బీజింగ్‌లో 605, మండ్రిడ్‌లో 166, న్యూయార్క్‌లో 317 మంది జన్మించినట్లు తెలుస్తోంది. నూతన ఘడియ ప్రారంభంలో పసిఫిక్‌లోని ఫిజీలో మొదటి శిశువు, చివరిన అమెరి కాలో పుట్టినట్లు రికార్డులు వివరిస్తున్నాయి. యూనిసెఫ్ పుట్టిన ప్రతిఒక్కరికీ బ్రతికే హక్కు కల్పించేలా తీర్మానం చేసింది. చాలా దేశాల్లో పిల్లలు పుట్టిన కొద్ది గంటల్లోనే మృతి చెందడం వల్ల యూనిసెఫ్ ఈ నిర్ణయం తీసుకుంది. 2017 నివేదికల ప్రకారం పుట్టిన రోజునే ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మంది చనిపోగా, 2.5లక్షలమంది నెలలో కన్నుమూశారని తెలుస్తోంది. నివారించగలిగే పరిస్థితులు ఉన్నప్పటికీ శిశువుల మృతిని అడ్డుకోలేకపోతున్నారని యూనిసెఫ్ తెలిపింది. కాన్పులో క్లిష్టపరిస్థితులు ఎదుర్కోవడం, నెలలు నిండకుండా పుట్టడం న్యుమోనియా వంటి వ్యాధులు బారిన పడటం వల్ల చాలా మంది నవజాత శిశువులు మృత్యువును చేరుకుంటున్నట్లు ఆ సంస్థ తెలిపింది. 2019వ సంవత్సరాన్ని శిశుహక్కుల 30వ వార్షికోత్స వంగా యూనిసెఫ్ ప్రకటిస్తూ, ఆరోగ్యం పొందే హక్కును ప్రతి శిశువుకూ కల్పిస్తోంది. అయితే ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదు. ఐదేళ్లలోపు పిల్లల్లో 47 శాతం మంది మృతి చెందుతున్నట్లు గణాంకాలు వివరిస్తున్నాయి.' ప్రతి శిశువు జీవించాలి అనే ప్రచారాన్ని యూనిసెఫ్ చేపట్టింది. తల్లీబిడ్డలకు ఆరోగ్యాన్ని ప్రసాదించడం కోసం ప్రతిదేశం నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను చేపట్టనున్నాయి. ఇందుకోసం శుద్ధతాగునీరు, విద్యుత్, కాన్పుసమయంలో నైపుణ్యం గల ఆరోగ్య కార్యకర్త, ఔషధాల సరఫరా, గర్భిణిగా ఉండగా ఆరోగ్య సంరక్షణకు మందుల సరఫరా, గర్భధారణ యువతులకు నాణ్యమైన ఔషధాలు, ఆరోగ్య సేవలను అందించాలని ఆయా దేశాలకు యూనిసెఫ్ ఆదేశాలు జారీ చేసింది.

పొత్తులపై ఏం చేద్దాం?

- బెంగాల్‌లో కాంగ్రెస్ నేతల తర్జనభర్జన
- సీపీఎంతో పొత్తుకు మెజారిటీ సానుకూలం
- ఒంటరిగా పోటీచేద్దామంటున్న మరోవర్గం
- రాహుల్‌దే తుది నిర్ణయమంటున్న నేతలు



కోల్‌కతా : పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ నాయకుల్లో గందరగోళం ఏర్పడింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో ఒంటరిగా పోటీ చేయాలా? లేక సీపీఎంతో జత కట్టాలా? అనే విషయంపై తర్జనభర్జన పడుతున్నారు. రాష్ట్రంలోని మెజారిటీ కాంగ్రెస్ నాయకులు సీపీఎంతో కలిసి నడవాలని కోరుకుంటున్నట్టు ఆ పార్టీ సీనియర్లు చెబుతున్నారు. మరోవర్గం మాత్రం ఒంటరిగానే పోటీచేయాలని గట్టిగా వాదిస్తున్నారని ఓ నాయకుడు చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో పొత్తులపై తుది నిర్ణయం ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీసుకుంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పశ్చిమబెంగాల్‌లో బలమైన శక్తిగా ఉన్నప్పటికీ తృణమూల్ కాంగ్రెస్ ముందు సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్‌ఫ్రంట్ కొంతబలహీనపడిందని, అయినా రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిస్టులు సంస్థాగతంగా పటిష్టంగానే ఉన్నట్టు కాంగ్రెస్ భావిస్తున్నది. సీపీఎంతో సీట్ల సర్దుబాటు చేసుకోవాలని పార్టీలోని ఓ వర్గం బలంగా ఆకాంక్షిస్తోందని, ఆ వర్గం మెజారిటీగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సమన్వయ కమిటీ చైర్మన్ ప్రదీప్ భట్టాచార్య బుధవారం పీటీఐకి చెప్పారు. ఒంటరిగా పోటీ చేయాలన్న వర్గం సైతం ఉందని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరిం చాల్సిన వ్యూహంపై నిర్ణయం తీసుకోవడానికి, తమ అభిప్రాయాన్ని పార్టీ అధిష్టానానికి తెలపడానికి ఈ నెలలో సమావేశమవుతామని పేరు వెల్లడించదానికి ఇష్టపడని మరో సీనియర్ నేత పీటీఐకి తెలిపారు. పొత్తులపై భిన్నాభిప్రాయాలు ఉన్నందున పార్టీ నాయకులంతా సమావేశం కావాలని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. గత నెలలో పీసీసీ చీఫ్ సొమెన్ మిత్రా, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జితో రాహుల్‌గాంధీ సమావేశమయ్యారు. పార్టీ పటిష్టతపై దృష్టి సారించాలని రాహుల్ దిశానిర్దేశం చేశారు. సీట్ల సర్దుబాటుపై సీపీఎం నాయకులతో పార్టీ రాష్ట్ర అగ్రనాయకులు ఇప్పటికే సంప్రదింపులు ప్రారంభించారు. మొత్తం 42 సీట్లకుగాను 18-20 సీట్లలో పోటీ చేయాలని కాంగ్రెస్ కోరుకుంటున్నది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు రాష్ట్రంలో నాలుగు ఎంపీ సీట్లు ఉన్నాయి. పార్టీని పటిష్టమంతం చేయాలని రాహుల్ ఆదేశించినట్టు మరో నాయకుడు తెలిపారు. పొత్తులపై తుది నిర్ణయాన్ని రాహుల్ రాష్ట్ర నాయకత్వాన్ని వదిలేశారని, దీనిపై రాష్ట్ర పార్టీయే నిర్ణయం తీసుకుంటుందని ఆయన స్పష్టంచేశారు. అయితే, రాష్ట్రంలో తాము ఒంటరిగా పోటీచేయాలా? లేక లెఫ్ట్‌ఫ్రంట్‌తో పొత్తు పెట్టుకోవాలా అనే నిర్ణయాన్ని ఇంకా అధిష్టానానికి చెప్పలేదన్నారు. మరోవైపు, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బెంగాల్‌లో బీజేపీ వ్యతిరేక, తృణమూల్ వ్యతిరేక ఓట్లు చీలకుండా తమ పార్టీ ప్రయత్నిస్తుందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇటీవల కోల్‌కతాలో ప్రకటించారు. 2019లో తమ పార్టీ మూడు సూత్రా లతో ముందుకు పోతుందని ఏచూరి తెలిపారు. బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించడం, సీపీఎం, ఇతర వామపక్ష శక్తుల బలాన్ని పార్లమెంటులో పెంచుకోవడం, కేంద్రంలో ప్రత్యామ్నాయ లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం తమ లక్ష్యమని స్పష్టంచేశారు. ఇంకా సమయం ఉన్నందున ఏమి జరుగుతుందో వేచిచూద్దామని ఏచూరి పేర్కొన్నారు. ఈ నెలలో ఏచూరి, రాహుల్ సమావేశం కానున్నం దున ఓ సానుకూల పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని కాంగ్రెస్, సీపీఎం రాష్ట్ర నాయకులు వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం టీఎంసీకి 34, కాంగ్రెస్‌కు నాలుగు, సీపీఎం, బీజేపీకి రెండేసి సీట్లు ఉన్నాయి. సీపీఎంతో సీట్ల సర్దుబాటుకు సంబంధించి మూడంచెల వ్యూహాన్ని కాంగ్రెస్ రూపొందించుకున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అందులో మొదటిది కాంగ్రెస్, సీపీఎం గెలుచుకున్న ఆరు ఎంపీ నియోజకవర్గాలను పక్కన పెట్టడం, రెండోది...మిగిలిన 34 సీట్లపై ప్రాథమిక చర్చలు జరపడమని కాంగ్రెస్ నాయకుడు వెల్లడించారు. మూడోది...బలాలకనుగుణంగా కాంగ్రెస్, సీపీఎం సీట్లు సర్దుబాటు కేసుకోవడం, ఆ తర్వాత లెఫ్ట్‌ఫ్రంట్ మిత్రపక్షాలు ఫార్వర్డు బ్లాక్, సీపీఐ, ఆర్‌ఎస్‌పీలకు సీట్లు కేటాయించడమని పేర్కొన్నారు.

యూపీలో అక్రమ ఆయుధాల ఫ్యాక్టరీ గుర్తింపు

ముజఫర్‌నగర్ : అక్రమంగా ఆయుధాలను తయారుచేసే ఫ్యాక్టరీని యూపీ పోలీసులు గుర్తించి, ఒకరిని అరెస్టు చేసినట్టు అధికారులు బుధవారం తెలిపారు. మంగళవారం తిటావీ పోలీసుస్టేషన్ పరిధిలోని చటేలా గ్రామంలో ఈ ఫ్యాక్టరీని గుర్తించినట్టు వెల్లడించారు. నాలుగు పిస్టళ్లు, ఏడు పిస్టల్ బారల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఎస్‌పీ సుధీర్ కుమార్ చెప్పారు. ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు నిసార్ అనే వ్యక్తిని అరెస్టు చేయగా మరొకడు పరారైనట్టు వెల్లడించారు.

మీరంతా బయటకు వెళ్లండి

- ఏఐఏడీఎంకే, డీఎంకే సభ్యులకు వెంకయ్య ఆదేశం
- కావేరి అంశంపై దద్దరిల్లిన రాజ్యసభ
- కొనసాగిన వాయిదాల పర్వం



న్యూఢిల్లీ : కావేరి అంశంపై బుధవారం రాజ్యసభ దద్దరిల్లింది. ఏఐఏడీఎంకే, డీఎంకే సభ్యులు వెల్‌లోకి ప్రవేశించి పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తమ నిరసన తెలిపారు. సభ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో వారిని సభ నుంచి వెళ్లిపోవాలంటూ చైర్మన్ వెంకయ్య నాయుడు ఆదేశించారు. సమావేశం ప్రారంభమైనప్పటి నుంచి తమిళ పార్టీల సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. ఈ క్రమంలో సభ మధ్యాహ్నం రెండుసార్లు వాయిదా పడింది. తిరిగి 3గంటలకు సమావేశమైన తర్వాత కూడా సభ కార్యకలాపాలు జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేసిన వెంకయ్య 255 నిబంధనను అమలు చేశారు. రెండు పార్టీలకు చెందిన సుమారు 12 మంది సభ్యులను సభ నుంచి బహిష్కరించారు. నిబంధన 255 ప్రకారం రాజ్యసభ చైర్మన్ ఏదేని సభ్యుడి ప్రవర్తన నేపథ్యంలో వారిని సభ నుంచి బయటకు పంపేయవచ్చు. ఇలా పంపివేసిన సభ్యుడు ఆ రోజుకు సభ కార్యకలాపాలకు దూరంగా ఉండాల్సి ఉంటుంది. మధ్యాహ్నం సభ ప్రారంభమైన తర్వాత ఏఐఏడీఎంకే సభ్యులు వెల్‌లోకి ప్రవేశించి 'మాకు న్యాయం కావాలి... కావేరిపై డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలి. తమిళనాడు హక్కులను నిరాకరించవద్దు' అంటూ నినదించారు. కేంద్రప్రభుత్వం తమిళనాడును అవమానించిందని ఓ సభ్యుడు అన్నారు. కావేరి అంశంపై జలవనరుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని మాట్లాడనివ్వాలంటూ తమిళనాడు సభ్యులకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ గోయల్ సూచించినా ఫలితం లేదు. సంబంధిత మంత్రిని సభకు పిలిపించామని, ఆయనను మాట్లాడనివ్వాలని వెంకయ్య కోరినా సభ్యులు వినిపించుకోలేదు. ఏఐడీఎంకేతో పాటు డీఎంకేకు చెందిన నలుగురు సభ్యులు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్య మాట్లాడాలని గడ్కరికి వెంకయ్య సూచించారు. అదే విధంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం 2018, డిసెంబరు 19న జమ్మూకాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించే తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కోరారు. 2018, డిసెంబరు 28న లోక్‌సభ ఆమోదం పొందిన తీర్మానాన్ని సింగ్ సభ ముందు ఉంచారు. ఏఐఏడీఎంకే, డీఎంకే సభ్యుల ఆందోళన నడుమే కార్యకలాపాలను చైర్మన్ నిర్వహించారు. కాశ్మీర్‌కు సంబంధించిన తీర్మానంపై చర్చను ప్రారంభించాలని సభలో ప్రతిపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్‌ను కోరినప్పటికీ సభను చైర్మన్ కొంతసేపు వాయిదా వేశారు. అంతకుముందు ఏఐఏడీఎంకే, డీఎంకే సభ్యులను సభ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారు. తిరిగి సమావేశమైన తర్వాత డిప్యూటీ చైర్మన్ హరివంశ్ కూడా సంబంధిత సభ్యులను బయటకు వెళ్లమన్నారు కానీ వారు తమ ఆందోళనను కొనసాగించారు. ఇలాంటి పరిస్థితుల్లో సభను వాయిదా వేయక తప్పదంటూ మధ్యాహ్నం 3 గంటల వరకు సభను వాయిదా వేశారు. మళ్లీ సమావేశం అయినప్పుడు కూడా ఏఐఏడీఎంకే, డీఎంకే సభ్యులు వెల్‌లోకి ప్రవేశించి నినాదాలు కొనసాగించారు. దీంతో సభను రేపటికి వాయిదా వేయడం తప్ప మరో గత్యంతరం లేదని హరివంశ్ అన్నారు. సభను వాయిదా వేశారు.

ఎంపీలో వందేమాతరంపై వివాదం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో వందేమాతరం వివాదం తలెత్తింది. రాష్ట్ర సచివాలయంలో ప్రతి నెల మొదటి పని దినం రోజున వందేమాతర గీతం ఆలపిస్తారు. ఈ సంప్రదాయాన్ని గతంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే రాష్ట్రంలో నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంప్రదాయానికి ప్రస్తుతం స్వస్తి చెప్పింది. ఈ ఆదేశాలను సరికొత్తగా అమలు చేసేందుకు ప్రస్తుతానికి నిలిపేశామని రాష్ట్ర ముఖ్యమంత్రి కమల్‌నాథ్ వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో వందేమాతరం పాడకపోవడంతో బీజేపీ నేతలు విమర్శలకు దిగారు. వందేమాతర గీతం దేశభక్తికి నిదర్శనమని గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. దీనిపై ట్విటర్‌లో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వందేమాతరం పాడే సంప్రదాయాన్ని కాంగ్రెస్ కొనసాగించాలని డిమాండు చేశారు. 'వందేమాతరం పాడడం వల్ల ప్రజల్లో దేశభక్తి పెరుగుతుంది. అలాంటి సంప్రదాయాన్ని కాంగ్రెస్ నిలిపేయడం నిజంగా దురదృష్టకరం. ఈరోజు వందేమాతరం పాడలేదు. వచ్చిపోయే ప్రభుత్వాలు కాబట్టి బహుశా కాంగ్రెస్ మర్చిపోయి ఉంటుంది. దేశం, దేశభక్తి కంటే ముఖ్యమైనవి ఏవీ లేవు. ప్రతి మంత్రివర్గ సమావేశానికి ముందు వందేమాతరం పాడాలి. సచివాలయంలో కూడా ప్రతి నెల మొదటి రోజున పాడాలి ' అని చౌహాన్ ట్వీట్ చేశారు. 'మా పార్టీకి చెందిన మొత్తం 109 మంది ఎమ్మెల్యేలు జనవరి 7న భోపాల్‌లోని మధ్యప్రదేశ్ సచివాలయం వద్ద 'వందేమాతరం' గేయం ఆలపిస్తారు. ఆ తర్వాతే మా ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారం చేస్తారు..." అని పేర్కొన్నారు. కాగా ఒక్కరోజు వందేమాతరం పాడినంత మాత్రాన ఎవరూ దేశభక్తులు కాలేరనీ... జాతీయ భావం అనేది హృదయాల్లో ఉండాలని సీఎం కమల్‌నాథ్ పేర్కొన్నారు. ఈ నెల 7 నుంచి మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అదేరోజు కొత్త ఎమ్మెల్యేలంతా ప్రమాణం చేయనున్నారు.

యాచకుడి చెక్కకాలులో రూ.96వేలు

బెంగళూరు : ఓ వికలాంగ యాచకుడి చెక్కకాలిలో రూ.96వేల నగదు కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన షరీఫ్ సాబ్ (75) బెంగళూరులోని కంటోన్మెంట్ రైల్వే స్టేషన్ సమీపంలో యాచిస్తూ జీవనం గడుపుతున్నాడు. అతడికి ఓ కాలు లేదు. గ్యాంగ్రీన్ రావడంతో కాలు తీసివేశారు. దాంతో చెక్కతో తయారు చేసిన కృత్రిమ కాలుతో నడిచేవాడు. ఇటీవల అతడు చనిపోయాడు. ఈ సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. చెక్కకాలు బరువుగా ఉండడంతో లోపల ఏమైనా ఉందా అని తరచి చూశారు. నోట్లచుట్టలు కనిపించాయి. లెక్కిస్తే దాదాపు 96వేల రూపాయలు వెలుగు చూశాయి. దీంతో హైదరాబాద్‌లోని మృతుడి సోదరికి పోలీసులు వర్తమానం పంపారు.

మాజీ ఎమ్మెల్యే అరెస్టు...!

న్యూఢిల్లీ : నూతన సంవత్సర వేడుకల్లో తప్పతాగి.. ఓ మహిళపై కాల్పులు జరిపిన జేడీయూ మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అరెస్టు చేశారు. దక్షిణ ఢిల్లీలోని వసంత్ కుంజ్‌లోని మాజీ ఎమ్మెల్యే రాజు సింగ్ ఫామ్ హౌజ్‌లో సోమవారం రాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి తన తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో అర్చన గుప్తా (42) అనే ఆర్కిటెక్ట్ తీవ్రంగా గాయపడింది. తీవ్ర గాయాలపాలైన అర్చన గుప్తాను ఫోర్టిస్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటనపై అర్చన భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజు సింగ్‌ను అరెస్టు చేశారు. రాజు సింగ్‌పై ఇప్పటికే ఐదు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

గోవా సీఎం ఇంట్లో రాఫెల్ పత్రాలు..!?

న్యూఢిల్లీ: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన దస్తావేజులు గోవా సీఎం మనోహర్ పారికర్ బెడ్‌రూమ్‌లో ఉన్నాయని గోవా మంత్రి విశ్వజిత్ రాణే ఓ ఫోన్ కాల్‌లో వెల్లడించినట్లు కాంగ్రెస్ ఆరోపించింది. దానికి సంబంధించిన ఆడియోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. ఈ అంశాన్ని కాంగ్రెస్ ప్రతినిధి సుర్జేవాలా బుధవారం మీడియాతో వెల్లడించారు. పారికర్ మాటల్లో నిజం ఉందని, ప్రధాని మోడీ దీనికి సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండు చేసింది. గత వారం జరిగిన కేబినెట్ సమావేశంలో రాఫేల్ ఫైల్స్ గురించి పారికర్ ప్రస్తావించారని, అవి తన బెడ్‌రూమ్‌లో ఉన్నట్లు చెప్పారని మంత్రి రాణే తెలిపారు. ఓ వ్యక్తితో ఫోన్లో మాట్లాడుతూ మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. రాఫేల్ డీల్‌కు సంబంధించిన సీక్రెట్లు పారికర్ వద్ద ఉన్నాయి కాబట్టే ఆయన ఆరోగ్యం సరిగా లేకున్నా సీఎం పదవి నుంచి తొలగించడం లేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. రాఫేల్‌పై కాంగ్రెస్ అబద్ధాలు చెబుతున్నదని బీజేపీ విమర్శించింది.

ఆ ఆడియోక్లిప్పు కాంగ్రెస్‌దే : రాణే

రాఫెల్ కేసులో కాంగ్రెస్ ప్రదర్శించిన ఆడియో క్లిప్పు ఆపార్టీ రూపొందించిందేనని విశ్వజిత్ రాణే విమర్శించారు. రాఫెల్ విషయంలో ఎవరితోనూ సంభాషించలేదని ఆయన అమిత్‌షాకు లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దీనిపై దర్యాప్తుకు ఆదేశించాలని ముఖ్యమంత్రి మనోహర్ పారికర్‌కు కూడా లేఖ రాశానన్నారు. కాంగ్రెస్ ఆ ఆడియోను కుట్రతో రూపొందించిందని, రాఫెల్ విషయంలో ఎవరితో, ఎప్పుడూ చర్చలు జరపలేదని రాణే స్పష్టం చేశారు. రాఫెల్ విషయంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోడీపై కాంగ్రెస్ ఒత్తిడి తీసుకువచ్చింది. ఈ కేసులో గోవా బీజేపీ మంత్రి ఉండటం వల్లే వెనక్కి తగ్గుతున్నారని కాంగ్రెస్ ఆరోపించడంతో ఆయన పై విధంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాల బుధవారం మాట్లాడుతూ రాఫెల్‌పై రాణేకు మరొక వ్యక్తికి చెందిన ఆడియో క్లిప్పులను బయటపెట్టారు.

మైనింగ్‌పై మోడీకి మంత్రి వినతి

పనాజీ : మైనింగ్ విషయంపై చర్చించేందుకు గోవా మంత్రి సుదిన్ ధవాలికర్ ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాశారు. ఇనుప ఖనిజ తవ్వకాలను మళ్లీ ప్రారంభించేందుకు జరిగిన ఆలస్యంపై ఆయన ప్రధానితో చర్చించనున్నారు. మనోహర్ పారికర్ ప్రభుత్వంలో ఆయన అందరికంటే సీనియర్. గనుల తవ్వకాల్లో ఏర్పడిన ప్రతిష్టంభనను కేంద్రం పరిష్కరిస్తుందని, మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ నాయకుడు దవాల్కర్ తెలిపారు. ఆ పార్టీ గోవా బీజేపీకి మిత్రపార్టీగా ఉంది. ప్రభుత్వానికి మైనింగ్ ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. రాష్ట్రంలోని 88 మైనింగ్ గనులను సుప్రీంకోర్టు రద్దు చేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో మైనింగ్ చట్టానికి సవరణ చేపట్టడం ద్వారా లీజులను పొడిగించవచ్చని దవాల్కర్ అన్నారు. మైనింగ్ శాఖకు చెందిన గోవా మైనింగ్ పీపుల్స్ ఫ్రంట్ రాష్ట్రంలో మైనింగ్ కార్యకలాపాలను తిరిగి తెరిపించాలని న్యూఢిల్లీలో మూడురోజుల ఆందోళన నిర్వహించింది.

మంజూ వర్మ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

బెగూసరాయ్ : మాజీ మంత్రి మంజూ వర్మ బెయిల్ పిటిషన్‌ను బీహార్ కోర్టు బుధవారం తిరస్కరించింది. ఆయుధాల చట్టం కింద కేసులో ఆమె ప్రస్తుతం జైల్లో ఉన్న విషయం తెలిసిందే. ముజఫర్‌పూర్ షెల్టర్‌హోంలో సెక్స్ స్కాండల్‌తో సంబం ధాలున్నట్టు ఆరోపణలు రావడంతో సీబీఐ ఆమె ఇంటిపై దాడులు జరుపగా భారీఎత్తున మందుగుండు సామగ్రి లభించడంతో గతేడాదిలో వర్మపై కేసు నమోదైంది. వర్మ పిటిషన్‌ను అదనపు జిల్లా జడ్జి పియూష్ కమల్ దీక్షిత్ తిరస్కరించారు.

గవర్నర్ ప్రసంగాన్ని బహిష్కరించిన విపక్షాలు

చెన్నై : అసెంబ్లీ మొదటి సెషన్ ప్రారంభం సందర్భంగా తమిళనాడు గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ మర్యాదకపూర్వ ప్రసంగాన్ని డీఎంకే, దాని మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఐయూఎంఎల్ బహిష్కరించాయి. వణక్కం అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన గవర్నర్ నిరాడంబర జీవనశైలి గురించి మాట్లాడారు. ఈ క్రమంలో ఏదో చెప్పేందుకు స్టాలిన్ లేచి నిలబడగా ఆసీనులుకావాల్సిందిగా పురోహిత్ ఆయనను కోరారు. 'మీ స్థానంలో కూర్చోమని చేతులు జోడించి ప్రార్థిస్తున్నా' అంటూ స్టాలిన్‌నుద్దేశించి అన్నారు. అయితే మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానికి సంబంధించి అంశాలను స్టాలిన్ ప్రస్తావించగా ఆయా అంశాలపై ఇతర సభ్యులతో తర్వాత చర్చిద్దాం అని అంటూ గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. దీంతో స్టాలిన్ చిరునవ్వుతో వాకౌట్‌కు నేతృత్వం వహించారు.



ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

- లక్షల విలువ చేసే మిషన్లు స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): చిన్న పిల్లలు తినే ఆహార పదార్థాల తయారీ కేంద్రం పై టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజీవ్‌కుమార్ అధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. విజయవాడ కేఎల్‌రావు నగర్ ప్రాంతంలో గట్టుచప్పుడు కాకుండా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ నగరానికి చెందిన మాదాల ప్రవీణ్‌కుమార్ (37) కొంత కాలంగా కేఎల్‌రావు నగర్‌లో గోడౌన్‌ను అద్దెకు తీసుకుని ఎటువంటి అనుమతి లేకుండా, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోకుండా ఆరోగ్యానికి హానికలిగించే విధంగా ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారని చెప్పారు. పాచిపోయిన, అపరిశుభ్రత కలిగిన రేగు పళ్లు, ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, జామ్‌లను చిన్నపిల్లలు తినే తినుబండారాలలో కలిపి తయారు చేస్తున్నట్లు తెలిపారు. వాటిని ప్యాకెట్లు, ప్లాస్టిక్ డబ్బాలలో వేరు వేరు పేర్లతో ప్యాక్ చేసి విజయవాడ పరిసర ప్రాంతాలలో అమ్మకాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతనితో కలిసి గుమస్తాగా పనిచేస్తున్న ఇద్దరు కనకరాజు మల్లిఖార్జునరావు(40)తెల్లాకుల మణికంఠ(27)లను కూడా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి వద్ద నుంచి రూ.25లక్షల విలువైన మేకింగ్ మిషన్లు, 8గ్యాస్ సిలిండర్లు, ఎయిర్ కంప్రెషర్‌లు, తినుబండారాల ప్యాకెట్లు, ప్లాస్టిక్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ సురేష్‌రెడ్డి, టూటౌన్ ఎస్సై సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇగ్నో రీ రిజిస్ట్రేషన్ గడుపు పెంపు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) బీఏ, బీకాం, బీఎస్సీ, ఎం.ఎ, ఎంకాం, ఎంసీఏ, బీసీఏ కోర్సులకు రీ రిజిస్ట్రేషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు జనవరి 15 వరకు గడువు పొడిగించినట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సంచాలకులు డాక్టర్ దోనేపూడి రామాంజనేయ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఇగ్నో వెబ్‌సైట్ ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డులతో ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఎస్సీఎస్టీ విద్యార్థులకు ఆన్‌లైన్ ఫీజు చెల్లించిన తరువాత ఇగ్నో వెబ్ సైట్ ద్వారా ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రానికిగానీ, 0866-2565959 ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని శర్మ వెల్లడించారు.

శ్రమతో కూడిన విజయమే శాశ్వతం

అమరావతి బాలోత్సవం ప్రారంభ సభలో సీహెచ్‌వీ చౌదరి



విశాలాంధ్ర-విజయవాడ : శ్రమతో కూడిన విజయం మాత్రమే కలకాలం నిలబడుతుందని, అది మాత్రమే ఆనందాన్నిస్తుందని సహజ ఖనిజాల అభివృద్ధి శాఖ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్‌వీ చౌదరి అన్నారు. నగరంలోని చిగురుపాటి శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మూడు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే అమరావతి బాలోత్సవాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వీ చౌదరి మాట్లాడుతూ విజయం సాధించడానికి క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. క్రమశిక్షణ లేని విజయం తాత్కాలికమైనదేనని స్పష్టం చేశారు. క్రమశిక్షణతో పనిచేయడం వల్ల ప్రపంచంలో ఎంతో వెనకబడి ఉన్న దేశాలు ప్రగతి సాధించాయని చెప్పారు. ప్రాథమిక విద్య నుంచే పిల్లల్లో సృజనాత్మక బోధన జరగాలని, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్ విద్య విద్యార్థులలో ప్రతిభను ధ్వంసం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులను యంత్రాలుగా చూస్తున్నారని, వారిలో ఉన్న సృజనను గుర్తించడంలేదన్నారు. కార్పొరేట్ విద్యను తరిమికొట్టే వరకు బాలోత్సవ్ వంటి ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాఠశాల విద్యలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కరవైందన్నారు. కొత్తగూడెంలో 27 ఏళ్లుగా బాలోత్సవం నిర్వహిస్తున్న డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు మాట్లాడుతూ ఇలాంటి పిల్లల పండుగలు దేశమంతా వాడవాడలా జరగాలని ఆకాంక్షించారు. అవకాశమిస్తే పిల్లలు అద్భుతాలు సృష్టించగలరన్నారు. అమరావతి బాలోత్సవ్ కమిటీ అధ్యక్షులు ఎస్పీ రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో గౌరవాధ్యక్షులు చలవాది మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి కొండలరావు, కృష్ణా బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలమలశెట్టి నరసింహారావు, కాకినాడ బాలోత్సవ్ నిర్వాహకులు ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, కేవీ రమణారావు, కాట్రగడ్డ నారాయణ, ప్రొఫెసర్ విద్యా కన్నా తదితరులు పాల్గొన్నారు. బాలోత్సవ్ కోశాధికారి పిన్నమనేని మురళీకృష్ణ, జి.జ్యోత్స్న పర్యవేక్షించారు. సాయంత్రం జరిగిన ముగింపు సభలో కేఎల్ కాంతారావు రచించిన 'బాలలు-దేశభక్తి' అనే పుస్తకాన్ని చలవాది మల్లిఖార్జునరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, వి.మురళీమోహన్, కేఎల్ రాజు తదితర సాహిత్య, సాంస్కృతిక రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న బాబు

విశాలాంధ్ర - విజయనగరంపోర్ట్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను మోసంచేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నాలక్ష్మీ నారాయణ అన్నారు. విజయనగరం తోటపాలెంలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను తమవిగా చెప్పుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని అన్నారు. కేంద్రం అందచేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నాడని పేర్కొన్నారు. విభజన హామీలకు సంబంధించి కేంద్రం స్పష్టమైన వైఖరితో ఉందని అన్నారు. బాబు చెప్పిన ప్రతిమాటా అబద్ధమేనని అన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌కే కేంద్రం అధికనిధులను ఇచ్చిందని చెప్పారు.

జాతీయస్థాయిలో సంగీత కళాశాల శతజయంత్యుత్సవాలు

మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాలాంధ్రబ్యూరో - విజయనగరం : విజయనగరం మహారాజా సంగీత కళాశాల శతజయంతి ఉత్సవాలను వచ్చేనెల 3,4,5 తేదీల్లో రూ.2 కోట్ల వ్యయంతో అత్యంత ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. కళాశాల శతజయంతి ఉత్సవాలపై ఆయన విజయనగరం కలెక్టరేట్‌లో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయన వివిధ సంస్థలు, కళాశాల ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పురాతన, ప్రముఖ సంగీత కళాశాల విజయనగరం సంగీత కళాశాల ఒక్కటేనన్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రపతిని, ముఖ్యమంత్రిని ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను జాతీయస్థాయిలో నిర్వహించాలని, దేశ విదేశాల్లో ఉన్న సంగీత విద్వాంసులను, కళాశాల పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. ఉత్సవాల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని, వేలాది మంది వచ్చే అవకాశం ఉండటంతో కార్యక్రమాలను సంగీత కళాశాలకు బదులు బహిరంగ వేదికలపై ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉత్సవాల ఏర్పాట్లను తక్షణమే ప్రారంభించి, 20రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఉత్సవాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పట్టణంలోని 40 వార్డులకు కోటి రూపాయల చొప్పున మొత్తం రూ.40 కోట్ల అభివృద్ధి పనులకు కూడా అదేరోజు ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించాలని ఎంఎల్ఏ గీత కోరారు. మంత్రి ఆర్‌వీ సుజయ్‌కృష్ణ రంగారావు, కలెక్టర్ హరి జవహర్‌లాల్, జెడ్‌పీ ఛైర్మన్ డాక్టర్ శోభా స్వాతిరాణి, ఎంఎల్‌సీలు, ఎంఎల్ఏలు, అధికారులు పాల్గొన్నారు.

'జన్మభూమి'ని అడ్డుకున్న మహిళలు

- పెథాయ్ భృతికోసం డిమాండు
- మహిళల నిరసనలతో హోరెత్తిన సభ



విశాలాంధ్ర - కృత్తివెన్ను : తమకు న్యాయం చేయాలని మత్స్యకార మహిళలు నినదిస్తూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. కృష్ణాజిల్లా చినగొల్లపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించాల్సిన జన్మభూమి గ్రామ సభ గ్రామస్తుల నిరసనతో నిలిచిపోయింది. ప్రభుత్వం ప్రకటించిన పెథాయ్ తుపాన్ భృతిని ఎందుకు ఇవ్వలేదంటూ మత్స్యకార మహిళలు పెద్దఎత్తున నిరసనకు దిగటంతో గ్రామసభ రసాబాసగా మారింది. అధికారులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలను సైతం తీసేసి తమ నిరసనసుల తెలిపారు. గ్రామంలో కొంతమంది మత్స్యకారులకు తుపాను భృతిని ఇచ్చి మరికొన్ని కుటుంబాలకు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగేవరకూ గ్రామంలో సభను నిర్వహించనివ్వమని నిరసనను తెలిపారు. న్యాయం కోసం మత్స్యకార మహిళల నినాదాలతో సమావేశం దద్దరిల్లింది. మధ్యాహ్నం పడతడికలో జరిగిన గ్రామసభలో కూడా ఇదే విధంగా గ్రామస్తులు నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన తుపాను భృతిని గ్రామంలోని కొన్ని కుటుంబాలకు అందించి కొన్ని కుటుంబాలకు ఇవ్వకపోవడంపై గ్రామసభలలో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం గత నెల 19 తేదీన జారిచేసిన జీవో నెం 19 లో తుపాను ప్రభావిత గ్రామాలలో అన్ని కుటుంబాలకు తక్షణం భృతిని అందించాలని ఆదేశించినా అధికారులు నిర్లక్ష్యం వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తుపాను ప్రభావిత గ్రామాలలో తెల్ల, పింక్ రేషన్ కార్డులు ఉన్న అన్ని కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు పప్పు, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు కిలో చొప్పున, పంచదార అరకిలో ఇవ్వమని ఆ జీఓలో ప్రభుత్వం ఆదేశించింది. అయితే అధికార్లు మాత్రం మత్స్యకార గ్రామాలలో ఎంపిక చేసిన కొన్ని కుటుంబాలకు మాత్రమే భృతిని అందించడం వివాదానికి కారణమైంది. ప్రజలు ఎంతగా నిరసనకు దిగినా జన్మభూమి బృందం అధికారులు నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ప్రజల ఆగ్రహం మరింత పెరిగింది. ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ, రెవెన్యూ అధికార్లు పొంతనలేని సమధానాలు చెప్పడంతో ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు సైతం అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఒక దశలో ఎంపీడీఓ మీకు సమాధానం చెప్పాల్సిన పనిలేదంటూ ప్రజలపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమావేశంలో గందరగోళం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వలవల సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యులు ఒడుగు తులసీరావు, ప్రత్యేకాధికారి ఏవీఎస్ శ్రీనివాస్, ఏపీడీఓ ఎ శ్రీనాథ్‌స్వామి, ఉపాధ్యక్షులు తమ్ము మురళీ, ఏఎంసీ ఛైర్మన్ గుడిశేవ మహలక్ష్మి, మాజీ సర్పంచ్ కొక్కిలడ్డ బాపూజీ, సూరగాని బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. జన్మభూమి-మాఊరు కార్యక్రమానికి ప్రారంభం రోజునే అధికార్లు దాదాపు మూడు గంటలు ఆలస్యంగా 12 గంటల సమయంలో తాపీగా వచ్చారు.

ఏపీఐఐసీకి చుక్కెదురు!

భూ స్వాధీన యత్నాన్ని అడ్డుకున్న అటవీ అధికారులు



విశాలాంధ్ర - పెదవేగి : పోరాటాల గడ్డ అయిన రామసింగవరం ఈసారి రెండు ప్రభుత్వ శాఖల మధ్య యుద్ధానికి తెర తీసింది. దశాబ్దాలుగా భూపోరాటానికి సాక్ష్యంగా నిలిచిన రామసింగవరం, ఇప్పుడు అటవీ భూముల పరిరక్షణకు ఆ శాఖ అధికారులు పోరాటం చేయాల్సిన స్థితి కల్పించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారు. అయితే పరిశ్రమలకు కేటాయించేందుకు అనువైన ప్రభుత్వ భూములు మిగలకపోవడంతో ప్రభుత్వం అటవీ భూములను పరిశ్రమలకు కేటాయించాలని నిర్ణయించింది. రామసింగవరం అటవీ ప్రాంతంలోని 180 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖకు కేటాయించింది. ఆ శాఖ ఈ భూమిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివిధ పరిశ్రమలు నెలకొల్పేందుకు 300 గజాల చొప్పున కేటాయించి ప్లాట్లుగా విభజించింది. గజం 996 రూపాయల చొప్పున రేటు కూడా నిర్ణయించింది. పరిశ్రమలు స్థాపించాలనుకునేవారు ఏలూరులోని సత్రంపాడు ఏరియాలో ఉన్న ఏపీఐఐసీ కార్యాలయంలో సంప్రదించాలని పత్రికలలో ప్రకటనలు కూడా జారీ చేసింది. ఇక్కడివరకు కాగితాలపై అంతా హుషారుగా సాగింది.

రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ (ఏపీఐఐసీ) ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు యత్నించగా, అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఏపీఐఐసీ పేర్కొంటున్న భూములు అటవీశాఖకు చెందినవని వాదించారు. రెవెన్యూశాఖ తమకు చేసిన కేటాయింపులను సమర్పించిన ఏపీఐఐసీకి చుక్కెదురైంది. అటవీ భూమి పొందాలంటే కేంద్ర ప్రభుత్వం నుండి సెంట్రల్ సర్వే ఆఫ్ ఇండియా అనుమతిని రెవెన్యూశాఖ పొందాల్సిఉందని అటవీ అధికారులు స్పష్టం చేశారు. ఢిల్లీ నుండి అటువంటి అనుమతిని రెవెన్యూ శాఖ చూపిస్తే ఈ భూమిని ఏపీఐఐసీకి కేటాయించుకోవచ్చని అటవీ అధికారులు స్పష్టం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా ఈ భూముల వద్ద అటవీ శాఖ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది.

ఈ భూమి అటవీశాఖది... ఈ భూమిని ఎవరూ ఆక్రమించ రాదని, ఎటువంటి తవ్వకాలు జరపరాదని, అటవీశాఖ ఉత్తర్వులను ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసింది. దీంతో ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలు అయోమయంలో పడ్డారు.

దీనిపై అటవీ అధికారులను విశాలాంధ్ర ప్రతినిధి వివరణ కోరగా, రెవిన్యూ అటవీశాఖ అధికారుల నేతృత్వంలో జాయింట్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటువంటి సర్వేలు గతంలో కూడా మూడు సార్లు జరిగాయని, ఆ సర్వేలలో కూడా 182.50 ఎకరాల భూమి అటవీశాఖకు చెందినదేనని తేలిందని వివరణనిచ్చారు. గతంలో ఇదే భూమిలో వన సంరక్షణ సమితి పథకం ద్వారా మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ భూమి అటవీ శాఖదని తేలిన తర్వాత భూమి అన్యాక్రాంతం కాకుండా సరిహద్దులు నిర్ణయిస్తూ యంత్రాల ద్వారా గాడి నిర్మించామన్నారు. సెంట్రల్ సర్వే ఆఫ్ ఇండియా అనుమతులు తమకు అందనంతవరకు ఆ భూమి అటవీశాఖదేనని అటవీ అధికారులు స్పష్టం చేశారు.



8న 'తానా రాజధాని కళోత్సవ్'

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో విజయవాడ, మొగల్రాజపురంలోని సిద్దార్థ ఆడిటోరియంలో ఈ నెల 8న 'తానా రాజధాని కళోత్సవం' పేరుతో జానపద కళా రూపాలను ప్రదర్శించనున్నట్లు తానా ప్రధాన కార్యదర్శి లావు అంజయ్య చౌదరి తెలిపారు. మొగల్‌రాజపురంలోని సిద్దార్థ ఆడిటోరియంలో బుధవారం కళోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్క రించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తానా గత 42 సంవత్సరాలుగా వివిధ సేవా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తు న్నదన్నారు. జూలై 4వ తేదీన వాషింగ్టన్‌లో తానా ద్వైవార్షిక మహాసభలు జరుగనున్నాయని తెలిపారు. దీనికి ముందుగా తానా చైతన్య స్రవంతి పేరుతో తెలుగు రాష్ట్రాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగానే సిద్దార్థ ఆడిటోరియంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహి స్తున్నామని చెప్పారు. తానా రాజధాని కళోత్స వంలో భాగంగా బుర్రకథ, నాటికలు, డప్పులు, జానపదాల పాటలు, చిందులు ఉంటాయని తెలిపారు. ఈ క్రమంలోనే కొంత మంది కళా కారులను కూడా సత్కరించనున్నట్లు తెలిపారు. తానా ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలలో 220 మిలియన్ డాలర్లు ఖర్చుచేసి వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. యంగ్ ఇండియన్స్ (అమరావతి చాప్టర్) ఛైర్ తరుణ్ కాకాని పాల్గొన్నారు.

బాబు శ్వేతపత్రాలు సత్యదూరం : ఉండవల్లి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన 10 శ్వేత పత్రాలు సత్యదూరంగా ఉన్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను పోలవరంపై శ్వేతపత్రం అడుగగా ముఖ్యమంత్రి అది తప్ప మిగతావి విడుదల చెయ్యడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలకు నిజాలు చెప్పాలన్న ఉద్దేశంతోనే శ్వేత పత్రాలు విడుదల చేస్తారని, కానీ ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రాలు నమ్మశక్యంగా లేవన్నారు. పరిశ్రమలపై విడుదల చేసిన శ్వేతపత్రంలో వచ్చాయని చెబుతున్నవాటిలో కనీసం 10 శాతం పరిశ్రమలు కూడా రాష్ట్రానికి రాలేదని, ఆ పరిశ్రమలు ఎక్కడ స్థాపించారో చెబితే తన సొంత ఖర్చులతో వెళ్లి చూసి వస్తానని ప్రభుత్వానికి ఉండవల్లి సవాల్ విసిరారు. తన విశ్లేషణ తప్పు అయితే ప్రభుత్వానికే మంచి పేరు వస్తుందని కాబట్టి కనీసం ప్రభుత్వ అధికారినైనా తన వెంట వచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇవ్వాలన్నారు. పోలవరం నుంచి మే నెలలో నీళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలాడుతున్నారన్నారు. పోలవరం పనుల్లో 60 సిని పూర్తిగా వక్రీకరించారని ..60సి ని అడ్డం పెట్టుకుని వేలకోట్ల రూపాయల పనులు అడ్డదిడ్డంగా ఇచ్చేస్తున్నారని ఉండవల్లి ఆరోపించారు. శ్వేత పత్రాలపై చర్చ ప్రారంభించాలని చంద్రబాబు ఉటంకించారని, దానికి తాను సిద్ధమన్నారు. ప్రజలకు పరిపాలనపై అనుమానం రాకుండా చేసుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉందని, శ్వేతపత్రంలో వెల్లడించిన ఎల్ఈడీ బల్బుల కాంట్రాక్టులోనే భారీ దోపిడీ కనిపిస్తోందన్నారు.

స్పోర్ట్స్ కోడ్‌కు అనుగుణంగా లేని క్రీడాసంఘాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : స్పోర్ట్స్ కోడ్ అమలు కోసం రాష్ట్రంలో క్రీడాసంఘాలకు ఇచ్చిన గడువు జీవో 490 గత డిసెంబరు 31తో ముగిసిందని, దాంతో గుర్తింపు లేని, స్పోర్ట్స్ కోడ్‌కు అనుగుణంగా లేని క్రీడాసంఘాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ ఒలింపిక్ సంఘం కోశాధికారి కేపీరావు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శాప్‌ను డిమాండు చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ కోడ్ పాటించకుండా కొనసాగుతున్న క్రీడాసంఘాల వల్ల అక్రమాలకు ప్రభుత్వమే అవకాశం ఇచ్చినట్లవుతుందన్నారు. ఇప్పటికైనా శాప్ గుర్తింపులేని, నిబంధనలు పాటించని క్రీడాసంఘాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్థిక వృద్ధిలో ఏపీ

ప్రభుత్వ చర్యలతో పెరుగుతున్న తలసరి ఆదాయం

అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంత, పటిష్ట చర్యలతో ఆర్థికరంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. రూపాయి లేకున్నా వ్యూహాత్మకంగా నూతన రాజధాని అభివృద్ధికి ముందడుగు పడింది.. పాలనా యంత్రాంగం ప్రజల చెంతకు వచ్చింది. పెట్టుబడులు పెట్టేందుకు తమ రాష్ట్రం కూడా ఉందని సగర్వంగా చెప్పడమే కాకుండా.. పెడితే ఎంత సురక్షితమో, ప్రయోజనకరమో చెప్పగలిగింది. సొంత గడ్డపై నుంచే పాలన చేద్దామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపందుకుని ఉద్యోగులు తరలిరావడం, అమరావతికి భూములిస్తామంటూ రైతులు ముందుకురావడం, ప్రవాసాంధ్రులూ చేయూతనివ్వడం ఏపీ ఆర్థికాభివృద్ధికి మార్గాన్ని సుగమం చేశాయి. గడిచిన నాలుగేళ్ల సగటు చూస్తే ఏపీ ఆర్థిక వృద్ధి రేటు 10.36 శాతంగా ఉంది. డబ్బుల్లేవని గుడిసె వేసుకుని ఉండనని.. ప్రపంచంలోనే ఐదు అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా అమరావతిని నిర్మిస్తానని ఆత్మవిశ్వాసంతో చెప్పిన చంద్రబాబు.. ఆ దిశగా స్విస్ చాలెంజ్ పద్ధతిలో టెండర్లు ముగించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్‌తో పాటు ఇతర రోడ్ల నిర్మాణమూ ప్రారంభించారు. అంతకంటే ముందు వెలగపూడి గ్రామంలో తాత్కాలిక సచివాలయాన్ని నిర్మించారు. శాసనసభ నిర్మాణమూ పూర్తి చేశారు. ఈ నాలుగేళ్లలో రాష్ట్రం గణనీయమైన వృద్ధి నమోదు చేయగలిగింది. 10.52 శాతం సగటు వృద్ధిని నమోదు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఆర్థిక నిర్వహణదారుగా నిలిచింది. రాష్ట్ర విభజన సమయంలో, అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, కోశ సంబంధిత, సామాజిక పరిస్థితులు ప్రతికూలంగా ప్రభావితం చూపుతాయని కేంద్ర ప్రభుత్వం ముందే గుర్తించినప్పటికీ తాను ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. రాష్ట్ర విభజన వల్ల ఉత్పన్నమైన ప్రతికూల పరిస్థితులు, 2014,ఏపీఆర్ఏ చట్టంలోని హామీలు, నిబంధనలు నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గినా రాష్ట్రం కష్టపడి ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగుపరచుకున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం వాటా 2017-18 కాలంలో 34.4 శాతానికి చేరింది. ఈ నాలుగేళ్లు రుతుపవనాలు అనుకూలంగా లేనప్పటికీ, జాతీయ సగటు వృద్ధి 2.4 శాతం ఉండగా, వ్యవసాయం, అనుబంధ రంగాలలో సగటు వృద్ధిరేటు 11 శాతంగా కనిపిస్తోంది. వ్యవసాయం లాభసాటిగా మారింది. పారిశ్రామిక రంగ ఆర్థిక వ్యవస్థ 2017-18లో రూ.1.62 లక్ష కోట్లకు పెరిగింది. సర్వీసు రంగ ఆర్థిక వ్యవస్థ 2017-18లో రూ.3.20 లక్షల కోట్లకు గణనీయంగా పెరిగింది. ఎన్ఐటీ, ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం చేసిన ప్రయత్నాల వల్ల సర్వీసు రంగంలో నిలకడ ఆర్థిక వృద్ధి సాధ్యమైంది. అధిక పన్ను ఆదాయం, తలసరి ఆదాయం అధికంగా ఉత్పత్తి చేసే సేవారంగం 43.5 శాతం వాటాను ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్నది. హైదరాబాదు నుంచి అమరావతికి రాజధాని, కార్యాలయాలను తరలించడం, 2015-16 నుండి ఉద్యోగుల వేతన స్కేళ్ల సవరణ, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పింఛను సవరణ, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆషాలు, గ్రామ సహాయకుల వేతనాల సవరణ, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజన పథకం, ఆహార ఛార్జీలు, రైతులకు రుణ మాఫీ, సామాజిక భద్రతా పింఛన్లలో ఐదు రెట్ల పెరుగుదల, మహిళా గ్రూపులకు మూలధన చేర్పు వంటి వివిధ సంక్షేమ కార్యక్రమాల రేట్లలో పెరుగుదల వంటివి రెవెన్యూ వ్యయం పెరుగుదలకు ప్రధాన కారణమైంది.

ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ వైఖరి రాష్ట్ర ఆర్థిక వనరులపై మరింత ఒత్తిడిని ఉంచింది. తక్కువ వడ్డీ రుణాల సమీకరణ, రుణాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా ఆర్థిక ఆటంకాలను అధిగమించడమవుతుంది. ప్రభుత్వం పరిమిత వనరులతో అత్యధిక ఫలితాలు సాధించడానికి వినూత్న ఆలోచనలను, సమ్మిళిత విధానాన్ని ప్రోత్సహిస్తూ, అవలంబిస్తున్నది.

సుస్థిర ప్రాతిపదికన ఆర్థిక వ్యవస్థలో స్థూల విలువ చేర్పును పెంచడానికి, పేదరికం నిర్మూలనకు దారితీసే సంపద సృష్టి కోసం ఎకో సిస్టంను అభివృద్ధి చేయడానికి దార్శనికతగా ఉంది. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి సుస్థిరత, సంపద సృష్టి ఉండేలా చూడటానికి సహజ వనరుల వ్యూహాత్మక నిర్వహణపై ప్రభుత్వం దృష్టిసారిస్తున్నది.

చేనేత పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ మూర్తి



విశాలాంధ్ర- మంగళగిరి: చేనేతను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ప్రభుత్వం చేనేతను రక్షించాల్సింది పోయి అంపశయనం పైకి నెట్టి వేసిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం 2019 క్యాలెండర్‌ను బుధవారం సత్యనారాయణ మూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా హేమసుంద రావు అధ్యక్షతన జరిగిన సభలో మూర్తి మాట్లాడుతూ చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం 25 హామీలు ఇచ్చిందని అవి అమలు చేయకుండా కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. బోగస్ సొసైటీలను సృష్టించి అవినీతి చేస్తున్నారని, ఆప్కోని రక్షించాల్సింది పోయి నిర్వీర్యం చేస్తున్నారని చెప్పారు. చేనేతను పరిరక్షించుకోవాలంటే ముందుగా ప్రభుత్వం తన విధానాలు మార్చు కోవాలని అన్నారు. చేనేత బ్రతికించు కోవాలంటే చేనేత కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలు చేయాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయని ఈ సమయంలోనే చేనేత కార్మికులు ప్రభుత్వానికి తమ సత్తా చూపాలని అన్నారు. మనుషులకు నాగరికత నేర్పిన వస్త్ర దాతకు ప్రభుత్వం మరణ శాసనం విధించిందని అన్నారు. ఈ సభలో చేనేత కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ స్వామి, సహాయ కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ నియోజక కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దస్తగిరి, చేనేత కార్మిక సంఘం కర్నూలు జిల్లా నాయకులు సోమా మోహన్, ఏరియా అధ్యక్షులు మొరం శ్రీనివాసరావు, సంఘం నాయకురాలు భూలక్ష్మీ, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



స్వయం శక్తితో మహిళలు ఎదగాలి

మహానేత చంద్ర రాజేశ్వరరావు

కుట్టు శిక్షణ సర్టిఫికెట్ల ప్రదానంలో శైలజా కిరణ్

విశాలాంధ్ర బ్యూరో - హైదరాబాద్ : ప్రతి ఒక్కరూ తమ జీవితాలను మెరుగుపరచుకునేలా పట్టుదలగా పని చేయాలని మార్గదర్శి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) శైలజాకిరణ్ అన్నారు. చేసే పని, ప్రవర్తన, పనితనంతో గుర్తింపు వస్తుందని, అందులోనూ నిజాయతీ ప్రధానమని పేర్కొన్నారు. ఎవరూ తప్పు పట్టకుండా సమర్థత, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. హైదరాబాద్ కొండాపూర్‌లో చంద్ర రాజేశ్వరరావు (సీఆర్) ఫౌండేషన్‌లోని మహిళా శిక్షణ కేంద్రంలో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను శైలజా కిరణ్ బుధవారం ప్రదానం చేశారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శైలజా కిరణ్ మాట్లాడుతూ, టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారు సర్టిపికెట్లు అందుకోవడంతో ఆగిపోకుండా మరికొందరికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. సీఆర్ ఫౌండేషన్‌లో 11 ఏళ్ల నుంచి మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. మహిళలు స్వయం శక్తితో ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. డబ్బు సంపాదనకే నేడు రాజకీయాల్లోకి వస్తున్నారని, చంద్ర రాజేశ్వరరావు తన ఆస్తులను అమ్మి పార్టీకి ఖర్చు చేశారని తెలిపారు. ప్రతి తెలుగు వ్యక్తి గర్వపడే వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. 28 సంవత్సరాలపాటు సీపీఐకి ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన రాజేశ్వరరావు గొప్ప మహనీయులని, ఆయన నేటి తరానికి ఆదర్శమని చెప్పారు. గతంలో దేశ ప్రజలు వస్తువుల తయారీ, వినియోగంలో వెనుకబడి ఉండేవారని, నేడు దుస్తులు దేశంలో తయారైన దుస్తులను అమెరికాలోనూ ధరించేస్థాయికి ఎదిగినట్లు చెప్పారు. ప్రధాన మంత్రి స్కిల్ ఇండియా పేరుతో వేలాది మందికి శిక్షణ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి 2022 వరకు నిధులు కేటాయించి, వాటి నిర్వహణకు పూనుకున్నట్లు శైలజాకిరణ్ వివరించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ, సామాజిక అభ్యున్నతి కోసం సీఆర్ ఫౌండేషన్ ఎంతగానో కృషి చేసో&ందన్నారు. వృద్ధులకు నిలువ నీడనిస్తూ, అక్కున చేర్చుకుంటుందన్నారు. సీఆర్ ఫౌండేషన్‌ను మరింత వృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వృద్ధాశ్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి, ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ, ఫౌండేషన్ నిర్వహించే సామాజిక కార్యక్రమాలు ఏ రాజకీయ పార్టీకి సంబంధంలేదన్నారు. ఇక్కడ నిర్వహించే వృద్ధాశ్రమం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. జీవితం ఎన్నో ఒడిదుడుకుల మధ్య కొనసాగుతుందని వృద్ధాప్యంలో ఇలాంటి ప్రశాంత చోట గడపాలనే దీనిని ఏర్పాటు చేశామన్నారు. గతంలో సీఆర్ ఫౌండేషన్‌కి రెండెకరాలు కేటాయించాలని అప్పటి సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సంతకం చేశారని, జీవో విడుదల చేయకముందే ఆయన పదవి నుంచి వైదొలగడంతో అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కోశాధికారి చెన్నకేశవరావు, సెంటర్ కన్వీనర్ పీ వాణిశ్రీ నల్లమలతోపాటు డాక్టర్ ప్రతిభా, నల్లమల, డాక్టర్ రజనీ కూనంనేని, కోటివిటి ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధి విజయ పాల్గొన్నారు.



ఎన్నికల వేళ... కోడి పందేల మేళా..!

విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : సంక్రాంతి కోడి పందేలకు గ్రామాలే కాదు పట్టణాలు, నగరాల్లోనూ బరులు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వం కూడా పందేలకు అడ్డు చెప్పకూడదనే యోచనతో ఉండటంతో, పందేల రాయుళ్లు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. సంప్రదాయమని, డింకీ పందేలే నిర్వహిస్తామని పైకి చెబుతున్నప్పటికీ, కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చక చకా జరుగుతున్నాయి. సంక్రాంతి పందేల కోసమే ప్రత్యేకంగా మామిడి తోటలలో కోళ్ల ఫారాల మాటున పందేపు కోళ్లను మేపుతున్నారు. ఒక్కో ఫారంలో వెయ్యి వరకు పందెం పుంజులు ఉంటున్నాయి. అధికార టీడీపీ నాయకులతోపాటు ప్రతిపక్ష వైసీపీ నేతలకూ పందెం కోళ్ల ఫారాలు ఉండటం గమనార్హం. చివరకు పోలీసు ఉన్నతాధికారులుసైతం మిత్రుల సహకారంతో పందెం కోళ్ల ఫారాలను రహస్యంగా నిర్వహిస్తున్నారంటే ఆశ్చర్య పడాల్సిన అవసరంలేదు. రాజధాని విజయవాడ సమీపంలోనే 500 వరకు కోడి పుంజుల ఫారాలు ఉన్నాయి. మామిడి తోటలను లీజుకు తీసుకుని మరీ వీటిని నిర్వహిస్తున్నారు. అడపా దడపా పోలీసులు దాడులు చేసినా, తృణమో, ఫలమో ఇచ్చి పంపిస్తుం టారు. ఎన్నికల సంవత్సరం కావటంతో ఎట్టి పరిస్థితు లోనూ పందేలు జరుగుతాయనే ధీమాతో పందేల రాయుళ్లు ఉన్నారు. ప్రభుత్వంసైతం పందేలకు అను కూలంగా ఉన్నందునే పందేల నిర్వహణపై నేటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. పందేల విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, పందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామంటూ రొటీన్ ప్రకటనలు, హెచ్చరికలకే పోలీసులు పరిమితమవు తున్నారు. పందేలలో నష్టపోయిన అనేక మంది ఆస్తులను అమ్ముకుంటున్న సందర్భాలూ ఉన్నాయి. అయినప్పటికీ, కోడి పందేల విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించలేని పరిస్థితి నెలకొంది. పొరుగు రాష్ట్రాల్లో ప్రాణాలతో చెలగాటమాడే జల్లికట్టుకు అను మతిస్తూ, రాష్ట్రంలో ప్రాణాపాయంలేని కోడి పందేలకు ఎందుకు అనుమతివ్వరనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

హైకోర్టు హెచ్చరించినా...

కోడి పందేలపై గత సంవత్సరం పక్షం రోజుల ముందే హైకోర్టు ఆంక్షలు విధించింది. పోలీసు, రెవెన్యూశాఖలతో పోలీస్ స్టేషన్ల వారీగా కమిటీలను ఏర్పాటు చేయాలని, పందేలు జరగకుండా చర్యలు చేపట్టాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయిన ప్పటికీ, పందేలు ఎక్కడా ఆగలేదు. సాక్షాత్తు రాజధాని అమరావతిలోనే భారీ ఎత్తున కోడిపందేలు జరిగాయి. తొలి రోజున కొన్ని చోట్ల పోలీసులు కోడి పందేల బరుల వద్దే తిష్టవేసినా, ప్రభుత్వం నుంచి వర్తమానం అంద టంతో బరులను వదిలేసి వెళ్లిపోయారు. గతేడాది సుమారు రూ.వెయ్యి కోట్లమేర పందేలు జరిగాయి. ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయ కులు దగ్గరుండి మరీ పందేలను ప్రారంభించారు. కోళ్లకు కత్తులు కట్టటంలేదని, డింకీ పందేలు వేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఫలితంగా గతేడాది రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కోర్టు మెట్లెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో కోళ్లకు కత్తి కట్టి పందేలు జరగ లేదని, డింకీ పందేలే జరిగాయంటూ తప్పుడు నివేదిక ఇవ్వటంపైనా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విధితమే. అయినప్పటికీ పందేలను అడ్డుకునేందుకు ప్రభుత్వంగానీ, పోలీసు యంత్రాంగంగానీ నేటి వరకు ప్రణాళిక రూపొందించిన దాఖలాలే లేవు. ఇప్పటికే కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, విజయ నగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర జిల్లాల్లో కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బరుల వద్దే సకల సౌకర్యాలు

కోడి పందేలరాయుళ్ల కోసం బరుల వద్దే సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. పందేల కోసం ప్రత్యేకంగా మామిడి తోటలు, కొబ్బరి తోటలు, ఇతర పండ్ల తోటలను నిర్వాహకులు లీజుకు తీసుకుంటారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు, ఇతర ముఖ్యమైన వారి కోసం తాత్కాలికంగా వసతి ఏర్పాట్లు చేస్తుంటారు. ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా తోటల్లో బరుల వద్దే సకల సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఉభయ గోదావరి జిల్లాల్లో పలు తోటల్లో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది రూ.వెయ్యి కోట్ల పందేలు జరిగితే, ఈసారి పండుగ మూడు రోజులలో సుమారు రూ.2 వేల కోట్లపైనే పందేలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. సంక్రాంతి పండుగ కోసం అమెరికా, ఆస్ట్రేలియాతోపాటు విదేశాల్లో స్థిరపడిన వారు సొంతూళ్లకు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉభయ గోదావరి జిల్లాల వాసులు విదేశాల్లో పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. పందేల కోసం వారంతా ముందు గానే స్థానిక బ్యాంకుల్లోని తమ ఖాతాలకు మనీ ట్రాన్స్‌ఫర్ కూడా చేసేశారు. కోడి పందేల కోసమే పందేల రాయుళ్లు డబ్బును ముందుగానే సమకూర్చు కుంటున్నారు. సంక్రాంతి సమయంలో తెల్లవార్లూ కోడి పందేలు జరుగుతాయి. పందేలను తిలకించే వారి కోసం హోటల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. పురుషులు, కుర్రకారుకు తామేమీ తీసిపోమంటూ మహిళలు, యువ తులు కూడా పందేలకు తరలివస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పందేలకు ఎంజాయ్ చేస్తున్నారు. ఈ ఏడాది ఆంక్షలు ఉండవనే ఉద్దేశంతో గతంకంటే భిన్నంగా ఏర్పాట్లు చేసేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. బరుల వద్దే మద్యం విక్రయాలు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మద్యం షాపుల యజమానులే కోడి పందేల బరుల వద్ద ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిసింది.

జూద క్రీడల నిర్వహణకు పోటీ

కోడి పందేల సమయంలో జూద క్రీడలు కూడా పోటా పోటీగా సాగుతాయి. కోతముక్క, గుండాట లేకుండా పందేలే ఉండవు. వీటిలో మంచి లాభం ఉంటుండటంతో ద్వితీయశ్రేణి నాయకులు ఈ ఆటల నిర్వహణపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఎవరికి వారు తాము నిర్వహిస్తామంటే తామంటూ పోటీ పడు తున్నారు. దీంతో స్థానికంగా రాజకీయ పార్టీల నేతలు జోక్యం చేసుకుని వాటాలతో గుండాట, కోతముక్క నిర్వహణకు రాజీ కుదురుస్తుండటం గమనార్హం. ఈ రెండు జూదాల్లో వందల కోట్ల రూపాయల లావాదేవీలు జరిగే అవకాశం ఉంది. ఇందుకోసం పొరుగు రాష్ట్రాల నుంచి కూడా జూద క్రీడల నిర్వాహకులు తరలిరానున్నట్లు తెలిసింది.

ఏపీకి చాలా చేశాం

ఏపీ కార్యకర్తలతో మోడీ వీడియో కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరుగుతుందో తనకు తెలుసని ప్రధాని మోడీ అన్నారు. కాకినాడ, మచిలీపట్నం, నర్సాపురం, విశాఖ, విజయనగరం బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో ఢిల్లీ నుంచి మోడీ బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "జాతీయ ప్రాధాన్యమున్న 10 విద్యా సంస్థలను ఏపీలో ప్రారంభించాం. ఏపీకి ఇచ్చినన్ని సంస్థలు దేశచరిత్రలో ఏ రాష్ట్రానికీ దక్కలేదు. ఇలాంటి సంస్థలను ఏపీలో ఇంతకాలం ఏర్పాటు చేయనందుకు టీడీపీ, కాంగ్రెస్ సమాధానం చెప్పాలి. ఏపీ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటాం. మనం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, విజన్‌ను యువతకు వివరించండి. యువతతో అన్ని అంశాలపై క్షుణ్ణంగా చర్చించండి. వాళ్లు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పండి. ఏపీలో పాలకులు ఏదైనా చేసి ఉంటే ఆ పని గురించి మాట్లాడేవారు. యువత వ్యతిరేక ప్రచారాన్ని నమ్మదు. అవినీతిని సహించదు. ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేయాలి. అర్హులైన యువత ఓటు నమోదు చేసుకునేలా ప్రోత్సహించండి" అని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

అన్నీ కుంభకోణాలే..! :"ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు కుంభకోణాలకు పాల్పడ్డారు. నాడు ఎన్టీఆర్ కాంగ్రెస్‌ను దుష్ట కాంగ్రెస్‌గా అభివర్ణిస్తే, ఇప్పుడు అధికారంలో ఉన్న వాళ్లు దోస్త్ కాంగ్రెస్ అంటున్నారు. తెలంగాణ తరహాలో ఏపీలోనూ మహాకూటమిని ప్రజలు తిరస్కరిస్తారు. రాష్ట్ర ఆకాంక్షలను చాలా వరకు మా ప్రభుత్వం నెరవేర్చింది. రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు బీజేపీ కార్యకర్తలు తెలియజెప్పాలి. ఆంధ్రప్రదేశ్ మార్పు కోరుతోంది. ప్రస్తుత రాజకీయ నాయకత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఏవిధంగా విభజించింది జనం మరిచిపోయారు. ప్రజల మనోభావాలను లెక్క చేయకుండా అన్నదమ్ములను విడదీశారు. విభజనపై మిగతా పార్టీలు రాజకీయం చేస్తుంటే ఏపీకి న్యాయం కోసం మాట్లాడింది బీజేపీయే. బీజేపీ ఏం చేసిందో ప్రజలకు కార్యకర్తలు వివరించారు. జనవరి 6వ తేదీన మరోసారి మీతో మాట్లాడతా" అంటూ మోడీ తన ప్రసంగం ముగించారు.

రబీ వర్రీ..!

సాగని లక్ష్యం - నాట్లు 65 శాతమే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రబీసీజన్‌లో సాగు పనులు ముందుకు కదలడంలేదు. సీజన్ ఆరంభమై మూడునెలలు గడిసినప్పటికీ కేవలం అరవైఐదుశాతం మాత్రమే నాట్లు వేయగల్గేరు. పలు జిల్లాల్లో సాగునీటికి రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈనేపథ్యం సాగు పనులు వేగంగా చేయలేకపోతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రబీసీజన్‌లో 23.43లక్షల హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అయితే ఇప్పట వరకు 15.24లక్షల హెక్టార్లలో మాత్రమే సాగుపనులు చేయగలిగారు. అంటే 65శాతం పనులనే పూర్తి చేశారు. సాగునీటి వనరులు లభించకపోవడం వలన పనులు నత్తనడకన సాగు తున్నాయి. వరిపంట 7.45లక్షల హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 3.37లక్షల హెక్టార్లలో మాత్రమే నాట్లు వేశారు. అలాగే మినుము 3.52లక్షల హెక్టార్లలకుగాను 2.10లక్షల హెక్టార్లలో, పెసలు1.32లక్షల హెక్టార్లకుగాను 65వేల హెక్టార్లలో, వేరుశనగ 84వేల హెక్టార్లకు గాను 45వేల హెక్టార్లలో సాగు చేశారు. పొగాకు లక్షహెక్టార్లకుగాను 75వేల హెక్టార్లలో, మిర్చి 26వేల హెక్టార్లకుగాను 13వేలహెక్టార్లలో సాగు చేశారు. ఈశాన్య రుతుపవనాల వలన ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. పైగా రిజర్వాయర్ లలో నీటిమట్టం పడిపోతూ ఉన్నందున సాగునీటి వనరులకు కొరత ఏర్పడింది. పైగా భూగర్భజలాలు కూడా అడుగంటు తున్నాయి. ప్రధానంగా రాయల సీమలో ఉన్న అనంత పురం, కడప, కర్నూలు, చిత్తూరులతోపాటు నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో నీటి కొరత ఎక్కువగా ఉంది. దీంతో రబీసాగుకు పెను ఆటంకాలు కలుగు తున్నాయి. ప్రధానంగా వరిసాగు సగానికి సగం పడి పోయింది. 7.45లక్షల హెక్టార్లలో సాగు చేయాల్సిఉండగా కేవలం 3.37లక్షల హెక్టార్లలోనే నాట్లు వేశారు. దీంతో వరిదిగుబడులపై పెను ప్రభావం చూపుతుందని విశ్లేషకులు అంటున్నారు. అసలే ఈఏడాది ఆరంభంలో ఖరీఫ్ సీజన్‌లో కూడా వర్షాలు కురవకపోవడం వలన వ్యవసాయంలో తీవ్ర సంక్షోభం తలెత్తింది. వర్షపాతం లోటు వలన రాష్ట్రంలో 347 మండలాలను కరవు మండలాలుగా గుర్తించి ప్రకటించారు. ఖరీఫ్ నుంచి అతికష్టంపై గట్టెక్కిన రైతాంగానికి రబీ సీజన్‌లో కూడా చుక్కెదురైంది.

ఐదుజిల్లాల్లో యాభైశాతంలోపే పనులు

రాష్ట్రంలో ఐదుజిల్లాల్లో యాభైశాతంలోపే సాగు పనులు అయ్యాయి. దీనిలో గుంటూరు జిల్లాలో 35శాతం మేరకు మాత్రమే పనులు అయ్యాయి. ఇక్కడ 2.05లక్షల హెక్టార్లలో సాగు చేయాల్సిఉండగా ఇప్పటివరకు 72వేల హెక్టార్లలో నాట్లు వేశారు. ప్రధానంగా నాగార్జున సాగర్ డ్యామ్ కుడికాలువ నుంచి ఆశించినస్థాయిలో నీటిని విడుదల చేయకపోవడం వలన సాగుపనులు ముందుకు వెళ్లడంలేదు. అలాగే తూర్పుగోదావరి జిల్లాలో 36శాతం పనులు జరిగాయి. ఇక్కడ 2.28 లక్షల హెక్టార్లకుగాను 83వేల హెక్టార్లలో నాట్లు వేశారు. విజయనగరం జిల్లాలో 37శాతం, విశాఖ పట్నం జిల్లాలో 48శాతం, నెల్లూరు జిల్లాలో 41 శాతం పనులు మాత్రమే అయ్యాయి. రబీ సాగు పనుల్లో ఈ ఐదు జిల్లాలు అథమస్థానంలో ఉన్నాయి.

ఏడు జిల్లాల్లో కొంత మెరుగ్గా

రాష్ట్రలో ఏడు జిల్లాల్లో సాగు పనులు కొంత మెరుగ్గా ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 89శాతం, కడప జిల్లాలో 83శాతం, కర్నూలు 71శాతం, శ్రీకాకుళం 81శాతం, పశ్చిమగోదావరి 64శాతం, కృష్ణా 63శాతం, ప్రకాశం జిల్లాలో 79శాతం పనులు పూర్తి చేయగలిగారు.

చిత్తూరుజిల్లాలో అత్యధికంగా

రాష్ట్రంలో రబీలో చిత్తూరు జిల్లాలో అత్యధికంగా సాగు జరిగింది. 194శాతం సాగు పనులు చేశారు. 67,494 హెక్టార్లలో సాగు చేయాల్సిఉండగా 1.31లక్షల హెక్టార్లలో నాట్లు వేశారు. సెప్టెంబరు నెలలో ఎక్కువగా వర్షాలు కురవడంతో ఈ ప్రాంతంలో కొంత మేలు జరిగింది. దీనిలో ఎక్కువగా మెట్టపంటలైన ఉలవలు, మినుము, పెసర, వేరుశనగ వంటి పంటలను రైతాంగం సాగు చేసింది.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయకపోవడం తప్పే


తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాయల సీమలో హైకోర్టుని ఏర్పాటు చేయకపోవడం ఒక చారిత్రక తప్పిదమేనని ఏపీసీసీ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి విమర్శించారు. విజయవాడలో బుధ వారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ ఇది శ్రీబాగ్ ఒప్పందాన్ని, అధికార వికేంద్రీకరణ సూత్రాన్ని విస్మరించడమేనని ప్రభు త్వంపై ధ్వజమెత్తారు. దేశంలో 12 రాష్ట్రాల్లో రాజధానులు, హైకోర్టులు వేర్వేరు ప్రాంతాలలో ఏర్పాటు చేయబడ్డాయన్నారు. వీటిని పరిశీలించి హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేస్తే ఆహ్వా నించేవారమన్నారు. రాజధాన్ని కోస్తా ప్రాంతంలో ఏర్పాటు చేసినందున, హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్షనేత జగన్‌లు ఇరువురు రాయలసీమ ప్రాంతవాసులై ఉండి రాయలసీమకు అన్యాయం చేశారని విమర్శిం చారు. రాయలసీమలో కనీసం హైకోర్టు బెంచినైనా ఏర్పాటు చేయాలని తులసిరెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

అవినీతిరహిత రాష్ట్రమే లక్ష్యం

కేంద్ర ఉద్యోగులపైనా దాడులు

ఏసీబీ డీజీపీ ఠాకూర్



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : అవినీతిరహిత రాష్ట్రంగా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండాలనే లక్ష్యంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ), అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) ఇన్‌చార్జి డీజీ ఆర్‌పీ ఠాకూర్ చెప్పారు. అధికారుల సమష్టి కృషి, ప్రభుత్వ సహకారం వల్లే అతి తక్కువ అవినీతి రాష్ట్రాల్లో దేశంలో మూడోస్థానంలో ఉన్నట్లు చెప్పారు. గతంలో ఈ ర్యాంక్ 16గా ఉందని తెలిపారు. విజయవాడలోని ఏసీబీ ప్రధాన కార్యా లయంలో ఆశాఖ సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీబీ డైరెక్టర్లు శంఖబ్రత బాగ్చి, పీ హరికుమార్, డిప్యూటీ డైరెక్టర్ అబ్రహం లింకన్, ముఖ్య సలహాదారు ఎం వెంగయ్యతో కలిసి 2018 వార్షిక నివేదికను ఠాకూర్‌విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పటి వరకు అవినీతికి పాల్పడే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపైనే ఏసీబీ దాడులు నిర్వహించేదని, ఇక నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపైనా దాడులు చేస్తామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం గతేడాది నవంబరులో రాష్ట్రంలో సీబీఐకి ఇచ్చిన సాధారణ సమ్మతిని ప్రభుత్వం ఉపసంహరిం చుకుందన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల అవినీతిపైనా ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే మచిలీపట్నంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అవినీతిపరులు లంచం తీసుకోవాలంటేనే భయపడేలా చేస్తామని పేర్కొన్నారు.

పెరుగుతున్న శిక్షలు

ఏసీబీ నమోదు చేసిన కేసులలో నిందితులకు శిక్షలను ఖరారు చేయటంలో పురోగతిని సాధిస్తున్నట్లు ఠాకూర్ చెప్పారు. 2017లో 86 కేసులకుగానూ 45 కేసుల్లోని (52.32 శాతం) నిందితులకు శిక్షపడినట్లు చెప్పారు. 2018లో మొత్తం 66 కేసులకు 38 మందికి (57.57 శాతం) శిక్షలు పడినట్లు తెలిపారు. ఈ విష యంలో ప్రభుత్వం అందించిన సహకారం మరవలేమని చెప్పారు. ప్రతి జిల్లాలోనూ ఏసీబీ కార్యాలయాలకు సొంత భవనాలను సమకూర్చగా, రూ.కోటితో వాహన సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. అలాగే ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయటం వల్ల కేసుల విచారణను వేగవంతం చేసినట్లు తెలిపారు. అవినీతిరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అదనంగా 350 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఫలితంగా తమశాఖ పనితీరు కూడా మెరుగుపడినట్లు వివరించారు.

146 కేసుల నమోదు


గతేడాది రాష్ట్రంలో మొత్తం 146 అవినీతి కేసులను నమోదు చేసినట్లు ఠాకూర్ వెల్లడించారు. అందులో 107 లంచం తీసుకుంటుండగా దాడి చేసినవి, 31 ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులుకాగా, ఎనిమిది నిధుల దుర్వినియోగానికి చెందిన కేసులన్నారు. ఆయా కేసుల్లో రూ.55 కోట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టిన కేసులలో నిందితుల ఆస్తుల విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.54.72 కోట్లుగా ఉందన్నారు. ఏసీబీపై ప్రజలలో మరింత అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే సామాజిక మాధ్యమాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అవినీతి పరుల ఆట కట్టిస్తున్నామన్నారు.

మరో దుబారా..!

అమరావతికి జన యాత్ర

రూ.కోట్ల ఖర్చుతో సీఆర్‌డీఏ గారడీ

పోలవరం సందర్శన తరహాలో హడావుడి



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఉద్యోగులకు వేత నాల పెంపు సహా ఆయా ఆర్థిక సంబంధ విషయాల్లో బీదతనాన్ని ప్రదర్శించే చంద్రబాబు ప్రభుత్వం దుబారా ఖర్చుల్లో ఏమాత్రం వెనుకాడడంలేదు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో ప్రభుత్వ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించి ప్రచారం చేసుకోవడంలో టీడీపీ అందెవేసిన చేయిగా చెప్పవచ్చు. రాజధాని శంకుస్థాపన మొదలుకుని పోలవరం నిర్మాణంలో వివిధ దశల్లో చేపట్టే పనులు, నవనిర్మాణ దీక్షలు.. ఇలా అన్ని కార్యక్రమాలను ప్రచార వేదికలుగా వాడుకుంటోందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తునే ఉన్నాయి. అయినా వాటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా తిరిగి అధికారాన్ని చేజిక్కించుకోవడమే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగిపోతోంది. ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమం చారిత్రాత్మకమని, ప్రపంచంలో ఇంకెక్కడా జరగడంలేదనే భావాన్ని ప్రజల్లో కల్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సైతం వినియోగించుకుంటోంది. తాజాగా డిసెంబరు 27న అమరావతిలో సచివాలయం, హెచ్‌ఓడీల భవనాల నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. పోలవరం తరహాలోనే అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు చూపించాలని ఆదేశాలు జారీ చేయడంతో రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) ఆ బాధ్యతను తన భుజాలపై వేసుకుంది. రాష్ట్ర నలు మూలల నుంచి ప్రజలను ఆర్టీసీ బస్సుల్లో అమరావతిని సందర్శించేందుకు 'అమరావతి ప్రజాయాత్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఒక రోజు సమయం పట్టే ఈ యాత్రలో వివిధ జిల్లాల నుంచి సమీకరించిన విద్యార్థులు, యువకులు, రైతులు, తదితరులను బస్సుల్లో అమరావతికి తరిలిస్తోంది. భవన నిర్మాణ పనులను చూపించి, వివరించేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమించింది. ప్రయాణ ఖర్చులతోపాటు అల్పాహారం, భోజన సదుపాయాలను సీఆర్‌డీఏనే భరిస్తోంది. ఒక్కొక్కరికి సుమారు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. రోజుకు దాదాపు 500 మంది చొప్పున ఐదు రోజుల్లో 2,500 మంది రాజధాని ప్రాంతాన్ని సందర్శించారు. ఫిబ్రవరి వరకు ప్రణాళికను రూపొందించిన అధికారులు ప్రజాయాత్రలో బిజీబిజీగా ఉన్నారు.

పోలవరం బకాయిలే రూ. 50 కోట్లు?

పోలవరం సందర్శనార్థం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులకు ప్రభుత్వం రూ. 50 కోట్ల వరకూ బకాయి ఉన్నట్లు తెలిసింది. పోలవరం సందర్శనకు వచ్చే వారికి భోజనం, రవాణా, ఇతర సదుపాయాలను కల్పించేందుకు జలవనరులశాఖ రూ.22.5 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఒక్కో జిల్లాకు రూ.1.73 కోట్ల చొప్పున కేటాయించింది. ఈ మొత్తానికి 2018 ఏప్రిల్‌లో జీవో ఆర్టీ నెంబరు 311 ద్వారా ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ సందర్శకులకు ఈ మొత్తాన్ని అధికారులు ఖర్చు చేశారు. ఒక్క కృష్ణాజిల్లాలోనే ఇప్పటి వరకూ 3,300 బస్సుల్లో 1.32 లక్షల మందిని తరలించడం ద్వారా రూ. 10.70 కోట్లు ఖర్చవ్వగా, ఆర్టీసీకి రూ.4.93 కోట్లు మాత్రమే చెల్లించినట్లు సమాచారం. 13 జిల్లాల నుంచి రూ. 50 కోట్ల మేర ప్రభుత్వం చెల్లింపులు జరగాల్సి ఉన్నట్లు తెలిసింది. భవన నిర్మాణాలను చూస్తే ప్రజలకు ఏం అవగాహన వస్తుందో అర్థం కావడంలేదని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలకు చెందిన నాయకులు పేర్కొంటున్నారు. 'అమరావతి ప్రజాయాత్ర' పేరిట ప్రభు త్వం కోట్లాది రూపా యల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని దుయ్య బడుతున్నారు. వివిధ ప్రాంతాల్లోని భవనాల పునాదులు చూపించి చివరకు ఉద్ధండ రాయునిపాలెంలో ఉన్న రాజధాని అమరావతి నమూనా వద్దకు తీసుకెళ్లి మొత్తం నిర్మాణాలు పూర్తయితే రాజధాని ఇలా ఉంటుంది అంటూ అరచేతిలో స్వర్గం చూపిస్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకూ పోలవరం సందర్శన కోసం ఎంత ఖర్చుచేసిందో శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని పలువురు డిమాండు చేస్తున్నారు.

ఒక్కరోజే రెండు వేల మంది సందర్శన

అమరావతి రాజధాని నగర సందర్శన యాత్రకు బుధవారం రెండు వేలమంది రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చారు. మొత్తం 42 బస్సుల్లో ఉద్దండరాయునిపాలెం ఎక్స్‌పీరియన్స్ సెంటరుకు వచ్చిన వీరికి సీఆర్‌డీఏ అధికారులు స్వాగతం పలికారు. ఇక్కడ రాజధాని నగరానికి సంబంధించిన ప్రణాళిక, ఇతర ప్రాజెక్టుల విశేషాలతో కూడిన త్రీడీ మోడల్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను చూపించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన పలు మండలాల నుంచి ప్రజలు వచ్చారు.

గట్టిపోటీ ఇస్తాం : పైన్

సిడ్నీ: టీమిండియాతో జరిగే నాలుగో టెస్టులో గట్టిపోటీ ఇవ్వడంపైనే దృష్టి సారించామని ఆస్ట్రేలియా సారథి టిమ్‌పైన్ అన్నాడు. గెలుపోటముల గురించి ఆలోచించడం లేదన్నాడు. భారత్ ఇంతకు ముందు ఎప్పుడూ ఆస్ట్రేలి యాలో సిరీస్ గెలవలేదు. నాలుగు టెస్టులో సిరీస్‌లో కోహ్లిసేన 2-1తో ఆధిక్యంలో ఉంది. చరిత్ర సృష్టించేం దుకు మ్యాచ్ దూరంలో నిలిచింది. కాగా చివరి టెస్టు గెలిచి సిరీస్‌ను డ్రా చేయాలని ఆస్ట్రేలియా భావిస్తోంది. 'మేం మెరుగవ్వడం, వీలైనంత వరకు అత్యుత్తమ క్రికెట్ ఆడటంపైనే దృష్టి సారించాం. ఆడే ప్రతి టెస్టు గెలవాలనే కోరుకుంటాం. కొన్నిసార్లు అలా కుదరదు. ప్రస్తుతం అత్య ద్భుతంగా ఆడుతున్న ప్రపంచ నంబర్ వన్ జట్టుతో మేం పోటీపడుతున్నాం. సిరీస్ చేజార్చుకోవడం గురించి ఆలో చించడం లేదు. స్ఫూర్తి పొందేందుకు ఒక్కో ఆటగాడు వేర్వేరు పనులు చేస్తుంటాడు. మేం మెరుగవ్వడం, ప్రతి సారీ పోటీపడటం, టీమిండియాతో సిసలైన సమరానికి దిగడం నాకు ప్రేరణ. మా జట్టు నిలకడగా మెరుగవు తోంది. మా బ్యాట్స్‌మెన్ పూర్తిస్థాయిలో ఫామ్‌లో లేరు. ఒకరు ఆడితే మరొకరు ఆడటం లేదు. శతకాలు చేయ కుండా మ్యాచ్‌లు గెలవలేమని తెలుసు. దీర్ఘ కాలం సేవ లందించే బ్యాట్స్‌మెన్‌కు అవకాశాలు ఇస్తున్నాం. అశ్విన్ ఆడటం లేదని తెలిస్తే మా బ్యాట్స్‌మెన్ సంతోషిస్తారు. కానీ కుల్‌దీప్, జడేజా ఉన్నారు' అని పైన్ అన్నాడు.



ఉదయం 5 గంటలకు సోనీ సిక్స్, సోనీ టెన్3లో



సచిన్ గురువు కన్నుమూత

ముంబై:
ద్రోణాచార్య పురస్కార గ్రహీత, ప్రముఖ క్రికెట్ కోచ్ రమాకాంత్ అచ్రేకర్ (87) ఇక లేరు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు ఆటలో ఓనమాలు దిద్దించిన ఆయన బుధవారం సాయంత్రం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. 'ఆయన (అచ్రేకర్ సర్) మనకిక లేరు. బుధవారం సాయంత్రం కన్నుమూశారు' అని కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. ప్రపంచానికి తిరుగులేని క్రికెటర్ సచిన్‌ను తీర్చిదిద్దిన ఘనత అచ్రేకర్‌కే చెందుతుంది. వినోద్ కాంబ్లి, ప్రవీణ్ ఆమ్రె, సమీర్ దిఘె, బల్విందర్ సింగ్ సంధు, అజిత్ అగార్కర్ వంటి క్రికెటర్లకు ఆయన శిక్షణ నిచ్చారు. పద్మశ్రీ పురస్కారం గ్రహీత అచ్రేకర్‌కు సచిన్ టెండూల్కర్ ప్రియశిష్యుడు. ఆయనను తన మార్గదర్శకులని సచిన్ ఎన్నోసార్లు చెప్పాడు. ప్రతి గురుపౌర్ణమికి ఆయన ఇంటికి వెళ్లి గౌరవించేవాడు. శాలువా కప్పి సత్కరించేవాడు. బాల్యంలో ఆయనెంత కఠినంగా శిక్షణనిచ్చారో గుర్తు చేసుకొనేవాడు. అచ్రేకర్1932లో జన్మించారు. క్రికెట్ కెరీర్ అంత సవ్యంగా సాగలేదు. 1943లో క్రికెట్ ఆడటం ప్రారంభించారు. 1945లో న్యూ హిందు స్పోర్ట్స్ క్లబ్ తరఫున ఆడారు. యంగ్ మహారాష్ట్ర ఎలెవన్, గుల్ మోహర్ మిల్స్, ముంబై పోర్ట్‌కు ప్రాతినిధ్యం వహించారు. 1963-64 మొయిన్‌ద్దొలా టోర్నీలో ఆల్ ఇండియా స్టేట్ బ్యాంకు జట్టు తరఫున హైదరాబాద్‌పై ఒక ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడారు. ముంబైలోని శివాజీ పార్క్ వద్ద కామత్ స్మారక క్రికెట్ క్లబ్‌ను ప్రారంభించారు. ఎంతో మంది క్రికెటర్లకు ఆయన పాఠాలు చెప్పారు. ఘనకీర్తి తెచ్చిపెట్టింది మాత్రం సచిన్ టెండూల్కరే. ప్రస్తుతం ఈ క్లబ్‌ను అచ్రేకర్ కుమార్తె కల్పన, అల్లుడు దీపక్ నిర్వహిస్తున్నారు.



సిడ్నీ సుల్తాన్...?

- నేటి నుంచి ఆఖరి టెస్టు
- చారిత్రక విజయంపై టీమిండియా కన్ను
- తుది జట్టులో అశ్విన్ అనుమానం
- పరువు కోసం ఆసీస్ పోరు

పేపర్ పులులు... విదేశాల్లో అపజయాలు పునరావృతమవుతున్న తరుణంలో టీమిండియాకు సీనియర్లతో సహా పలువురు పెట్టిన ముద్దుపేరు అది. అయితే దాన్ని తొలగించేందుకు ప్రస్తుతం కోహ్లిసేన శాయశక్తులా ఒడ్డేందుకు సిద్ధమైంది. నేటి నుంచి సిడ్నీలో మొదలయ్యే ఆఖరి టెస్టుకు టీమిండియా రె'ఢీ'గా ఉంది. చారిత్రక విజయానికి అడుగు దూరంలో నిలిచింది. మ్యాచ్ గెలిచినా చరిత్రే.. డ్రాయి అయినా చరిత్రే అవుతుంది. మరి ఫలితం ఏ విధంగా ఉంటుందో వేచి చూడాలి.

(విశాలాంధ్ర స్పోర్ట్స్ డెస్క్)
విదేశీ గడ్డపై సిరీస్ ఆధిక్యంతో ఆఖరి టెస్టు కోసం బరిలో దిగడం అదికూడా ఆసీస్ గడ్డపై... దిగ్గజాల నాయ కత్వంలో సాధ్యంకాని ఘనత కోహ్లి ముందు నిలిచివుంది. సిరీస్ తొలి మ్యాచ్‌ను గెలిచి ఆధిక్యంతో తన ఆట మొదలు పెట్టిన టీమిండియా ఆఖరి టెస్టులోనూ ఆధిక్యంతోనే బరిలో దిగుతోంది. 3-1 తేడాతో గెలిచి చరిత్ర సృష్టిం చడమే లక్ష్యంగా నేడు సిడ్నీలో అడుగుపెడుతోంది. అయితే చివరి టెస్టుకూ కోహ్లి సేన జట్టు కూర్పు విషయంలో ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. నాలుగో టెస్టు కోసం ప్రకటించిన 13 మంది జట్టులో భారత ప్రధాన స్పిన్నర్ అశ్విన్‌కు చోటు కల్పించినా..అతడి ఫిట్‌నెస్‌పై అనుమానాలు కొనసాగుతూనే ఉన్నాయి. తొలి మూడు టెస్టుల్లో బౌలింగ్‌లో ప్రధాన పాత్ర పోషించిన ఇషాంత్‌కు చివరి జట్టులో చోటు కల్పించలేదు. పక్కటెముక నొప్పితో అతడు బాధపడుతున్నాడు. అతడి స్థానంలో రెండో టెస్టులో విఫలమైన ఉమేశ్‌కు చోటు కల్పించారు. మరి కోహ్లి నిర్ణయం ఎంత వరకూ మేలు చేస్తుందో తేలాల్సి ఉంది. స్పిన్‌కు అనుకూలించే సిడ్నీ పిచ్‌పై అశ్విన్ గైర్హాజరీ అయితే పెద్ద లోటే అని చెప్పాలి. జట్టులో కుల్దీప్‌కూ చోటు కల్పించడం ద్వారా అతడు జడేజాతో కలిసి స్పిన్ విభాగాన్ని నడిపే అవకాశాలు ఉన్నాయి. ఇక బ్యాటింగ్‌లో మిడిలార్డర్‌లో రోహిత్ మళ్లీ జట్టుకు దూరం కావడంతో విహారి రోహిత్ స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. ఓపెనర్‌గా మాయాంక్‌తో కేఎల్ రాహుల్ జతకట్టనున్నాడు. ఓపె నర్‌గా రాహుల్ ప్రదర్శన కీలకం కానుంది. ఆసీస్ కూడా ఆఖరి టెస్టు గెలిచి పరువు నిలుపునేందుకు తమ జట్టు లోనూ భారీ మార్పులు చేసింది. మరో సీనియర్ పేసర్ పీటర్ సిడిల్‌ను జట్టులో చేర్చింది. యువ లెగ్ స్పిన్ ఆల్‌రౌండర్ మార్నస్ లాబస్‌చేను జట్టులో తీసుకోవడంతో ఆసీస్ కూడా ఇద్దరు స్పిన్నర్ల వ్యూహంతో బరిలో దిగే అవకాశాలు ఉన్నాయి. ఓపెనర్ ఫించ్ విఫలం కావడంతో అతడి స్థానంలో ఖవాజాని ఆడించ వచ్చని తెలు స్తోంది. హేండ్స్‌కోంబ్‌ను మళ్లీ జట్టులో తీసుకోవడంతో మూడో టెస్టులో విఫలమైన మిచెల్ మార్ష్‌ను పక్కన పెట్ట వచ్చు. ఆట కొనసాగే కొద్దీ పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండడంతో నాలుగో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కష్టం కానుంది. దీంతో టాస్‌కూడా ఆటలో కీలక పాత్ర పోషించనుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓడి, సిరీస్ డ్రాగా ముగిసినా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కోహ్లి సేన సొంతం కానుంది.

జట్టు వివరాలు

భారత్ జట్టు:
కోహ్లి (కెప్టెన్), రహానె(వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, పుజారా, హనుమ విహారి, రిషబ్‌పంత్(కీపర్), జడేజా, కుల్దీప్ యాదవ్, అశ్విన్, షమీ, బుమ్రా, ఉమేశ్ యాదవ్.

ఆస్ట్రేలియా జట్టు:
టిమ్ పైన్ (కెప్టెన్, కీపర్), మార్కస్ హారిస్, ఆరోన్ ఫించ్, ఉస్మాన్ ఖవాజా, ట్రావిస్ హెడ్, పీటర్ హేండ్స్‌కోంబ్, షాన్ మార్ష్, మిచెల్ మార్ష్, నాథన్ లయోన్, మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, మార్నస్ లాబస్‌చే, పీటర్ సిడిల్

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.